UNIVERSAL
LIBRARY
OU_204339
UNIVERSAL
LIBRARY

ఆంధ్ర గ్రంథరత్నాకరము ౮వ అనుబంధము.

బాలభారతీ గ్రంథనిలయము ౮వ రత్నము.

# మేవాడుపతనము.

నాటకకర్తలనగ్రగణ్యులగు,

శ్రీ ద్విజేంద్ర లాల్ రాయల

బంగాళీ గ్రంథమునకు

అనువాదకర్తలు:

శ్రీ పాలపర్తి సూర్యనారాయణగారు,

సంపాదకులు:

శ్రీ జంధ్యాల శివన్నశాస్త్రిగారు.


ప్రకాశకులు.

ఆంధ్ర గ్రంథరత్నాకర కార్యాలయము, గుంటూరు.



కాపీరైట్ రిజిష్టరు


చందాదారులకు రు. 1-0-0] [ఇతరులకు రు. 1-4-0.

PRINTED BY
K. Kodanda Ramayya Garu,
AT THE
**Andhra Grandhalaya Press, Ld ,**
BEZWADA.
1925

# బాలభారతీ గ్రంథనిలయమునకు
## రాజపోషకులు

(1) మ. రా. శ్రీ. బొల్లినగరం ఎల్లమంద రెడ్డిగారు
ల్యాండులార్డు, బొల్లినగరం.

(2) ,, వీరంరెడ్డి నాగిరెడ్డిగారు,
ల్యాండులార్డు, చాగలమర్రి.

(3) ,, దాసు కేశవరావుగారు,
వాణీముద్రాశాలాధిపతులు.

---

## పోషకులు

(1) ,, భమిడిపాటి కామేశ్వర శాస్త్రిగారు,
శ్రీమద్రామాయణ గ్రంథమాలా
వ్యవస్థాపకులు, రాజమండ్రి.

(2) ,, ఏడిద వెంకటారావుగారు,
ఆంధ్రసర్వస్వ వ్యవస్థాపకులు, రాజమండ్రి.

# అంకితము

శ్రీ సింగరాద్రి నరకేసరి పాదపద్మ వ్యామోహితులును,

శిష్యహృత్తమోపహారకులును,

భరద్వాజగోత్రోద్భవులును, అస్మద్గురుసత్తములునునగు

## శ్రీ పాలపర్తి నృసింహదాసుల

పాదపద్మముల సన్నిధిని

భక్తిమై సమర్పించుచున్నాను.

—అనువాదకర్త.

# విజ్ఞప్తి

ఆర్యమహాశయులారా!

పెక్కుకష్టములఁ గడచి తుదకు మా గ్రంథనిలయము నిలుపఁబడినదని చెప్పుటకు సంతసమగుచున్నది. శ్రీ పాలపర్తి సూర్యనారాయణగారు రచించిన మేవాడు పతనమును బ్రకటించు విషయమునఁ గలిగిన ప్రతిబంధకమునకుఁగాను శ్రీ ఆంధ్రగ్రంథరత్నాకర కార్యాలయమువారు సదుపాయము చేసినందులకై తదధిపతులగు శ్రీ డాక్టరు నందూరి వెంకటరావుగారికి నాహృదయపూర్వక వందనములు.

బహుభాషా విశారదులగు శ్రీ పండిత జంధ్యాల శివన్న శాస్త్రిగారు మా గ్రంథమును సంస్కరించి మా గ్రంథమాలయెడ నభిమానము వహించినందులకై వారికి మిగులఁ గృతజ్ఞుఁడను.

అన్యమండలవాసులయ్యు మాగ్రంథమాలయెడ నభిమానము వహించి పలువిధముల మాకు సహాయ మొనరించుచు గ్రంథములు రచియించి యిచ్చినట్టియు హిందీ, ఉర్దూ, ఆంధ్ర, ఆంగ్లభాషాపరిచయము గలిగినట్టియు శ్రీపాలపర్తి సూర్యనారాయణగారికి నిరంతరము కృతజ్ఞుఁడను. భాషాభిమానులందఱును మాయుద్యమమునెడ నభిమానము వహించి తగు ప్రోత్సాహ మొసఁగుదురని నమ్ముచున్నాను. నాల్గవ రత్నముగ ప్రియదర్శినిని ప్రకటింపవలసినను మిత్రులకోరికచే దీనిని ప్రకటింపఁ జేసితిమి. పిదప ప్రియదర్శిని వెలువడును.

చాగల్లు
1—4—25

సర్వజనవిధేయుఁడు
యం. రామసుబ్బయ్య శ్రేష్ఠి,
అధ్యక్షుఁడు.

# విన్నపము

పాఠకమహాశయులారా!

నేను హిందీసాహిత్య సమ్మేళనము వారి రాష్ట్రభాషా పరీక్షకై మేవాడుపతనమును హిందీలో చదువుట తటస్థించెను. అప్పుడే దీనిని తెలుఁగున ననువదించవలయునను సంకల్పము గలిగి నానేర్చిన కొలఁది దీనిని అనువదించితిని. పిదప నా యీ యనువాదమును బాలభారతీ గ్రంథనిలయాధ్యక్షులగు శ్రీ యం. రామసుబ్బయ్యశ్రేష్ఠిగారికి వినిపింప వారు దయతో దీనిని తమగ్రంథమాలలోఁ బ్రకటించుట కంగీకరించిరి. కాని శ్రీ ద్విజేంద్రలాల్ రాయల గ్రంథములన్నియు ఆంధ్రభాషలోఁ బ్రకటించు నధికారము ఆంధ్రదేశమున ఒక ఆంధ్ర గ్రంథరత్నాకరమువారికే కలదుగాన దీనిని ప్రకటించువిషయమై ప్రార్థింప వారుదయతో నంగీకరించిరి. పైగ్రంథమాలల అమూల్య సహాయముననే నా యీ గ్రంథము ప్రచురింపఁబడుటచే తత్తదధ్యక్షులగు శ్రీ సుబ్బయ్యశ్రేష్ఠిగారికిని శ్రీ నండూరి శివరావు పంతులు గారికిని నిరంతరము కృతజ్ఞుఁడను.

గ్రంథరచనకు నా కిదియే ప్రథమయత్నమగుటచే నాలోపములన్నియు సవరించియు యథోచితముగ గ్రంథమును సంస్కరించుటయే కాక గీతములు మున్నగునవి వ్రాసి యీ గ్రంథమునకు ప్రకృత రూపమును ప్రసాదించినవారును సంస్కృతాంధ్ర హిందీ వంగభాషా భూషితులును, విద్వత్కవులునునగు శ్రీ పండిత శివన్న శాస్త్రిగారి యుపకారమును మఱువఁజాలను. వారికి నా హృదయపూర్వక వందనములు.

చాగలమఱ్ఱి,
1—4—25.

విధేయుఁడు,
పాలపర్తి సత్యనారాయణ.

# భూమిక

నాటకవాఙ్మయమున నూతనశకము ప్రవర్తింపఁజేసిన శ్రీద్విజేంద్రలాల్ రాయిగారు దీనిని వంగభాషయందు రచియించి మహాకవి మైకేలు మధుసూదనదత్తునకు అంకితముచేసిరి. వర్తమాన యుగమున నాటకలేఖకులలో ద్విజేంద్రబాబును బోలినవారు భారతదేశమున లేరని పలువురయభిప్రాయము. ద్విజేంద్రుఁడు అంతర్జగత్తునకుఁ జేరిన మహాకవి. మహాకావ్యలక్షణములుగా మనయాలంకారికులచే శాసింపఁబడిన అష్టాదశవర్ణనలు వీరిరచనలందు తఱుచు గోచరింపవు. వీరు బాహ్యసౌందర్యమునకన్న ఆంతరికసౌందర్యమునే అనఁగా ప్రేమ, భక్తి, దయ, క్రోధము, ఈర్ష్య మున్నగు మనోభావములచేష్టలనే కడుహృద్యముగఁ జిత్రించెదరు. నాటకమునకు అధికసౌందర్యము నాపాదించు అంతఃప్రవృత్తుల సంగ్రామమును వీరు హృదయంగమముగఁ జూపెదరు. వీరి మానవస్వభావచిత్రణము వీరితత్త్వజ్ఞానమును జాటును. వీరి రచనలందు ఉన్మాదశృంగారమును, అశ్లీలహాస్యమును గానరావు. మఱియు వీరిహాస్యము ప్రయత్నపూర్వకముగ వ్రాయఁబడినదిగాక స్వాభావికముగను, సమయోచితముగను ఉండును. కవిబ్రహ్మయగు ద్విజేంద్రుఁడు సృజించినపాత్రములు స్పృహణీయములును ఆదర్శప్రాయములునయి యుండును. ఇంతయయ్యును వానియందు అస్వాభావికత గనుపట్టకయుండుట గొప్పవిశేషము. నాటకవాఙ్మయమున ద్విజేంద్రునకుఁగల యధికారమును, పరిజ్ఞానమును దెలిసికొనవలయునన్న వారు విశేషానుభవముతో వ్రాసిన "కాళిదాసభవభూతులు" అనుగ్రంథమును జదివి దానికి లక్ష్యములుగ వారినాటకములను జదువవలయును.

ద్విజేంద్రునకు స్త్రీలయెడ ముఖ్యముగ హిందూస్త్రీలయెడ నమితగౌరవమును పక్షపాతమును గలదని దుర్గాదాసు నందలిసరస్వతియు, మేవాడుపతనమందలి కల్యాణి, సత్యవతి, మానసియును, పాషాణి, యందలి అహల్యయు మున్నగు నాయికాపాత్రములఁజూచిన తెల్లమగును. ఇప్పటికిరువదిసంవత్సరములకు బూర్వమే వ్రాయబడిన ద్విజేంద్రుని గ్రంథములందు మహాత్మాగాంధి మున్నగుప్రస్తుతదేశనాయకుల సిద్ధాంతములగు హిందూమహమ్మదీయమైత్రి, పరమతసహిష్ణుత, అహింస, విశ్వప్రేమ మున్నగు మహావిషయములు ఆదర్శములుగఁ జిత్రింపబడుట యాతని ప్రతిభావిశేషమును బ్రకటింపుచున్నవి. ఈకాలమున ఈనాటకముల ప్రచారమెంత యావశ్యకమో వేఱుగ

జెప్పనక్కరలేదుగదా. నిక్కముగ మహాకవిరచన కాలత్రయాబా ధ్యమై హిమాలయమువలె అచలమై, ఉషఃకాలమువలె దినందినస్పృహ ణీయమై యలరారును.

ద్విజేంద్రుడు వంగభాషలో దాదాపు 25 ఉద్గ్రంథములు వ్రాసెను. అందును శ్రేష్ఠతమములగు గ్రంథరత్నముల నన్నింటిని తెలుఁగున ననువదింపఁజేసి క్రమముగఁబ్రకటింపుచు ఆంధ్రగ్రంథరత్నా కరము ధన్యతను గాంచుచున్నది. అట్టి యుత్తమగ్రంథములలో మేవాడుపతన మొక్కటి. విశ్వప్రేమను లక్ష్యముగా నుంచుకొని కవి దీనిని రచించినాఁడు. ఇందు కల్యాణియందు దాంపత్యప్రేమయు, సత్య వతియందు దేశప్రేమయు, మానసియందు విశ్వప్రేమయు చక్కఁగ పొందుపఱచఁబడినవి. విశాలహృదయములేక సంకుచితాభిప్రాయము లకు సహుఁగుటచే దేశమెట్లు విధ్వంసమగునదియు ఇందు చక్కఁగ చూపింపఁబడినది. కవి గ్రంథాంతమందలి గీతములో 'మీమనుష్యత్వ ము పోయినది. మీరు మరల మనుష్యులు కండు' అని కర్తవ్యమును చక్కఁగ నుపదేశించినాఁడు.

దీనిని హిందీరూపాంతరమునుండి తెలుఁగున అనువదించిన శ్రీ పాలపర్తి సూర్యనారాయణగారు హృద్యమగు శైలిలో స్వతంత్ర కావ్యరచన సేయ సమర్థులయ్యును హిందీభాష వారికి అభ్యాసదశలో నుండుటచే దీనిని ఉచితరీతిని సంస్కరించుటకు నన్నుఁ గోరిరి. నేను నందుకియ్యకొని దీనిని పూర్తిగా సంస్కరించితిని. ఇందు కొంత భాగము స్వయముగా తిరిగి వ్రాయవలసివచ్చుటచే నట్టి దానిని వంగమాతృకనుండియే గ్రహించితిని. ఇట్టి అమూల్యరత్నమును బ్రకటింపఁజేసి ఆంధ్రుల కృతజ్ఞతకుఁ బాత్రులగు శ్రీ యం॥ రామ సుబ్బయ్యశ్రేష్ఠిగారిని పరమేశ్వరుఁడు సకలైశ్వర్యముల నొసఁగి రక్షించుఁగాత. శ్రీ శ్రేష్ఠిగారు నిస్స్వార్థభావముతో మాతృభాషను బోషించు యువకులలో నొకరు. వీరు చాగలమఱ్ఱిలో "బాలభారతీ గ్రంథనిలయ" మను గ్రంథమాలను స్థాపించి భాషాసేవను చేయు చున్నారు. ఆంధ్రమహాజనులు వీరి గ్రంథమాలను ఆదరించుచు వీరి సదుద్యమమునకుఁ దోడ్పడుదురుగాక!

గుడివాడ, 21—7—25.

సహృదయ విధేయుఁడు,
జంధ్యాల శివన్న శాస్త్రి.

# మేవాడు పతనము.

## ప్రథమాంకము.

### ప్రథమ దృశ్యము.

స్థానము-సాలుంబరాధిపతియగు గోవిందసింహుని గృహము.

సమయము-మధ్యాహ్నము.

[గోవిందసింహుఁడును అతని పుత్త్రుఁడు అజయసింహుఁడును నిలిచి మాట్లాడుచుందురు.]

గోవిం—అజయా! మొగలుసైన్యము మేవాడుపైకి దండెత్తివచ్చుచున్నదని రాణాగారి కెవరు చెప్పిరి?

అజ—అది నాకు తెలియదు నాయనా!

గోవిం—రాణా ఏమనిరి?

అజ—సంధిచేసికొనుటయే తమ తలంపని సెలవిచ్చిరి. ఈ విషయము సంప్రదించుటకే రేపు ఉదయము దర్బారునకు రావలసినదిగా సామంతులకు కబురంపిరి. అట్లే మీకును పంపిరి.

గోవిం—నన్నెందుకు పిల్వనంపిరి?

అజ—ఆలోచించుటకు.

గోవిం—సంధి విషయమా?

అజ—అవును, తండ్రీ!

గోవిం—కాని అజయా! నేఁటిదనుక నేను సంధివిషయమై మాట్లాడియే యెఱుఁగను. పాతిక సంవత్సరములనుండి ఎడతెంపు లేక యుద్ధము చేయుటయే యెఱుఁగుదును. ఖడ్గముల ఝుంకారమును, అశ్వముల హ్రింకారములను, భేరీపటహాదుల భాంకారములను, ఆహతుల యార్తనాదంబులను మాత్రమే నేనెఱుఁగుదును. ఇన్ని దినములనుండియు నేను తెలిసికొనిన విషయము లివియే. శత్రునితో సంధిచేసికొనుట నేఁటిదనుక నేను చూచియే యెఱుఁగను. సంధియన నేమియోకూడ నేనెఱుఁగను. (అజయుఁడు మెదలకయుండును. గోవిందసింహుఁడు తలవంచుకొని యాలోచించును. మరల నడుగును.) రాణా సంధిచేసికొనుటకుఁగల కారణముకూడ నీకు చెప్పిరా?

అజ—కొన్ని సంవత్సరములనుండి మేవాడుస్థితి బాగుపడుచున్నదనియు ధనధాన్యపూర్ణమగు నీసుందర దేశమునందు ఇపుడు వ్యర్థముగా నెత్తుటేఱులు పాఱించుట మంచిదికాదనియు చెప్పిరి.

గోవిం—ఏమీ! దానికై మ్లేచ్ఛుల పాదరక్షలు శిరముల ధరింపవలయునా? ఏనాఁడు ఈసుఖభోగవిలాసము స్వర్గీయ మహారాణా ప్రతాపసింహుని స్వేచ్ఛాలబ్ధమగు దారిద్ర్యస్థానము నాక్రమించుకొనెనో నాఁడే మేవాడురాజ్యపతనము సమీపించినదని యనుకొంటిని. నాకుమారుని రాజ్యకాలమున మేవాడు మొగలులక్ష్యమవునని ఆమహాత్ముఁడు చెప్పనేచెప్పె. మొగలులును శక్తిమదాంధతచే నున్మత్తులైయున్నవారు. ఇఁక నిముసమున సర్వస్వము నష్టమగును.

అజ—రాణాయును మేవాడు మొగలులతో ప్రతిఘటింపఁజాలదుగాన నర్థముగ రక్తపాత మేల చేయవలయుననియే యనిరి.

గోవిం—అజయా! నీవును వారితో నేకీభవించితివా! మనము వారికి బానిసలమై యుఱిలో మెడదూర్చవలయుననియే నీవు కోరు

చుంటివా? మొగలులు ఢిల్లీ సార్వభౌములనియు వారికి విరుద్ధముగ నెదురుతిరుగుట పాపమనియు నేనెఱుఁగుదును. అయితే మేవాడును స్వతంత్రరాజ్యమే కదా! గోవిందసింహుని కంఠమున ఊపిరియున్నంతవఱకు దానిస్వాతంత్ర్యము నష్టము కాదు. ఏడు శతాబ్దములనుండి ఎడతెగని తుపానులకును పిడుగులకును జంకక అభిమానముతో తలయెత్తుకొనియున్న మేవాడు రక్తపతాకము నేఁడు మొగలుల రక్తనేత్రములఁ జూచుటచే కూలిపోవునా? ఎన్నటికిని కాదు. నీవుపొమ్ము. రాణాగారితో వచ్చుచున్నానని చెప్పుము.

(అజయుని ప్రస్థానము)

గోవిం—(గోడపై వ్రేలాడుకత్తిని ఒరనుండిదూసి) నాప్రియసహచరీ! నీవు నాచేతనున్నంతకాలము మహారాణాప్రతాపసింహునకవమానము కలుగకుండుఁగాక! ప్రియతమా!

చ॥ కలుషతఁజెందితీవు చిరకాలము నిన్నిటు విస్మరించుటన్
గలవరమొందబోకు మిఁకఁ గాఁగలయుద్ధమునం దురుష్కవీ
రుల బహులోష్ణశోణితముఁ గ్రోలెదుగాత క్షమించి నాకడన్
మెలఁగు, ప్రతాపకీర్తి భువి నిల్పెద మించెద ఖడ్గరాజమా!

(ఖడ్గము హృదయమున కద్దుకొని మెల్లఁగా ద్రిప్పబోవుచు నను) కాదుకాను. చేయి వణఁకుచున్నది. ఇప్పుడు నీమర్యాద నేను కాపాడఁజాలను. ఇప్పుడు నేను వృద్ధుఁడనైతిని. (కనులవెంట నీరుకారును.) ఓ ఈశ్వరా! ఏమి ఇట్లుచేసితివి?

(నిలబడి మరల కత్తిఎత్తును. ఇంతలో కళ్యాణి వచ్చును.)

కళ్యా—నాయనగారూ! ఇదియేమి?

గోవిం—అమ్మా! ఇదిఖడ్గము. చూడుము.

కళ్యా—కం॥ ఆకస్మికముగ ఖడ్గము
మీకరమునఁ జూడ వెఱవు మిగులఁగలిగెన్

బాకుధరించుట మీరిపు
డేకతమున? పుడమి నుంచు ♦ డింతకు దీనిన్.

గోవిం—(కత్తిమొన నేలపైమోపి ప్రేమతో కళ్యాణిని చూచుచు) కళ్యాణీ! ఈఖడ్గ మెంత భయంకరమును ఎంత సుందరమునో చూడుము. ఇది యేమికోరుచున్నదో తెలియునా?

కళ్యా—లేదు. ఏమికోరుచున్నది?

గోవిం.—నెత్తురు.

కళ్యా—ఎవరిది?

గోవిం—మహమ్మదీయులది.

కల్యా—అయితే నాయనగారూ! మహమ్మదీయులపై మీకింతక్రోధ మేల?

గోవిం—దీనికికారణము నీజన్మభూమియగు మేవాడునడుగుము. ఏడు వందలసంవత్సరములనుండియు తురుష్కులీ స్వతంత్రరాజ్యమును వశపఱచుకొనుటకయి రాక్షసులవలె విఱచుకొని పడుచున్నారు. అయితే పర్వతమును డీకొను సముద్రతరంగములవలె ప్రతిపర్యాయమును వారువెనుకకు మరలిపోవుచున్నారు. ఇది వారి కేమి యపరాధముచేసినో అడుగుఁడు. కాని

క॥ మనుజుఁడు శక్తిమదాంధత
నునుపుగ నెఱుఁగంగఁబోడు ♦ న్యాయాన్యాయం
బనఘుమతి సట్టివేళల
ఘనఖడ్గమె వారిదుండ♦గమ్ము నడంచున్॥

అకటా! కల్యాణీ! నేనిపుడు కడుంగడు వృద్ధుఁడనైతిని.

(కల్యాణి యేడ్చును.)

గోవిం—అమ్మా! ఏల ఏడ్చెదవు? భయపడకుము. దీనిని ఒరలోపెట్టుచున్నాను. (ఒరలోపెట్టి) పొమ్ము. లోపలికిఁ బొమ్ము. నేనును పోవుచున్నాను. (ప్రస్థానము)

కల్యా—నాయనా! మీరు బాగుగ ఆలోచించినచో—.

## ద్వితీయ దృశ్యము.

స్థానము - ఉదయపురమార్గము.

సమయము - అపరాహ్ణము.

[సత్యవతియు చారణులును పాడుదురు.]

### గీతము.

ఇదె మేవాడు మహీధరమెత్తగు నెట్టుని జెండా ద్యుతిమించెన్
ఇదె యిందనుకనుమాహమ్మదులకు పదము చూర్ణమొనరించెన్॥
ఇదె మేవా డిదె మేవా డీయెడనే కనుని డుములఁ బడియున్
గదిసి ప్రతాపుఁడు దీని శృంగమటుగాంచెను నిశ్చలతావాప్తిన్॥ ౧
ఈయెడనే మునుపద్మినిముఖ్యుల యిద్ధంబగు రూపాగ్నిన్
బాయక యుతికి తురుష్క సైన్యమది భస్మంబై పోయెన్॥ ౨
క్షత్రవీరగణ రక్తరంజితము కాసారోదక మిచటన్
చిత్రశౌర్యుఁడగు బాప్పామ్లేచ్ఛుని పుత్రిక నిటఁగొని తెచ్చెన్।
పాడిపంటలకు తావిది యిచ్చటి షడ్రసీగ బులు రుచ్యంబుల్
పాడునుతోఁటలఁ గిరశారికలు వాయువు చల్లగవీచున్॥ ౩
ఈమేవాడు మహోన్నత శిఖరంబెగసి యాకసము ముద్దుగొనున్
శ్యామలకానన భూము లీయెడను స్వర్గజ్యోతిసి నిండెన్॥ ౪
వనకుసుమమ్ముల నిచ్చటి వనితాజనము భూషలుగఁ దాల్చున్
ఘనకృపఁ బాతివ్రత్యమునన్ సరిగారెవ్వరు వీరలకున్॥ ౫

(ఇంతలో అజయుఁడు ప్రవేశించును)

సత్య—మీరు సైనికులా?

అజ—అవును, నేను మేవాడుసేనాపతులలో నొకఁడను.

సత్య—మిమ్మొక మాట యడుగఁదలచితిని. నేనొక వార్త వింటిని, అది
నిజమేనా?

అజ—ఏమివార్త యది?

సత్య—మొగలసైన్యము మేవాడుపైకి దాడివెడలి వచ్చుచున్నదని.

అజ—ఇంక వచ్చుటలేదు. రాణా సంధికిచ్చగింపనిచో తప్పక వచ్చును. రాణాగారు సఖ్యమున కియ్యకొనునో కయ్యమునకో యని తెలిసికొనుటకే మొగలసేనాపతి తనదూత నంపెను.

సత్య—మీరు యుద్ధమునకు సన్నద్ధులైయుంటిరా?

అజ—రాణాగారి ఇచ్ఛానుసారము ప్రవర్తింతుము.

సత్య—రాణాగారియిచ్ఛ యేమియో మీకు తెలియునా?

అజ—తెలియదు. కాని సంధికే యొడంబడెదరని యూహించు చున్నాను ఈవిషయమాలోచించుటకే నన్ను, మానాయన గారిని పిల్వనంపిరి.

సత్య—మీనాయనగా రెవరు?

అజ—మేవాడు ప్రధానసేనాపతియగు గోవిందసింహుఁడు.

సత్య—మీరు గోవిందసింహునిపుత్రులా? మంచిది. వారియుద్దేశ మేమి?

అజ—యుద్ధమే వారియభిమతము.

సత్య—మంచిది. మీకుకష్టమొసఁగితిని. మీరింక వెళ్లవచ్చును.

(అజయుని ప్రస్థానము)

సత్య—సంధి! రాణాప్రతాపసింహునిపుత్రుఁడు మొగలులతో సంధి తలపెట్టెనా? ఇది అసంభవము. ఇందు తప్పక పొరపాటున్నది. (చారణులతో) మీ రీచెట్టుక్రిందనుండుఁడు. నేనిప్పుడే వచ్చు చున్నాను.

(చారణులొక వైపుగను సత్యవతియొక వైపుగను నిష్క్రమింతురు.)

## తృతీయదృశ్యము

### స్థానము - ఉదయపురమున మేవాడురాజసభ

### సమయము-ప్రభాతము

[సింహాసనమున అమరసింహుఁడును, ఇరుప్రక్కలను సామంతులును కూర్చునియుందురు-గోవిందసింహుఁ డొకప్రక్క నిలఁబడియుండును.]

జయ—మహారాజా! మొగలసైన్యము మేవాడువఱకు వచ్చినప్పుడు కర్తవ్యమునుగూర్చి రాజపుత్రులకెట్టిమతభేదమును లేదు. మేము యుద్ధము చేయుదుము.

రాణా—జయసింహా! ఈచిన్నరాజ్య మేబలముతో ఢిల్లీ సార్వభౌముని బృహత్సైన్యము నెదుర్కొనును?

జయ—క్షత్రియసహజమగు శౌర్యబలముతోడనే.

కృష్ణ—దేవరవారి స్వర్గీయజనకులు ప్రతాపసింహు డేబలముతో మొగలుల నెదుర్కొనెను?

రాణా—వారిమాట వదలివేయుము. వారు మనుష్యులుగారు.

శంకర—వారును రాజపుత్రులేగదా!

రాణా—కాదు శంకరసింహా!

చ॥ జనకుఁబ్రతాపసింహు నొక ♦ సాటి నరుండని పల్కఁగూడదా
ఘనుఁ డొకదైవశక్తివలె ♦ ఖస్థలినుండి పవిత్రపాతమ
ట్లును మఱిభూప్రకంపమటులుం ♦ బలె ఘనవార్ధియూర్మికాచయం
బును బురుడించి రాజకుల♦మున్ వెలిగించె మహాత్ముఁ డాగతిన్.

మఱియు నమ్మహామహుఁ డెందుండివచ్చినదియు నెందుల కేగినదియు నెవ్వరికినిఁ దెలియదు. అందఱును వారివలెఁ జేయఁజాలరు.

కృష్ణ—అందఱును వారివలె చేయఁజాలరను మాట వాస్తవము. కాని వారి పుత్రుఁడు తప్పక వారి ననుకరించునని యే మేమనుకొను

మున్నారు. స్వర్గీయమహారాణా మేవాడుస్వాతంత్ర్యరక్షణ మునకై తమ ప్రాణము లర్పించిరి ఇంక వారి పుత్రుఁడు పోరుసలుపక యే మొగలులకు లొంగిపోవునా?

రాణా—కృష్ణదాస్! అది సుందరమగు నొక యనుభూతిమాత్రమే. ఇప్పుడు కొన్ని సంవత్సరములనుండియు మేవాడుప్రజ ధన ధాన్యసంపన్నమై సుఖముగ కాలము పుచ్చుచున్నది. రాజ్య మున శాంతినెలకొనినది. కేవల మాయనుభూతికొఱకు ఈ సుఖము, ఈ స్వాతంత్ర్యము నాశమొనర్పవలయునా? నామ మాత్రముగ పన్ను ఇచ్చుటచే రక్తపాతము తప్పిపోవుచుండ వృథాగా ఇన్ని జీవహత్యల కేలకడంగవలయును?

శంక—మహారాజా! మేము పన్ను ఇచ్చెదమా? ఎవనికి? మొగలు లకా? పన్ను తీసికొనుటకు వారెవరు? శ్రీరామచంద్రునివంశీ యులయొద్దనుండి పన్ను వారేయధికారముతో పుచ్చు కొందురు?

రాణా—కొద్దిగపన్నుఇచ్చి ఈసుఖము, ఈశాంతి, ఈస్వాతంత్ర్యమును రక్షించుకొనుటమంచిదా? లేక ఇవియన్నియు పోఁగొట్టుకొను టయా? ఏమి గోవిందసింగ్! మీయభిప్రాయ మేమి?

గోవిం—(ఉలికిపడి) మంచిది. ఈవిషయమున నేనేమియభిప్రాయమీ యఁగలను? నేనేమియు చెప్పనుజాలను. ఈవిషయములను తెలిసి కొననుజాలను. బాల్యమునుండి దుఃఖమే నాకు సహచరము. ఆపదుత్సంగమున నేను పెరిగితిని. మహారాజా! ఇరువదైదు సంవత్సరములనుండి స్వర్గీయమహారాణాతో ఆఁకలిదప్పికలు సరకుగొనక కొండలలో తిరిగితిని. ఆమహాత్మునికొలువుననుండి ఈయిరువదైదువత్సరములు నేను దారిద్ర్యవ్రతము నేయభ్య సించితిని. ఈయిరువదైదుసంవత్సరములు నేను దుఃఖమందలి సుఖమునే అనుభవించితిని. ఆసుఖ మేమనియుడిగెదరు! ఇతరు

లకై దుఃఖమనుభవించుటలో నెట్టిసుఖముగలదు! కర్తవ్యపాలనముకై దారిద్ర్యమనుభవించుట యెంతమంచిమాట! ప్రాభాతిక సూర్యునిసువర్ణకిరణములు దారిద్ర్యకుటీరమం దెట్టిప్రేమతో ప్రసరించునో అట్లు మరియెక్కడను ప్రసరించవు. మహారాజా! నామెట్టిమంచిరోజులు గడచిపోయినవి! (పలుకుచు పలుకుచు ఆగిపోవును.)

జయ—గోవిందసింగ్! మధ్య నేల యూరకుంటిరి? తక్కినది చెప్పుము.

గోవిం—ఏమిచెప్పుదును? ఏమియు చెప్పజాలను. నేనా మేవాడులో ఆపేదకాపుకుటీరము కూలుటయు ఆస్థానమున భోగవిలాసార్థమగు నీనాటకశాల నిర్మింపబడుటయు చూచితిని. ఆ మహాత్ముని పవిత్రమందిరము పగులగొట్టి ఆరాళ్ళతోనే ఐశ్వర్యవంతుడగు ప్రాసాదము కట్టబడుట గాంచితిని. ఏపర్వతము ఒకనాడు జయధ్వనిచే ప్రతిధ్వనించుచుండెడిదో, ఏపర్వతము కీర్తిచే మహాపవిత్రముగ నుండెనో దానినీడను ఈ కేళీనికుంజముల నాలోకించితిని. నేను నా యాక్షీణదృష్టితో ఆమహాత్మ్యము ధూమమై ఆకసమున లీనమగుట గనుగొంటిని. జయసింగ్! సర్వస్వముపోయినది. ఇంక నున్నదియేమి? ఇప్పుడా మహిమాకిరణములు కొన్నిమాత్రమే మిగిలియున్నవి. ఇప్పుడామహాత్మ్యము మరణోన్ముఖమై మృత్యుశయ్యపైబడి కరుణవిలోకనంబుల మనవంక చూచుచు చావున కెదురుచూచుచున్నటుల గనిపించుచున్నది.

కేశ—గోవిందసింహాజీ! తాముబ్రదికియుండువఱకు కాగౌరవము నష్టము కాజాలదు.

గోవిం—నేనా? కేశవసింహాజీ! ఇప్పుడు నేనేమి చేయగలను? ఇప్పుడు నా కారోజులు గడచినవి. నే నిప్పుడు ముక్కాలిముదుసలి నైతిని. చేతులు వణకుచున్నవి. ఈ చేతులతో నిప్పుడు

చక్కఁగాఁ గత్తినైనఁ బట్టఁజాలను. ఈ బక్కయెముకలతో శరీరము నిలఁబెట్టనేని చాలను. కాని మహారాజా! ఇప్పుడును నాకు మరల ఆపర్వతారణ్యములఁ గ్రిమ్మరవలయుననియు, మాతృభూమికై ఆనుఘురదుఃఖము ననుభవించవలయుననియు కోర్కె కలదు. హా! ఈశ్వరా! దుఃఖము సహించు శక్తిని గూడ నీవు హరించితివి! (గోవిందసింహుఁడు మెదలకయుండును. అందఱును నిశ్చేష్టులగుదురు.)

రాణా—అయితే గోవిందసింహాజీ! భారతవర్షమంతయు మొగల బాదుషాకు తలవంచెనని మీరెఱుఁగుదురు. ఇంక రాజపుత్రానాలో నీచిన్నమేవాడురాజ్యము విశ్వవిజయిని యగునా! మహాసేనముం దెట్లునిలువఁబడఁగలదో చెప్పుడు.

గోవిం—మహారాజా! నేను విన్నవింపవలసినది మొదటనే విన్నవించితిని. ఇప్పుడు నేను చెప్పునదేమియు లేదు.

రాణా—సామంతప్రభువులారా! ఇప్పుడు యుద్ధము వ్యర్థమని నాకు తోఁచుచున్నది. మనము మొగలులతో సంధిచేసికొందము. చోబ్దార్! నీవేగి మొగలదూతను గొనిరమ్ము. (చోబ్దారు పోవును.)

గోవిం—మహారాణాప్రతాప్! మహారాణాప్రతాప్! నీవు స్వర్గములోఁ గూర్చుండి యీమాటలు వినఁజాలకుంటివి. మంచిది. వజ్రిమా! నీభైరవస్వరమున ఈహీనపదోచ్చారణ మడఁచివేయుము. మేవాడ్! మొగలుప్రభుత్వస్వీకారమునకు మున్ను నీవు భూకంసముచే ధ్వంసముగమ్ము.

(చోబ్దారుతో మొగలదూత వచ్చును.)

రాణా—మేము సంధికి సంసిద్ధులమని నీవు మీసేనాపతితోఁ జెప్పుము.

(సత్యవతి అతివేగముతో ప్రవేశించును.)

సత్య—ఎన్నటికిని కాదు. ఎన్నటికిని కాదు. సామంత ప్రభువులారా! మీరు యుద్ధమునకు సన్నద్ధులు కండు. రాణాగారు మిమ్ము రణక్షేత్రమునకు గొంపోవనిచో మీ సైన్యములను నేను నడిపెదను.

గోవిం—దేవీ! నీవెవరు? ఈ ఘోరాంధకారమున విద్యుల్లేఖవలె వచ్చి నిలబడిన నీవెవరు? కోమలమును గంభీరమునగు ఈ వజ్రధ్వని ఎవరిది?

రాణా—నిజముగ నీవెవ్వరవో చెప్పుము.

సత్య—మహారాజా! నేనొక చారణిని. మేవాడు రాజ్యమున గ్రామములకును పర్వతపరిసరభూములకును జని మేవాడుమహిమను గానము చేయుచుందును. ఇంతకన్న నన్నుగూర్చి వివరముగ జెప్పఁబని లేదు.

సామం—ఆశ్చర్యము!

సత్య—సామంతప్రభువులారా! రాణాగారు ఉదయసాగరపు రాజప్రాసాదములందు విలాసస్వప్నముల వీక్షించుచు నుండుఁగాక! నేను మిమ్ము యుద్ధక్షేత్రమునకుఁ గొంపోవుదును.

గోవిం—ఇదియేమి? నాశరీరమున ఈ యౌవనోత్సాహ మెచ్చటనుండి వచ్చినది! ఈ ఆనందము యీ ఉద్రేకము నా కెక్కడనుండివచ్చినవి! సామంతప్రభువులారా! మీరు మహారాణాప్రతాపసింహునిపుత్రుని యీ యపకీర్తినుండి రక్షింపుఁడు. ఈ విలాసమును పదదళితము గావింపుఁడు. ఈ యాటవస్తువుల బ్రద్దలు కొట్టుఁడు.

(గోవిందసింహుఁడు దగ్గరనున్న ఇత్తడి రేకుతో నిలువుటద్దమును బ్రద్దలుగొట్టును)

గోవిం—సామంతప్రభువులారా! మీరు ఖడ్గములు ధరింపుఁడు. (రాణాను పట్టుకొని) మహారాజా! దయచేయుఁడు.

రాణా—గోవిందసింహాజీ! నడువుఁడు, మనము యుద్ధము చేయుదము. మొగలదూతా! మేము యుద్ధమొనర్చెదమని మీ సేనాపతితో చెప్పుము. చోబ్దార్! నాగుఱ్ఱమును సిద్ధపఱచుము.

సత్య—మేవాడురాణాకు జై!

సామం—మేవాడురాణాకు జై!

---

## చతుర్థదృశ్యము.

స్థానము—ఆగ్రాలో మహబత్ఖాను ఇల్లు.

సమయము—ప్రభాతము.

(సేనాపతియగు మహబత్ఖానును, మొగల సర్దారగు అబ్దుల్లాయు నిలిచి మాట్లాడుచుందురు)

మహ—హిందాయత్ఖాను సేనాపతి యయ్యెనా?

అబ్దు—అవును, ఖాన్సాహెబ్.

మహ—ఈవిషయము మీరు బాగుగ నెఱుగుదురా?

అబ్దు—అవును బాగుగ నెఱుఁగుదును. బాదుషా అతని వెంట ఏఁబది వేల సైన్యముకూడ పంపిరి.

మహ—ఎక్కడి హిందాయత్ఖాను! ఎక్కడి సేనాధిపత్యము! ఈకాలమున యోగ్యతకును సామర్థ్యమునకును గౌరవములేదు. యోగ్యులకు చాల అగౌరవము జరుగుచున్నది. తడిసిన యీపెంట కుప్పలనుండి ఎన్నికుక్కగొడుగులు పుట్టునో తెలియదు.

అబ్దు—నిజము. మీరుచెప్పినది యథార్థము. హిందాయతుఖాను నాయకుఁడగుటకు హేతువు ఆతఁడు బాదుషాకు మేనల్లుఁడు.

మహ—మేనల్లుఁడయిన నగుఁగాక! ఇంత పెద్దసైన్యమును నడపుట సులభమగు పనికాదు. అతని బావమఱఁది ఇనాయత్ఖానుకూడ అతని వెంటనే యుండెనా?

అబ్బు—ఉండవచ్చును.

మహా—ఇనాయత్ఖాను నిజముగ యోధయే. అతఁడు యుద్ధము చేయఁగలఁడు. బాదుషా హిదాయత్ఖానును నామమాత్రము నకు సేనాపతిగాఁ జేసినట్లు తెలియుచున్నది. అసలు సేనాపతి ఇనాయత్ఖానే అయియుండును.

అబ్బు—జనాబ్! ఎంత నామమాత్రపు దళవాయియైనను తుదకు తుపాకిమోఁతకేని వెలువక యుండవలయునుగదా!

మహా—మంచిది. ఈమారు మేవాడుయుద్ధములో అంతయు విశద మగును.

అబ్బు—బాదుషా మిమ్ముకూడ మేవాడుయుద్ధమునకు పొమ్మని సెల విచ్చిరా?

మహా—అవును, సయ్యద్ సాహబ్!

అబ్బు—అయితే తామేల బయలుదేర లేదు?

మహా—ఏలయన మేవాడు నాజన్మభూమి. బాదుషా నన్ను వంగ ఘూర్జరదక్షిణాదిదేశములలో నెచ్చటకుఁబంపినను పోదును. కాని మేవాడును జయింపఁబోవుట నా కుచితముగ లేదు.

అబ్బు—అగునో మీరుచెప్పినది న్యాయమే. ప్రొద్దెక్కుచున్నది, నాకు సెలవిండు. ఆదాబ్!

మహా—ఆదాబ్!

(అబ్దుల్లా పోవును.)

మహా—కానిమ్ము. హిదాయతు సేనాపతియగుట మంచిదే. బాగుగ తమాషా చూడవచ్చును. పిచ్చవానిని పట్టుకొని బలాత్కార ముగ గుఱ్ఱము నెక్కించుటవంటిదే యిది. (ప్రస్థానము)

⟶∞⊕∞⟵

## పంచమదృశ్యము

స్థానము - మొగలులశిబిరము.

సమయము - మధ్యాహ్నము.

(మొగలసేనాపతియగు ఖ్వాన్ఖానాహిదాయత్ అలీఖాన్బహద్దరు తన క్రిందియుద్యోగియగు హుసేనుతో మాట్లాడుచుండును.)

హిదా—హుసేన్! ఈకాఫరులను జయించుట మురబ్బాతినుటకన్న సులభమగుపని.

హుసేన్—అలీసాహెబ్! ఈపని మీరనుకొన్నంత సులభమైనది గాదు. ఏడువందలసంవత్సరమునుండియు ఈచిన్నరాజ్యము మహామ్మదీయప్రభుత్వమునకు లోఁబడకయున్నది. ఇంతయేల, సాక్షాత్తు అక్బరుబాదుషాయును దీనిని వశపఱచుకొనలేక పోయెను.

హిదా—అయితే అక్బరువద్ద మంచిసేనాపతి యుండకపోవచ్చును. అప్పుడు ఖ్వాన్ఖానాహిదాయత్ అలీఖాను ఉన్నచో చూపించువాఁడు!

హుసేన్—అయితే మానసింహుఁడు తక్కువవాఁడా?

హిదా—పాపము, మానసింహుని కేమితెలియును? అతఁడు యుద్ధము చేయఁగలఁడా?

(వంటవానిప్రవేశము.)

వంట—హుజూర్! వంట సిద్ధము.

హిదా—మానసింహుఁడే సేనాపతియగుచో మావంటవాఁడగు జాఫర్మియాకూడ సేనాపతికావచ్చును. ఏమి జాఫర్మియా!

జాఫర్—హుజూర్! వంట తయ్యారు.

హిదా—నీవు ఫౌజుతో పోట్లాడఁగలవా?

జాఫర్—హుజూర్! కోడిపెట్టమాంసము.

హిందా—మంచిది. నీవు కోడిమాంసము వండితివి. సరియే. నీవు యుద్ధము చేయఁగలవాఁడని యడుగుచున్నాను.

జాఫర్—వేపుడుమాంసమా హుజూర్? అది గొఱ్ఱెది.

హిందా—మంచిది. మేమును ఇచ్చట గొఱ్ఱెమాంసము తయ్యారు చేసెదము. నీవు పొమ్ము. మేము వచ్చెదము.

(జాఫరు పోవును)

హిందా—హుస్సేన్! ఇప్పుడిక్కడ గొఱ్ఱెమాంసము వేయింపఁబడును.

హుసేన్—ఏగొఱ్ఱెది?

హిందా—ఏగొఱ్ఱెదా? ఈరాజపుత్రులది. వీరును గొఱ్ఱెలేకదా.

హుసేన్—సాహెబ్! క్షమింపుఁడు. ఈవిషయమై మీతో నేకీభవింపఁజాలను.

హిందా—హుసేన్! నీవింకను కొంతకాలము శిక్షగఱచుట యవసరము. నావెంటవచ్చినందుకు యుద్ధమన నేమియో చక్కఁగ నేర్చుకొనుము. ముందు నీకుపయోగపడును.

హుసేన్—చాలమంచిది జనాబ్! పెద్దపెద్దయేనుఁగులు కొట్టుకొని పోయినవి. ఇంక దోమచేయునదేమో చూడవలయును.

హిందా—హుసేన్! నీవు చాలపొగరుపోతువుగను, మర్యాద తెలియనివాఁడవుగను కనిపించుచున్నావు. నేను సేనాపతినని యెఱుఁగవు. నేను కోరినచో ఇప్పుడే నీతల తీయించెదను.

హుసేన్—అవును జనాబ్! మీరు సేనాపతియని యెఱుఁగుదును.

హిందా—ఆఁ. నేను సేనాపతియని యెప్పుడు జ్ఞాపకముంచుకొనుము.

హుసేన్—చిత్తము! అట్లే జ్ఞాపకముంచుకొందును. కాని మేవాడును గెలుచుట—

హిందా—అరే మరల మేవాడుమాటయెత్తెదవు! హుసేన్! నీవు నాకు మిత్రుడవుగాన చెప్పుచున్నాను, వినుము. మేవాడుగెలుచుట యన నా కొక చిటిక వేయుటవంటిది.

హుసేన్—అట్లయినచో నొక పెద్దచిటికవేసి చెప్పవలయును.

హిందా—చాలపెద్దదికాదు. మంచిదిపొమ్ము. ఇప్పుడు మేము భోజనమునకుపోవుచున్నాము..(హుసేను వెళ్ళబోవును. హిందాయతని అతనిని మరల పిలుచును.) ఇదిగో హుసేన్! ఒకమాట వినిపొమ్ము. చూడు, నేను సేనాపతిననుమాట యెప్పుడును మరువవద్దు.

హుసేన్—చాలమంచిది జనాబ్!

హిందా—పొమ్ము. (హుసేన్ వెళ్లును)

హిందా—ఈకాఫరులనుగెలుచుట ఏమికష్టము! వీరియుద్ధము చేయుటయే తటస్థించదు. నాలుగుతుపాకిమోతలు వినఁగనే అందరును పారిపోదురు. మళ్ళి జాడ తెలియదు.

(గర్వముతో ప్రస్థానము.)

షష్ఠదృశ్యము

స్థానము - ఉదయపురమున ఉదయసాగరతీరము.

సమయము - ప్రభాతము.

(మేవాడు రాజకన్యయగు మానసి పాడును.)

గీతిక.

భిక్షుకిగా నీదరికే తెంచితి వేఁడుగ నిను నేఁగోర నిఁకన్
రక్షింపుమ యీదాసికి ప్రేమపుభిక్ష పెట్టుమో ప్రాణప్రియా॥
నీపయి నామది దవిలినదాదిగ నిద్దుర ఆఁకలి నన్నువిడెఁగా
తాపమేల మనమేక ప్రేమబంధమునఁ దగుల్కొనియుండఁగ॥

నీమృదుహాసము నాకుప్రాణమిదె నేనిక నేమియుఁ గోరఁ బ్రియా
ప్రేమ మొక్కటియె నిను యాచించెద వేయరు దెమ్ము దయాహృదయా!

(ఒక అంధబాలకునితో నొకభిక్షుకి వచ్చును.)

భిక్షు—దాతకు జయము.

మాన—ఏమమ్మా! ఇతఁడు నీపిల్లఁడా?

భిక్షు—కాదు. వీఁడు నాచెల్లెలిబిడ్డఁడు. వీఁడు పుట్టుగుడ్డి. వీనితల్లి చనిపోయినది.

మాన—వీనితండ్రి?

భిక్షు—పరదేశమున నున్నాఁడు.

మాన—ఆహా! ఎంత ముద్దుపిల్లఁడు. వీనిని నాకిచ్చెదవా?

భిక్షు—వీఁడు నన్ను విడిచి ఒంటరిగా నుండఁడు అమ్మా!

మాన—మంచిది. వీనిని నీయొద్దనే యుంచుకొనుము. అప్పుడప్పుడు వీనిని నాకడకుఁ గొనివచ్చుచుండుము. ఇదిగో! (ఒక మొహరీ ఇచ్చును.)

భిక్షు—దేవరవారికి జయము. మీరాజ్యము చల్లగ నుండవలె.

(బాలకునితో ప్రస్థానము)

మాన—ఈభిక్షుకురాలి జయశబ్దోచ్చారణ మెంతమధురముగ నున్నది! ఇది జయభేరికంటెను ప్రబలము. తల్లి దీవనకంటెను అధిక ప్రేమ పూరితము. బాలకుని తొలుతొల్తటి పలుకులకంటెను అతిమధురమై యలరారుచున్నది.

అజయసింహుఁడు—(ప్రవేశించి) మానసీ!

మాన—అజయా! రమ్ము, రమ్ము. నేనిపుడు చాల సంతోషముగ నుంటిని. ఈ సంతోషములో కొంతభాగము నీవును బుచ్చుకొనుము.

అజ—నీ యీ సంతోషమునకుఁ గతంబేమి?

మాన—సాంబా సంతోషము పరిపూర్ణము. శరత్కాల నదికంటెను పరిపూర్ణము. నేఁడొక భిక్షుకురాలు నన్ను ఆశీర్వదించిపోయినది.

అజ—ఈ ప్రపంచమున నిన్ను హృదయపూర్వకముగ నాశీర్వదింపనివా రెవరు? నేను నిత్యము సందులందును, బజారులందును జనులు మేవాడురాజకుమారికను ప్రశంసించుటయే వినుచుందును.

మాన—నీవు రోజు వినుచుంటివా? అయితే ఒకనాఁడు నేనును వినఁజాలుదునా?

అజ—ఒకనాఁడు ఇంటినుండి బయలువెడలుము. తప్పక వినఁగలవు.

మాన—అజయా! నేను ప్రతిదినము బయటికి వెళ్ళుచునే యున్నాను. ఎట్లన,

గీ॥ అతిథిశాల నిర్మించి తం ♦ దనుదినమ్ము
పోయి యతిథులకు న్నైనె ♦ భోజనంబు
పెట్టుచుందును స్వయముగ ♦ నట్టుకాని
నాఁడు కడుఁబొక్కుచుందును ♦ నామనమ్ము.

అజ—మానసీ! నీజీవితము ధన్యము. మానసీ! నేను నీకడ సెలవు గైకొనుటకై వచ్చితిని.

మాన—ఏమి? ఎక్కడకు పోయెదవు?

అజ—యుద్ధమునకు.

మాన—ఎప్పుడు పోయెదవు?

అజ—రేపు ఉదయము.

మాన—అచ్చటనుండి మరల నెప్పుడువచ్చెదవు?

అజ—నిశ్చయము లేదు. తిరిగివచ్చెదనో లేనోకూడ చెప్పఁజాలను.

మాన—ఏమి?

అజ—యుద్ధమున చనిపోవచ్చును.

మాన—హా! (తలవంచును.)

అజ—మానసీ! నేను తిరిగిరాకున్నచో?

మాన—అప్పు డేమియగును?

అజ—నీకుదుఃఖముండునా లేదా?

మాన—ఉండును.

అజ—ఇంత ఉపేక్షాభావనమా! మానసి! నీ వెఱుఁగవా?—

మాన—నే నేమి యెఱుఁగుదును?

అజ—నీపై నాకెంత ప్రేమయున్నదో యెఱుఁగవా?

మాన—ఎఱుఁగుదును. చాల ప్రేమయున్నది.

అజ—నీకు నాపై ప్రేమ లేదా?

మాన—ఉన్నది.

అజ—కాదు. నీకు మఱియొకరిపై ప్రేమయున్నదా?

మాన—ఉన్నది. మనుష్యమాత్రునిపై నున్నది.

అజ—కఠినురాలా! సిగ్గుమాలా!

మాన—ఏమి అజయా! నేను నిన్నొక్కనినే ప్రేమింపవలయుననియు మఱియెవ్వరిని ప్రేమింపఁగూడదనియు తలఁచుచుంటివా? నీ వొక్కఁడవే నాహృదయమంతటను అధికారము చేయఁగోరితివా? అగుచో నీవు చాల స్వార్థపరుఁడవు.

అజ—మానసీ! నీవింతదనుక ఏమియు తెలియని బేలవేనా?

మాన—అజయా! నాపై నింత కోపగించెద వేల! ఇందు నాయపరాధమేమున్నది? మానవమాత్రునిపైఁ బ్రేమఁగనుటయే యపరాధమా? ఇదియే నాయపరాధమగుచో తగినదండన మొసఁగుము. దాని ననుభవించుటకు సిద్ధముగనుంటిని.

అజ—నీకు దండ మొసఁగుదునా—నేనా?

మాన—నీవు దండింపుము అజయా! నేఁడు నీవు యుద్ధమునకుఁ బోవుచుంటివి. అందు నీ వెంతహత్య యొనర్చిన జనులు నిన్నంత

పొగడుదురు. అట్లే నేనెంత అధికముగ ప్రేమవహించిన నా అపరాధమంత యధికమగునా?

అజ—మానసీ! నీవు ప్రపంచమునంతను ప్రేమింపుము. నీయుదార హృదయమున విశ్వమంతయు నుంచుకొనుము. ఇపుడు నేను నిన్నేమియు ననను. ఆకాశమువంటి నీయుదారహృదయమును తుచ్ఛమగు నాక్షుద్రహృదయమున బంధింపనెంచితిని. నేను చాలమూర్ఖుఁడను. నన్ను క్షమించుము. మానసీ! సెలవుపుచ్చుకొందును.

మాన—మంచిదిఅజయా! పొమ్ము. ప్రపంచమంతయు నన్నాశ్రయమాన రించినది. దానినడంచుటకై అప్పుడప్పుడు యుద్ధము చేయుక తప్పనిదగుచున్నది. కాని యుద్ధము చాలక్రూరమగుపని. వీలగునంతవఱకు అందుఁ బవిత్రుఁడవుగా నుండుము.

(అజయసింహునిప్రస్థానము.)

మాన—పొమ్ము అజయా! నీవు యుద్ధక్షేత్రమునకుపొమ్ము. నా శుభ సంకల్పము కవచమువలె నిన్నురక్షించును. అయితే యుద్ధమునచచ్చినవారిగతి యేమగును? వారితల్లులును, ఆలుబిడ్డలును ఇటులే భగవంతునితో వారిమంగళమును ప్రార్థింపరా? అందులో నెందఱిప్రార్థనలు నిష్ఫలములగునో, ఎందఱిసాధనలు వ్యర్థములగునో తెలియదు. దీనికి ప్రతిక్రియయేమియు లేదా? (కన్నీరుకార్చుచు ఆకసమువంక చూచును కొంతసేపటికి ప్రసన్నవదనయై చప్పట్లువేయుచు నననును) మంచిది. ఇప్పుడు నేనును ఒకపనిచేసెదను. యుద్ధములో చనిపోయినవారికి నే నేమియు సాయముచేయఁజాలను. కాని దెబ్బలుతిన్నవారికి శుశ్రూషచేయుదును. ఈపనియే చేసెదను. ఇందు చెడుగేమున్నది? ఇదియే చేసెదను.

(రాణిప్రవేశించును)

రాణి—వింటివా మానసీ?

మాన—ఏమి?

రాణి—మీనాయనగారు యుద్ధమునకు వెళ్ళిరి.

మాన—అవును వింటిని.

రాణి—మొగలులతో యుద్ధము చేయుటకు వెళ్లిరి.

మాన—అవును వింటిని.

రాణి—ఔరా! ఏమి ఆ యౌదాసీన్యము! వింటిననియా! యుద్ధమన వెన్నతినుట యనుకొంటివా? యుద్ధములో వేలకొలంది జనులు మడసెదరు. తెలియునా?

మాన—అవును. మడియవచ్చును.

రాణి—మడియవచ్చును కాదు. మడియుదురు. ఈమారు బాదుషాసైన్యముతో యుద్ధము. ఇక సర్వస్వము పోయినదనుకొనుము. యుద్ధమునకు వెళ్ళినవారు చంపఁబడుదురు సరే. వెళ్ళనివారి గతియేమి కానున్నదో తెలియదు.

మాన—అయితే నేనేమిచేయుదును?

రాణి—నేను నీపెళ్ళిమాట ధృవపఱచితిని. కాని పెండ్లికి సమయము చిక్కదు. ఇట్టిగడబిడలో నెక్కడనేని పెండ్లియగునా?

మాన—కాకున్న పోనిమ్ము.

రాణి—కాకున్న పోనిమ్మా! పెండ్లికాకున్న నేమగునో తెలియునా?

మాన—బాగుగనే యగును.

రాణి—బాగున్నది. ఇది మెచ్చుటనేనికలదా? కన్యలపెండ్లికాకున్న ఇంకేమేమికలదా? యోధపురరాజకుమారునితో నీపెండ్లి నిశ్చయింపఁబడినది. కాని ఇప్పుడు పెండ్లికాఁజాలదు. అందఱు పోయెదరు. అందఱుచచ్చెదరు. ఎక్కడనైన పెండ్లిపనికానిచ్చుకొని యుద్ధమునకు దిగుదురు. కాని రాణాగారు నామాటవినలేదు.

మాన—అమ్మా! నీవుచింతింపకుము. నేను పెండ్లికన్న నుత్తమమగు పనిచేయుటకు తలపెట్టితిని.

రాణి—అది యేమి?

మాన—నేను యుద్ధక్షేత్రమునకుఁ బోవుదును.

రాణి—ఎందుకు?

మాన—అమ్మా! యుద్ధములో చాలమంది చచ్చెదరని నీవిపుడే చెప్పితివికదా! చచ్చినవారికి నేనెట్టిసహాయమును చేయఁజాలను. కాని శస్త్రాహతులకు నేను పరిచర్య చేసెదను.

రాణి—రంగము చెడినది. అజయుఁడు నీకిదియే నేర్పినట్లున్నది.

మాన—లేదు. ఇందతని దోషమేమియు లేదు. అజయుఁడు జనులను జంపుటకుఁ బోవుచున్నాఁడు. నేను రక్షించుటకుఁ బోయెదను.

రాణి—కాదు. ఇది యెచ్చటనేని జరుగునా?

మాన—చాల బాగుగ జరుగును.

రాణి—కాదు నీవు వెళ్ళఁజాలవు.

మాన—అమ్మా! నీవు నిశ్చింతముగ నుండుము. నేను తప్పక వెళ్ళెదను. కర్తవ్యము నన్ను ఆహ్వానించునపుడు నేనింక నెవరిమాటలను వినననినీవెఱుఁగుదువు. ఇంక నీవు పొమ్ము. నేను ప్రయాణ సన్నాహము చేసెదను.

రాణి—నీ వెవరి వెంటఁబోదువు?

మాన—అజయసింహుని సేన వెంట.

రాణి—ఏమనుకొంటినో అదియే యయ్యెను. రాణాగారు వెళ్ళిపోయిరి. ఇంక దీనికి చెప్పువారెవరు?

మాన—నాయనగారెక్కడనున్నచో ఈపనినుండి నన్నెన్నడు వారింపరు. వారిని నేను బాగుగా నెఱుఁగుదును. వారు చాల దయాస్వభావులు.

రాణి—వారు నీయీపనికిని అడ్డుచెప్పరు. కనుక నే నీకింతయాగడముగ నున్నది. పోయినది. అంతయు పోయినది, నాకు తెలియును. ఏదియో గొప్పయనర్థము రానున్నది.

మాన—అమ్మా! నీవేమియు చింతింపకుము. ఒక మనుష్యుఁడు మఱియొక మనుష్యునిపై విద్రోహము సేయుచున్నాఁడు. చేతనగు నంతవఱకు నేనా విద్రోహమును తగ్గించెదను. అమ్మా! ఇంక నీవు పొమ్ము. ఏమియు భయములేదు.

రాణి—ఇప్పుడు పూర్తిగా కలియుగము వచ్చినది. (పోవును)

మాన—నాహృదయమున ఈ ఇచ్ఛను ఎవఁడు కలుగఁజేసెను? మొదట నీజ్యోతి నాహృదయమున నెక్కడనో మిణుకు మిణుకు మనుచుండెడిది. కాని దానిప్రకాశము ఇప్పుడు హృదయమంతటను చక్కగ వ్యాపించినది. ఇది ఒక నూతనోత్సాహము. పరమానందము. వివాహసుఖము దీనిముందెందుకును కొఱగాదు.

---

స్థానము:—మేవాడు, యుద్ధక్షేత్రము.

సమయము—సాయంకాలము.

[హిందాయతు ఒకడేరాలో కూర్చుండి హుసేనుతో మాటలాడుచుండును. బయట యుద్ధకలకలము వినఁబడుచుండును. ఇద్దఱు సిపాయీలు ఖడ్గపాణులై ద్వారముకడ నిలఁబడియుందురు.]

హిందా—హుసేన్! మేవాడుసైన్యమెంతయుండునో నీవు ఊహించితివా?

హుసేన్—సుమారు యేబదివేలు ఉండును.

హిందా—ఆఁ— అయితే రాజపుత్రులింకను పారిపోవుటలేదా?

హుసేన్—లేదు జనాబ్!

హిందా—ప్రొద్దుటనుండి పోరుచున్నారు. కాని పారిపోవుచున్నట్లు గనుపట్టుటలేదా?

హుసేన్—లేదు. వారు బాగుగపోరాడుటకు నిశ్చయించుకొనిరి.

హిందా—వారు పోరాడుట కొంచె మెక్కిఁగినవారుగాఁ గనుపట్టుచున్నారు.

హుసేన్—చూడఁగా నట్లేయున్నది.

హిందా—ఇదిగో! ఈవినఁబడునది రాజపుత్రులధ్వనియే. మన సిపాయిలేమియు అఱచుచున్నట్లులేదు. వారు యుద్ధము చేయుచున్నారా?

హుసేన్—ఎందుకుచేయరు? మీరొకమారు బయటికివచ్చిచూడరేమి? మీరు సేనాపతులుగదా!

హిందా—అవును నేను నిజముగ సేనాపతినే. అయిననేమి? నేను డేరానుండి బయటికి వచ్చునవసరములేదు నాబావమఱఁది ఇనాయతుఖానొక్కఁడే వీరికిచాలును. ఇంక నాతోకూడ వీ రెక్కడ యుద్ధము చేసెదరు?

హుసేన్—అవును జనాబ్! కాని చూడుడు. రాజపుత్రులు వారల గర్జించుచున్నారు. ఇదిగో! వారియఱపె. మన యదృష్టము మంచిదిగాఁ గనుపట్టుటలేదు.

హిందా—బయట నేమిజరుగుచున్నదో కొంచెము చూచిరమ్ము.

హుసేన్—మంచిది.

హిందా—వద్దులెమ్మా. నీ విచ్చటనే యుండుము. నా కిదియొక పెద్ద దురభ్యాసము. పొద్దుక్రుంకిన నేనొక్కఁడ నుండఁజాలను.

హుసేన్—ఇది నిజముగ దురభ్యాసమే.

హిందా—మరల నేదో గంఢరగోళమగుచున్నది చూడుము.

హుసేన్—ఇది మనకు దగ్గఱనే కనుపట్టుచున్నది.

హిందా—ఏమంటివి?

హుసేన్—జనాబ్! ఎవ్వరో ఇటే వచ్చుచున్నటులున్నారు.

హిందా—ఆఁ! ఎవ్వరోవచ్చుచున్నారా? (హుసేనుని పట్టుకొనును)

(ఒక సిఫాయివచ్చును)

హిందా—ఏమిసమాచారము?

సిఫా—ఖుదావంద్! ఫౌజుదారగు శంశేరుఖాను వచ్చిరి.

హిందా—ఏమీ!

హుసేన్—తక్కినయుద్యోగులు?

హిందా—ఇనాయత్ఖాను బ్రదికియున్నాడుగదా?

సిఫా—చిత్తము.

హుసేన్—మంచిది. పొమ్ము. (సిఫాయి పోవును)

హిందా—నిజముగ నేదియో మొప్పము రానున్నది.

హుసేన్—చిత్తము. అట్లే యున్నది. అయితే నాడు మేవాడు జయించుట చిటికెవేయుటవంటిదని సెలవిచ్చితిరి. కాని ఇది యెంత కఠినకార్యమో నేఁడు తెలిసియుండవచ్చును. ఇప్పుడు మీా కీనాసులిమాట నచ్చినదా? ఇదిగో! చూడుడు. ఇంక దగ్గఱకు వచ్చుచున్నారు.

హిందా—నిజము. ఈయుద్ధములో నేమి కానున్నదో తెలియదు.

హుసేన్—ఏమియు తెలియదు.

[రెండవ సిఫాయి వచ్చును.]

హిందా—ఏమి సమాచారము!

సిఫా—హుజూర్! బాదుషా సైన్యము ఎడమప్రక్కగా పారిపోవుచున్నది.

హిందా—ఎందుకు?

హుసేన్—ఈరాజపుత్రు వారు దేశాభిమానులు.

సిఫా—చిత్తము. (ప్రస్థానము)

హుసేన్—అయ్యా సనాపతిగారు! మీరు కొంచెము బయటకు దయచేయుఁడు. మిమ్ముఁజూచిన సైనికులకు కొంచెము ధైర్యము గలుగును. మీరు సేనాపతులుగదా! కొంచెము బయటకు దయచేయుఁడు.

హిందా—హా! నేను సేనాపతిని! (హాతాశాసూచకమగు రూపము దాల్చును.)

[మూడవసిఫాయి వచ్చును.]

సిఫా—ఖుదావంద్! ఇనాయత్‌ఖాను చంపఁబడిరి.

హిందా—ఏమీ! వీడేమి చెప్పుచున్నాఁడు? ఇదియును సంభవమా? మరల రాజపుత్రుల ధ్వని వినిపించుచున్నది. అదిగో! వారు చాల దగ్గఱకు వచ్చిరి.

హుసేన్—జనాబ్! మీరొకమారు బయటకు వచ్చిన బాగుగ నుండును.

హిందా—ఇప్పుడు సమయమేది? అదిగో! వినుచున్నావా!

హుసేన్— ఆఁ వినుచున్నాను. క్రమముగ నీధ్వని హెచ్చుచున్నది. మఱియు సమీపించుచున్నది.

[నాల్గవసిఫాయి వచ్చును.]

సిఫా— జనాబ్! అంతయు నశించినది.

హిందా—ఇది నేను మొదటనే యెఱుఁగుదును. ఇంకా?

హుసేన్—ఇంక నేమగును? నాశనమైన పిదప నింక నేమగును?

సిఫా—హుజూర్! బాదుషా సైన్యమంతయు పాఱిపోవుచున్నది. రాజపుత్రులు ముందుకు వచ్చుచున్నారు.

హిందా—హుసేన్! శత్రువులు వచ్చినట్లులున్నారు.

(తెరలో) పాఱిపొండు! పాఱిపొండు!

హిందా—ఏవైపు?

హుసేన్—ఈవైపు.

[హుసేను ఒకవైపునకు పాఱిపోవును. హిందాయతు రెండవవైపు పాఱిపోవును. కొందఱు రాజపుత్రులతో మొగలుల జెండా పుచ్చుకొని అజయుఁడు వచ్చును.]

అజ—మేవాడరాణాకుజై!

సైనికులు—మేవాడరాణాకుజై!

హిందా—(రెండుచేతులు పైకెత్తి) శరణు. నన్ను కొట్టకుఁడు. నేనింక బ్రతికియుంటిని. నన్ను చంపకుఁడు. నన్ను కైదుచేయుఁడు.

అజ—నీవెవరు?

హిందా—నేను బాదుషా ఫౌజుకు సేనాపతిని.

అజ—సేనాపతీ! ఇప్పుడు రణరంగమును విడిచి డేరాలోనుంటి వేల!

హిందా—ఆఁ— నేను— ఆఁ—నేనా? దీనికొక పెద్దకారణమున్నది. కాని ఇప్పుడు జ్ఞాపకము లేదు. నన్ను మీరు చంపకుఁగు. నాప్రాణము రక్షింపుఁడు.

అజ—చూచితిరా ఈబటుద్యన్న మేవాడుగెలుచుటకు వచ్చినాడు! నీవు భయపడకుము. నీప్రాణముఁదీయుము. రాజపుత్రానాయంత టను మేవాడువిజయఘోషణము గావింపుఁడు

హిందా—ఆఁ, కావింపుఁడు. ఇందు నాకేమియు బాధలేదు.

[సైనికులతో అజయుఁడు పోవును.]

హిందా—ప్రాణము దక్కినది. దాహము! నీరు! నీరు!

---

అన్యదృశ్యము.

స్థానము - యుద్ధక్షేత్రము.

సమయము - అర్ధరాత్రి.

[శవములయు రణాహతులయు కుప్పలు పడియుండును. సైనికులతో మానసి తిరుగుచుండును. కొందఱు సైనికుల చేతులలో కాగడాలుండును.]

మాన—కొందఱు అటుపొండు. నే నిక్కడ చూచెదను.

[కొందఱు రాజపుత్రసైనికులు వెళ్ళుదురు]

మాన—అహః! నలుగడలను ఏమిహత్య జరుగుచున్నది! ఏమిహత్య! ఈ వేదుపులు! ఈ అఱపులు! ఎట్టి కరుణదృశ్యము! ఓ పరమేశ్వరా! నీరాజ్యములో మనుష్యుఁడు మనుష్యుని దినుటయే నియమమా? పృథ్విపై నీహింస కింక నంతముండదా? మనుష్యుఁడు నిరాతంకముగ నింకొకమనుష్యుని జంపుచుండ దయామయుఁడవగు నీవు మెదలక చూచుచుందువా? నీలాకాశమును భేదించుకొనుచు పాపముయొక్క వికటము భీకరము నగు విజయహుంకారము పైకెగయుచున్నది. అప్పటికిని నీవు దానికుత్తుక నొత్తవా? ఇదియెంతభీషణము, కరుణము, మర్మ

భేదకము నగుదృశ్యము! ఈపీనుఁగుఁ గుప్పలుచూడఁజాలను. ఈ యాహతుల యార్తనాదములు వినఁజాలను.

౧ ఆహ—అబ్బో చచ్చితిని.

మాన—అబ్బాయీ! నీకు దెబ్బ ఎక్కడతగిలినది. అయ్యో! నీ కెట్టి కష్టమువచ్చినది!

౧ ఆహ—ఇక్కడ ఇక్కడ. అమ్మా! నీవెవరు?

మాన—ఊరకుండుము. మాట్లాడకుము. (గోలితగిలినచోట కట్టు కట్టును. మఱియొక సైనికుని సంజ్ఞచేయ వాఁడు గిన్నె తెచ్చి యిచ్చును. మానసి ఆహతునితో ననును) ఏమియు భయము లేదు. ఇదిగో! మందు త్రాగుము. (వాఁడు మందుత్రాగును. ప్రక్కనున్న మఱియొక ఆహతునియొద్దకుఁబోయి మానసి చెప్పును.) మెదలక పండుకొనుము. నీకు పరిచర్య యేర్పాటు జరుగును. (ఒక రాజపుత్ర సైనికునకు సంజ్ఞచేయ వాఁడు వెళ్లును. అంతఆమె రెండవఆహతునితో ననును.) నీవు మెదలకయుండుము. నేనిప్పుడే వచ్చెదను.

౩ ఆహ—రామ రామా! ప్రాణముపోయిన బాగుగనుండును. బాధ యెక్కువగా నున్నది.

మాన—(వానియొద్దకుఁబోయి చూచి యనును) ఇంక వీనికి ప్రాణమున్నది. (ఒక సైనికునితో) వీనిని చూడుము.

హిందా—దాహము! దాహము! నీరు! నీరు!

మాన—(హిందాహతునియొద్దకుఁబోయి ఒక సైనికునినుండి జలపాత్రము దీసికొని వానికిచ్చుచు) ఇదిగో! నీరు త్రాగుము.

హిందా—(నీరుత్రాగి) అల్లా! ప్రాణమునిలిచినది.

[కొందఱు సైనికులతో అజయుఁడు వచ్చును]

అజ—ఈఅంధకారములో నీవెవరు?—మేవారురాజకన్యయా?

మాన—ఎవరు?—అజయుఁడా?

అజ—(దగ్గరకువచ్చి) అన్నను మానసీ!

మాన—అజయా! స్త్రీసైనికులతో ఆహతుల పరిచర్యలో నాకు సాయ పడుఁడని చెప్పుము. మామనుష్యులు తక్కువగ నున్నారు.

అజ—వారేమి పనిచేయవలయును?

మాన—ఆహతుల నెత్తుకొనిపోయి సేవాశిబిరమునఁ జేర్చవలయును.

అజ—మంచిది. సైనికులారా! మీ రీపనిచేయుఁడు.

[సైనికులు డోలీ తెచ్చుటకు పోదురు]

మాన—ఏమిఆనందము అజయా!

అజ—ఏమిజ్యోతి మానసీ!

మాన—ఎక్కడ?

అజ—నీముఖమున.—ఈ వికటార్తనాదపు జన్మభూమిలో, ఈమృత్యు లీలాక్షేత్రమున, ఈ భయానక శ్మశానమున, నక్షత్రదీప్త మగునీయంధకారమున ఏమిజ్యోతి! ప్రక్షుబ్ధసాగరమున ప్రభాత సూర్యుఁడువలె, కాలమేఘములలో స్థిరమగు నీలాకాశము వలె, దుఃఖముపై కరుణవలె—ఏమిమూర్తి! ఈ సౌందర్యము! ఈ గరిమ! ఈ విస్మయము! చాల అపూర్వములు.—మానసీ! (చేయిపట్టుకొనును.)

మాన—అజయా!

## అష్టమ దృశ్యము.

స్థానము—ఉదయపుర రాజమార్గము.

సమయము—ప్రభాతము.

[కొందఱు చారణులు పాడుచువచ్చెదరు. వెనుక అమర సింహుఁడు, గోవిందసింహుఁడు, అజయసింహుఁడు, సామంతప్రభువులు వచ్చెదరు.]

అమ్మలారండు పురకాంతలార!
సమ్మదమున సమరమ్మును గెలిచి తే
జన్మస్థల సమరసీమ నాఁడే తెలిసెడు నిదే ॥అమ్మ॥

౧ పరపంక్తి సైన్యము నగ్గు సేయుటకు
మునసి యౌవనవాహిని యేతెంచను
మనకత్తులకు న్నెత్తురు బలియిడి
మడసిరి తురుష్కులెల్లన్ ॥అమ్మ॥

౨ మనభూపాలుఁడు నేఁడు తురుష్కుల
మదమడంచె మనమాన్యత నిలిపెను
మన మేవాడుకు నేఁడు కద్దె శుభ
దిన మాడుఁడు పాడుఁ డిఁకన్ ॥అమ్మ॥

# మేవాడు పతనము.

## ద్వితీయాంకము

### ప్రథమ దృశ్యము.

స్థానము - ఆగ్రాలో సగరసింహునియిల్లు

సమయము - ప్రభాతము

[సగరసింహుఁడును అతనిదౌహిత్రుఁడగు అరుణసింహుఁడును మాటాడుచుందురు.]

సగ—అరుణా! ఇది చాలవింతమాట. అమరసింహుఁడు దేవారయుద్ధములో మొగలులను గడ్డిపరకనుబలె నరికివేసెనఁట.

అరు—రాణాఅమరసింహా! నీవుధన్యుఁడవు.

సగ—బాల్యమున అమరసింహుఁడు ఆటలకోరుగను విలాసప్రియుఁడుగను ఉండెడివాఁడు. ఇంతవాఁడగునని ఎవ్వరికిఁ దెలియును!

అరు—తాతా! వాల్మీకిమహర్షి మొదట దోపిడిగాఁడుకాదా?

సగ—వాల్మీకియెవరు? తులసీదాసునికొడుకా?

అరు—ఓరా! తాతా! నీవు వాల్మీకిపేరే వినలేదా? ఆయన ఒకగొప్ప మహర్షి.

సగ—అటులనా? అయితే ఆయనను ఎక్కడనేనిచూచితినేమో గుర్తులేదు.

అరు—నీవెట్లు చూడఁగలవు? ఆయన త్రేతాయుగపువాఁడు.

సగ—ఏయుగమంటివి?

అరు—త్రేతాయుగమున.

సగ—ఓహో! అయితే నేను పుట్టకముందుమాట, విన్నాను. ఆయన చాల రసికుఁడఁట.

అరు—కాదయ్యా! ఆయన రామాయణము వ్రాసినాఁడు.

సగ—రామాయణము వ్రాసెనా! అదిచాల మంచిపుస్తకము.

అరు—ఏమి తాతా! నీవు రామాయణము చదువలేదా? రాములవారు మన పూర్వపురుషుఁడు, అందు ఆయనకథనే వ్రాయఁబడినది. నీవు ఆయననుగూర్చి ఏమియు నెఱుఁగవా?

సగ—అబ్బాయీ! నేనెక్కడ చదువుదును? యుద్ధములతోనే నాజన్మము గడచినది. చదువుటకు తీరికయెక్కడ?

అరు—తాతా! నీవుకూడ నెన్నఁడేని యుద్ధము చేసితివా?

సగ—అబ్బో! చాల గొప్ప యుద్ధములు చేసితిని. అప్పుడింక నీవు పుట్టలేదు.

అరు—నీవెవ్వరితో యుద్ధము చేసితివి?

సగ—ఇది బాగుగ జ్ఞాపకము లేదుగాని నేనుచాల యుద్ధములొనర్చిన మాటమాత్రము వాస్తవము. అప్పుడు మీఅమ్మ—

అరు—తాతా! మాఅమ్మ ఎక్కడనున్నది?

సగ—ఆమె ఎక్కడనున్నదో యెవ్వరికిని తెలియదు. ఒకనాఁడు ఉదయము లేవగనే "మీవాఁడు మేవాడు" అని అఱచెను. నాఁటి సాయంత్రము మేము చాల వెదకితిమి గాని ఆమెజాడ తెలియలేదు.

అరు—మాతండ్రియో?

సగ—ఆయన మొదటనుండియు పిచ్చివాఁడు. ఒకమారు గజసింహమహారాజుతో గుజరాతుపైదాడి వెడలి అచ్చటనే మరణించెను.

అరు—మాఅమ్మ ఈ మేవాడుప్రాంతమునసే యుండునని యనుకొని యెద.

సగ—ఉండవచ్చును.

అరు—తాతా! నీవు మేవాడువిడిచి యిచ్చటి కేలవచ్చితివి? చూచి తివిగదా నీసోదరుఁడు మహారాణా ప్రతాపసింహుఁడు దేశము నకై ప్రాణమర్పించెను.

సగ—కనుకనే పాప మింతచిన్నతనముననే చనిపోయినాఁడు. నేనెంత వలదన్నను నామాటవినలేదు. ఇంక నాదోషమేమో చెప్పుము.

అరు—అయితే ఎక్కడచూచినఅక్కడ భట్టులు, చారణులు ఇప్పు డాతనికీర్తినే గానముసేయుచు తిరుగుచున్నారు.

సగ—అయిన నేమాయె? చచ్చిపోయినవాఁడు తనకీర్తి వినుటకు తిరిగి రాఁడుగదా! నాకు బాగుగ జ్ఞాపకము. ఒకమారు మేము బాలురముగా నున్నపుడు ఒక ముంగిసకును పామునకును పోరు జరిగినది. ముంగిస గెలుచునని నేనంటిని. కాని ప్రతా పుఁడు నామాట ఒప్పుకొనలేదు. ముంగిస పాముపడిగపై లక్ష్యముండి ఇటునటు ఉరకసాగెను. పాము పడిగవిప్పి బుస కొట్ట నారంభించెను. తుదకు ముంగిస పామును గట్టిగా పట్టు కొనెను. పాము తల నేలనుగొట్టుకొని అక్కడనే చచ్చిపో యెను. ముంగిసకు పామును జంపుట సహజము. ఇంక పామెంత వఱకు దానిముందు నిలువఁగలదు? కనుకనే నేను ముంగిస పక్షము గ్రహించితిని. ప్రతాపుఁడు పాముపక్షము. ఇప్పుడు నిదియే సంగతి.

అరు—అయితే దేవారయుద్ధము మాటయేమి చెప్పెదవు?

సగ—అబ్బాయీ! ఎన్నేనిచెప్పు, ఇంతకు నది రక్తబీజవంశము. ఎంతవఱకు దానిని నఱకెదవు? ముసల్మానులసంఖ్య తగ్గనేని

మరల హిందువులను ముసల్మానులుగా చేసికొని వారు పోరాడెదరు. హిందువులు ముసల్మానులను ఆవిధముగ హిందువులం జేసికొనరుగదా! ఇంతే కాదు. ఒకమారు ఏవిధముగనో ముసల్మానులైన హిందువులనుగూడ మరల హిందువులుగ పరిగ్రహింపరుగదా. ఇంక హిందువులు ముసల్మానుల నేమిచేయంగలరు. ఇచ్చటనే హిందువులు చాల పొరబడుచున్నారు.

అరు—ఎట్లు?

సగ—చూచితివిగదా! నీమేనమామ మహాబత్ఖాను ఎంతసులభముగ ముసల్మానయ్యెనో. వారి అబ్దుల్లా హిందువు కాంగలండేమో కొంచెము విచారించుము. అతండెప్పటికిని హిందువు కాంజాలండు.

అరు—తాతా! అయితే నీవుకూడ ముసల్మానెందుకు కాలేదు?

సగ—ఇక్కడనే మీ తాతకు తెగింపుకలుగలేదు. నా కుమారుండత్యంత సాహసుండు. వాండేమియు నాలోచనము సేయలేదు. అయితే అంతకుముందు నేనుచేయవలసిన పనియంతయుం జేసి వాని మార్గము సుగమముచేసితిని. నేనుసాహసించి మొగలుల పక్షమునం జేరకున్నచో మహాబత్ఖాను ముసల్మానగుటకు సాహసింపండు.

అరు—తాతా! నీవు తప్పక ముసల్మానుకావలసినదియే. రామాయణము చదువని హిందువు ముసల్మానే కావలయును.

సగ—అరే! రామాయణమున నేమున్నది? కల్లుదుకాణము కబురులు.

[మొగలుసేనాపతి సైయదు అబ్దుల్లా ప్రవేశించును.]

సగ—అబ్దుల్లా సాహెబ్ గారు! రండి ఆదాబు!

అబ్దు—ఆదాబు రాణాజీ!

సగ—రాణా ఎవరు?

అబ్దు—మీరే రాణా.

సగ—నేనెక్కడి రాణాను.

అబ్దు—మేవాడుకు.

సగ—ఎట్లు? మేవాడుకు రాణా అమరసింహుండు.

అబ్దు—బాదుషాగారు ఇప్పుడు మిమ్మే రాణాచేసిరి.

సగ—దీనిఉద్దేశము?

అబ్దు—మీరిప్పుడు చిత్తూరు వెళ్లవలయునని వారిహుకుం.

సగ—చిత్తూ రెందుకు?

అబ్దు—అదియే మీరాజధాని.

సగ—అయితే అమరసింహుని రాజధానియెక్కడ? ఉదయపూరు లోనా?

అబ్దు—ఆయన యిపుడు రాణాకాండు. బాదుషాగారు ఆయనను రాజ్యభ్రష్టునిఁజేసిరి.

సగ—అతండు రాజ్యమెట్లువిడుచును?

అబ్దు—విడిపింపఁబడుటచే.

సగ—అయితే నేనిపుడు అతనితో యుద్ధముచేయవలయునా? వద్దు బాబా! నేను రాణా కాఁగోరుటలేదు.

అరు—ఏమి? యుద్ధముచేయుట బాగుగ తెలియుననియు, జీవితమంతయు యుద్ధములతోనే కడచెననియు నీ విప్పుడేకదా చెప్పితివి. ఇప్పుడు వెళ్లి యుద్ధముచేయుము.

సగ—అబ్బాయీ! నీవు మొదలకుము. నిన్నెవ్వరడిగినారు? (అబ్దుల్లాతో) సైయద్‌సాహెబ్! నేను యుద్ధము చేయఁజాలను. అందుకనియే నేను మొగలుల పక్షమునఁ జేరితిని. నేను యుద్ధమే చేయఁగల్గియున్నచో నా మాతృదేశముపక్షమున పోరాడక పైఁగా దానికివిరుద్ధముగ నేఁదుకుదాడి వెడలుదును?

అబ్దు—లేదు జనాబ్! మీరు యుద్ధము చేయవలసినపని లేదు. అట్టి అవసరము వచ్చుచో మేమే యుద్ధము చేసెదము. దయచేసి రాణాయగుటయు, చిత్తోడులో నుండుటయునే మీరు చేయవలసినవి.

సగ—అమరసింహుఁడు చిత్తోడు మీదికి దాడి వెడలినవో?

అబ్దు—లేదు. ఆయన దాడి వెడలఁడు. ఇదివరకెన్నఁడును దాడి వెడలనివాఁడు ఇప్పుడెందుకు వెడలును?

సగ—ఔరా! సయ్యామసాహెబ్! ఇదియు నొకయుక్తియా? మనుష్యుఁడు ఇదివఱకెన్నఁడును చావలేదని ముందెన్నఁడును చావఁడా? మీ రారోజున పెళ్లి చేసికొనిన నింక మీకు పెళ్లికాలేదనియా?

అబ్దు—నాకు మీమాట యర్థముకాలేదు.

సగ—అనఁగా మీరు పూర్వమెన్నఁడును పెండ్లి చేసికొనలేదు. అందుకని మీ యాపెండ్లి పెండ్లికాదా? ఇదియు నొకప్రమాణమా? (అరుణునిదిక్కు చూచి) అబ్బాయీ! నీవేలనవ్వెదవు? (అబ్దుల్లాతో) పాము పూర్వము కఱచియుండినచో నింక నెన్నఁడును కఱవదనియా?

అబ్దు—జనాబ్! మీరు కోపించెద రేల?

సగ—వహ్వా! కోపగించనా? మీ రాడేమాట లేమి? క్షమించుఁడు. నేను రాణా కాఁగోరుట లేదు.

అబ్దు—మంచిది. అయితే మీరు బాదుషాగారివద్దకు నడువుఁడు. మీరు చెప్పఁదలచినది అక్కడనే చెప్పికొనుఁడు.

సగ—మంచిది నడువుఁడు. కాని ఇది చాల నీచమును దుష్టమునగు సంగతి. నన్ను మీరు గుప్పిటలో నుంచుకొని బలవంతముగా నన్ను రాణా చేయఁగోరుచున్నారు. తర్వాత ఏమగునో చూడుఁడు. కాని ఇది చాల అన్యాయము. కృతఘ్నత. అరుణా! పద.

## ద్వితీయదృశ్యము

స్థానము—ఉదయపుర రాజ ప్రాసాదము.

సమయము—ప్రభాతము.

[మానసి పాడును]

గీతము.

నీదుదర్శనమున జగము నిద్రిత వహింయించెన్
నీదు కరస్పర్శమునఁ బ్రిమోద మెడఁద వసియించెన్
శూన్యజగము శుభభరితము సులలితరవ మెసఁగె దెసల
మాన్యసూర్యచంద్రులు సుధంబరువడి వర్షింపుచుండిరి
వనమునవికసించెఁ బువులు ప్రవహింపుచునుండె నదులు
అనువుగ మలయానిలపు సమాగమమ్ము సుగమమయ్యె
కరమున నవకుసుమమాల గ్రాల నధర సుధనొసంగు
కరము సుందరము వసంతు ఘనకుంజము సుఖకరమ్ము॥

[అజయసింహుఁడు వచ్చును.]

మాన—ఎవరు? అజయా!

అజ—అవునుమానసీ!

మాన—ఇన్నినాళ్లవఱకు నీవు రాలేదేమి? అస్వస్థతగానుంటివా?

అజ—లేదు.

మాన—నేను నాయనగారితో నీవిషయ మడిగితిని. వారు నీతో నేమని చెప్పిరా?

అజ—లేదుమానసీ! ఇచ్చట నొంటిగానుంటి వేల?

మాన—పాడుచుంటిని. ఇంక నాలోచించుచుంటిని.

అజ—ఏమి ఆలోచించుచుంటివి?

మాన—మానవుఁడు చాలదుర్బలుఁడని యాలోచించుచుంటిని. మేవాడుయుద్ధములో నే నిదియే నేర్చుకొంటిని ఒకకత్తి వే)

టుతో నేలపైఁగూలును. కొంచెము జ్వరమురాఁగానే బాలకునివలె నిస్సహాయుఁడగును. ఔరా! ఎవ్వనిరక్తములో మృత్యుబీజము కలిసియున్నదో వాఁడు తోడిమానవుని ప్రేమింపఁగ ద్వేషమేల వహించును? అజయా! నీవు ఱెప్పవాల్పక నా మొగము చూచుచుంటివేమి?

అజ—నీ మొగమున నేఁడును ఆనాఁడు చూచిన స్నిగ్ధజ్యోతిని చూచుచుంటిని.

మాన—ఏనాఁడు?

అజ—నాఁటిరాత్రి—దేవారయుద్ధక్షేత్రమున. నాఁడు అంధకారమున నీవు మూర్తీభవించినదయవలె గన్పట్టితివి. నాఁడే నా యున్ముఖప్రేమ అపారనిరాశానిశ్వాసమున లీనమైనది.

మాన—అజయా! ఏటినిరాశ?

అజ—ఏటినిరాశయో చెప్పఁదువా? నిన్ను పరిగ్రహింపఁబూనుట వ్యర్థమని యెంచితిని. నీ వీ భూలోకపుసుందరివి గావనియు, మూర్తిమతియగు మహిమవనియు, స్వర్గీయదేవివనియు తెలిసికొంటిని. తీవ్రమగు నీ యాత్మజ్యోతిని ఈవిశ్వము భరింపఁజాలదు. దానినికప్పియుంచుటకే ఈశ్వరుఁడు నీ ఈ సుందరశరీరమును ఆవరణస్వరూపముగ రచించెను. ఆకాశమొక రంగస్థలమగుచో ఒక్కొక్క నక్షత్ర మొక్కొక్క పవిత్రచరిత్రమగుచో, చంద్రిక యొకనిర్మలసంగీతమగుచో ఆ మహానాటకమునకు నీవు నాయికవగుదువు. నేను నిన్ను ప్రేమించుటకు యోగ్యుఁడనుగాను. కాని నీపై భక్తినొనర్పఁగలను. ఆ భక్తికిబదులుగా లేశమాత్రము నీకరుణను గోరుచున్నాను. నాకోరికతీర్చెదవా? (అజయుఁడు మానసిచేయి పట్టుకొనును. ఇంతలో రాణివచ్చును.)

రాణి—అజయసింహా!

[మానసిచేయివిడిచి అజయుఁడు వెనుకకుఁబోవును.]

మాన—ఏమిఅమ్మా?

రాణి—అజయా! ఏకాంతమున నీవిటుల నూకన్యతో మాట్లాడఁ గూడదు.

అజ—నేను క్షమాపణగోరుచున్నాను.

మాన—క్షమాపణమెందుకు అజయా?

రాణి—నీవు రాజకన్యవని జ్ఞాపకముంచుకొనుము లోపలికిఁబొమ్మా.

[మానసి వెళ్ళును.]

రాణి—అజయా! నీవు గోవిందసింహుని పుత్రుఁడవు. నిన్ను మేము పరాయివానిగా నెంచము. కాని యిపుడు 'మానసియు పిల్ల కాదు. నీవును పిల్లవాఁడవుగాదు' అనుసంగతి నీవు మఱువఁ గూడదు. మానసితోఁ గలియునపుడు నీవీవిషయము జ్ఞప్తినుంచుకొనుము. అసలు నాయుద్దేశము నీవు దానితోఁ గలియుటయే మంచిదికాదని.

అజ—చిత్తము. (నమస్కరించిపోవును.)

రాణి—బాగుగ తెలిసినది. అజయునితో మా మానసికి పెండ్లియయిన బాగుగనుండును. కాని యిది అసంభవము. (దృఢచిత్తముతో) కాని దానివిషయమై చింతయెందుకు?

(రాణా అమరసింహునిప్రవేశము)

రాణా—రాణీ!

రాణి—మహారాజా! నేను మీయొద్దకు రావలయునని కొంటిని.

రాణా—నీవు మానసి నేమేనియంటివా?

రాణి—లేదు. ఎందుకు? ఏమయినది?

రాణా—అదియేడ్చుచున్నది.

రాణి—(విస్మయముతో) ఏడ్చుచున్నదా?

రాణా—ఔమ్మ. ఎందుకుఏడ్చుచున్నదో చూడుము.

రాణి—ఒట్టిపిచ్చిపిల్ల. ఏడ్చుటకు నేను దాని నేమంటిని ? మీరు పిల్లదానిజోక్యమేమియు పుచ్చుకొనరు. అదియు నంతమాత్రము తెలివిగలదియే. అది యిప్పుడే కొంచెముసేపటిక్రింద అజయసింహునితో—

రాణా—జాగ్రత్త! మానసివిషయమై ఆలోచించి మాటాడుచుండుము. అదియెవ్వరో తెలియునా?

రాణి—ఎవ్వరు?

రాణా—అదియెవ్వరో మనమెఱుఁగము. ఇంతవఱకు మనము దానిని గుర్తించనేలేదు. అదియెవ్వరో ఎక్కడనుండివచ్చినదో యెవ్వరును చెప్పఁజాలరు.

రాణి—అదిగో! ఇటుఅటు కూడ నేనేచెడ్డదానను. పిల్ల ఎందుకు ఏడ్చుచున్నదో వెళ్ళిచూచెదను. ఊరక మొండిపట్టు పట్టును (వెళ్ళఁబోవును).

రాణా—ఇదిగో! చూడు. (రాణి తిరిగివచ్చును) ఇఁకముందు మానసిని నీవేమియు ననవద్దు. ఒక స్వర్గీయకిరణము దయచే నీలోకమునకువచ్చినది. నీవేమేనియన్నచో కోపించి వెళ్ళిపోవును. (రాణి నిరాశను బ్రకటించుచు వెళ్ళిపోవును. రాణా ఒక ఉన్నతాసనమునఁ గూర్చుండి ఆకాశమువంక చూచుచుఁ జెప్పును) ఈ జీవితముకూడ ఒకస్వప్నము. ఈ ఆకాశ మెటుల నీలము, నిర్మలము, గంభీరమునై యొప్పారుచున్నది! దానిక్రింద గొప్ప మేఘములు మెల్లగ నెగురుచున్నవి. ప్రకృతిజీవితములో సముద్ర

సాగరంగుబలె అలలు లేచుచుండును. మరల కూలుచుండును. ఈ అలస సౌందర్య మప్పుడప్పుడు భీకరాకారమును ధరించుచుం డును. ఆకాశమున మేఘములు గర్జించును. పృథ్విపై జలమువర్షిం చి ప్రవహించును. మరల పూర్వమువలె నన్నియు శాంతములు స్థిరములు నయిపోవును.

[గోవిందసింహుండు వచ్చును.]

రాణా—ఎవరు? గోవిందసింహాజీ! ఈసమయమున హఠాత్తుగ వచ్చితి రేల?

గోవిం—మహారాజా! మేవాడుపై దండెత్తుటకు మరల క్రొత్తగా మొగలసేన వచ్చినది.

రాణా—వచ్చినదా? దేవారయుద్ధముతో నీయుద్ధమంతరింపదని మనము మొదటనే యనుకొంటిమి. రాజపుతానాను రూపుమాపు వఱకును మొగలు లూరుకొనరు.

గోవిం—మహారాజా! మన పక్షమున నింక నాప్రయత్నములో నుండక పోవుట కేమికారణము?

రాణా—ఎందుకు! ప్రయత్న మెందుకు?

గోవిం—మహారాజిప్పుడు యుద్ధముచేయరా?

రాణా—ఎందుకు? యుద్ధముచే నేమిప్రయోజనము?

గోవిం—అయితే మొగలులు వెంటనే మేవాడును వశపఱచు కొందురు.

రాణా—వారికింత పట్టుదలయున్నచో నింక బాధ యేమున్నది?

గోవిం—నిజముగ మహారాజు యుద్ధముచేయరా?

రాణా—లేదు, ఒకమారు రేమైనదో అయినది.

గోవిం—మన మేప్రయత్నమును, ఏప్రతిక్రియయు చేయకయే—

రాణా—అయితే ఈమాటలన్నియు నెందుకు? ఇవన్నియు వ్యర్థమని నాయభిప్రాయము. దేవారయుద్ధములో మన సైనికులలో సగము కెక్కువగ చచ్చిరి. మొగలులతో పోరుటకు మనకు సైన్యమేది?

[సత్యవతి ప్రవేశించును.]

సత్య—మహారాజా! భూమిపెకలించుకొని సైన్యమువచ్చును. సైన్యమునకై మీరు చింతింపకుఁడు.

రాణా—ఎవరు?— చారణీ!

సత్య—అవునుమహారాజా? నేను చారణిని. మొగలులు మేవాడుపైకి మరల దండెత్తివచ్చిరని వింటిని. మేవాడ తగుప్రయత్నములో లేక నిశ్చింతముగనుండుటచూచితిని. మహారాణాను నిద్రించుచున్నాడేమో యనుకొంటిని. మహారాజునకు నిద్రాభంగము చేయుటకై యిపుడు నేను వచ్చితిని.

రాణా—చారణీ! ఇప్పుడు మేము యుద్ధము చేయఁగోరుటలేదు. ఈమారు మేము సంధిచేసికొందుము.

సత్య—ఇదియేమి మహారాజా? దేవారయుద్ధవిజయానంతరము సంధి యెందుకు? ఏమిమహారాజా! ఆగౌరవశిఖరమునుండి జారి అవమానగర్తములోపడుదురా?

రాణా—చారణీ! దేవారవిజయముమాట పోనిమ్ము. దేవారలో మనకు విజయముగలిగినమాట వాస్తవము. కాని అదియెట్లు కలిగెనో యెఱుఁగుదువా? అందు మనసైనికులు సగముమంది నశించిరి. ఇందఱువీరులరక్తము పాఱించి మన మావిజయము పొందితిమి.

సత్య—మహారాజా! ఇందుకై చింతింపవలసిన పనిలేదు. వీరులరక్తమే

జాతిని ఫలాఢ్యముగఁజేయును. వీరులు మరణించు దేశమునకై చింతింపఁగూడదు. వీరరక్తము నోసగనిదేశమునకై చింతింప వలయును.

రాణా—ఇంకనొకమారు యుద్ధముచేసినను మనకేమియు ఫలితము గనుపట్టుటలేదు. ఈయుద్ధమున కెన్నటికిని అంతములేదు. ఈ గుప్పెడుసైనికులను దీసికొని విశ్వవిజయియగు ఢిల్లీసమ్రాట్టు సేనతో పోరాడుట పిచ్చితనము.

సత్య—మహారాజా! దీనిని పిచ్చియన్నను దీనిస్థానము అన్నివివేచనల కంటెను, అన్నిఆలోచనలకంటెను చాలఉన్నతము. ప్రపంచ మంతయు నీపిచ్చితనముకాళ్ళపైఁ బడుచున్నది. స్వర్గమునుండి యొకగరిమ యే తెంచి ఈపిచ్చితనము శిరమున కిరీటము నుంచు చున్నది. మహారాజుగారు దేనిని పిచ్చితనమనుచున్నారో ఆ పిచ్చితనములేక నేటిదనుక యెవ్వఁడేని పెద్దపనిచేసెనా?

రాణా—కాని యీయుద్ధపరిణామము మృత్యువు—

సత్య— కం॥ ధీరుఁడు ప్రతాపసింహ కు
మారుఁడు యోజింపఁగలుగు ♦ మరణ ముహితమో
భీరుత నవమానంబును
నోరిచి మ్లేచ్ఛులకు లొంగి ♦ యుండుట హితమో.

మృత్యుభయమునఁజేసి రత్నమును చోరులకర్పింతుమా? రత్న ముకంటెను గొప్పదియగు మన యీ సర్వస్వమును, పూర్వసంచిత మును, అనేక శతాబ్దుల స్మారకచిహ్నమును ప్రాణభయముచే యుద్ధముచేయకయే అప్పగింతుమా? వారు తీసికొనఁగోరినచో చచ్చి తీసికొందురుగాక! చావునకై ఇంత చింతయేల? అది యెల్లరకును ఒకనాఁడు తప్పక కలుగును. మహారాజా!

తే॥ గీ॥ పరబలంబులు కడు సమీ ♦ పమునఁ గవిసి
వచ్చుచున్నవి మీాయు స్వ♦ప్నములు గవఁగ

సమయమిది కాదు తెండిఁక ♦ సమరమునకు
నిజబలముగూర్చి వేగ స ♦ న్నిద్ధు లగుఁడు॥

రాణా—చారణీ! నీవెవ్వరు! నీవాక్యములందు గర్జనము, నీనేత్రము లందు విద్యుత్తు, నీఅంగభంగియందు తుపానును గలవు. సూర్యునివంటి ప్రకాశమును, జలప్రపాతమువంటి బలమును, వజ్రమువంటి భీషణతయు గల నీవెవరు? నీవు వట్టి చారణివి గావు.

సత్య—మహారాజా! మీరడుగుచున్నారుగాన చెప్పెద. ఇంక నన్ను దాచియుంచుట ఎక్కువ అవసరములేదు. నేను రాణా ప్రతాపసింహుని సోదరుఁడు సగరసింహుని పుత్రిని, సత్యవతిని.

రాణా—ఆఁ! నీవు రాణాసగరసింహుని పుత్రివా?

సత్య—మహారాజా! ఈవిషయము తెలుపునపుడు నాశిరము లజ్జచే వంచుకొనిపోవును. అయినను విలగునంతవఱకు ఈమె తన తండ్రిపాపములకు ప్రాయశ్చిత్తము చేయుచునేయున్నది. నా తండ్రి తనయన్నకొడుకును రాజ్యభ్రష్టునిఁజేయుటకై చిత్తోరుదుర్గమున రాణాగాఁగల్పింపఁబడి కూర్చున్నాఁడు. ఇంక నాయనకూతురగు నేను మేవాడుప్రజలను ఆయనపైకి ఎగఁగొల్పుచున్నాను. సగరసింహుఁడు మేవాడ కేమియుఁగాడనియు, అతఁడు మొగలులబానిసయనియు నేను జనులకుద్బోధించుచున్నాను. మహారాజా! మీరెఱిఁగియేయుందురు. నేఁటిదనుక మేవాడవాసులెవ్వరును నాతండ్రికి పన్నునీయలేదు.

రాణా—అవునుసోదరీ! తెలియును.

సత్య—మహారాజా! మేవాడకై నేను నాసుఖమును, భోగవిలాసములను, తండ్రిని, పుత్రునివిడచి చారిణినై పర్వతారణ్యభూములందు దానిమహిమను పాడుచు తిరుగుచున్నాను. నీవు నాప్రి

యమగు మేవాడును తుచ్ఛము ననావశ్యకమునగు వస్తువును బలె నాశము కానిచ్చెదవా? (సత్యవతికన్నుల వెంటనీరువచ్చును, కంఠావరోధముగలుగును. కన్నులుతుడుచుకొనును.)

రాణా—శాంతించుమమ్మా! నీవు రాజకన్యవు. మాసోదరివి. నీవలె నీసోదరుఁడగు రాణాయును దేశమునకై ప్రాణమర్పింపఁ గలఁడు. గోవిందసింహాజీ! యుద్ధసన్నిద్ధుఁడవగుము. సైన్యముల నాయత్తపఱచుము.

—o—

## తృతీయదృశ్యము

స్థానము—మేవాడ అబ్దుల్లాడేరా

సమయము—రాత్రి.

[అబ్దుల్లా. హిందాయత్ఖాను మాట్లాడుచుందురు.]

అబ్దు—ఈదేశములో కొండలు చాలకలవు.

హిందా—అవును జనాబ్!

అబ్దు—మీరు ఓడిపోయినప్పుడు రాజపుత్రు లెటునుండి ముట్టడించిరి?

హిందా—నే నెప్పుడును ఓడిపోలేదే.

అబ్దు—మీరు ఓడిపోలేదా? శత్రువులు మిమ్ము కైదుచేసితీసికొని పోఁగా మీరు ఓడలేదందురేమి? ఓడుటయన నింకనేమి?

హిందా—వారునన్ను కైదేమిచేసెదరు? నేనే తమాషాకు పట్టుపడితిని.

అబ్దు—తమాషాగా పట్టుపడుట కేమికారణము?

హుసేన్—అవును జనాబ్! ఈయన తమాషాకే పట్టుపడెను. రాజపుత్రులు నెత్తిపైకివచ్చినపుడు మాసిపాయీలు బాగుగ ఆలోచించి ఒరలనుండి కత్తులఁదూసిరి. ప్రక్కలపై కత్తులొకప్రక్కను

ఒరలోకప్రక్కనుబెట్టి తీరికగా మీసాలు మెలివెట్టుకొనుచు కూర్చుండిరి. ఇంతలో వంట తయ్యారయ్యెను. భోజనము సేయక ఎచ్చటకును కదలలేరైరి. కాని సుష్ఠుగా భోజనముచేసి గడ్డాలు మీసాలు చక్కగా దువ్వుకొనసాగిరి. ఇంతలోనే రాజపుత్ర సైన్యములు మాద్వారమువద్దకు వచ్చినట్టు తెలిసెను. మా సిపాయీలు యుద్ధమునకు బయలుదేరిరి. మొదటనే కత్తులు, ఒరలు విడిగా పెట్టియుండుటచే తొందరలో కత్తులు మఱచి ఒరలు పుచ్చుకొని వెళ్ళిరి.

అబ్దు—ఈపొరపాటు అందఱును జేసిరా?

హిందా—అవును జనాబ్! ఇది దైవవిధానము. ఎవ్వరును ఏమియు చేయఁజాలరు.

అబ్దు—ఒక పనిచేసిన బాగుగ నుండెడిది.

హిందా—ఏమది?

అబ్దు—భోజనముచేసిన తర్వాత కత్తి ఒకవైపును ఒర ఒకవైపును ఉంచి ఒక నిద్రతీయవలసినది.

హిందా—అయితే గోలశత్రువులు వచ్చి నెత్తిపై కూర్చున్నారుగదా!

అబ్దు—నిజమే. మీకు నిద్రించుటకు సమయమే లేదు. అయితే మీ రేమిచేసినారు?

హిందా—ఇంక చేయునదియేమి?

అబ్దు—బహుశః "చంపవద్దు, కైదుచేయుఁడు" అని అఱచితిరి కాఁబోలు.

హిందా—ఇది అనలేదు కాని ఇటువంటి మాటయేదో అంటిని. బాగుగ జ్ఞాపకములేదు.

అబ్దు—పోనిండు. ఫదిర్యా అంటిరి. ఇప్పు డది మఱచుటచే ఉగ్రా

సాహిత్యమునకు గొప్పలోపము వాటిల్లు వింతమాటయేమియు ననియుండరు. ఇంతకు నటుతర్వాత మీరెంతట మీరే పట్టు పడితిరి.

హిదా—అవునుజనాబ్! మీరు బాగుగ తెలిసికొంటిరి. అయితే నేను పట్టువడుటకుముందు పొరపాటున నాపై తుపాకి పేల్చెను.

అబ్దు—అటుపిమ్మట రాణాకూతురు మీపరిచర్యకు వచ్చినదనివింటిని.

హిదా—అవును. ఆమెయు నొకవీరుని కన్యయగుటచే వీరుని గౌరవించు సంగతి బాగుగ నెఱుఁగును. అందులో నా యీముఖము—
(హుసేనుకు సంజ్ఞ చేయును)

హుసేన్—నిజముగ నీముఖము దర్శనీయము.

అబ్దు—కనుకనే ఆమె—

హిదా—జనాబ్! మీకొక విన్నపముచేసెదను.

అబ్దు—ఆమె చాలసుందరియా?

హిదా—అబ్బా! ఆవిషయ మడగకుఁడు.

అబ్దు—ఆమె మీతోనేమియున్నది?

హిదా—జనాబ్! ఆమెకు నాతోమాటాడుటకు సాహసము కలుగ లేదు. ఒకమారు "ప్రాణేశ్వర"లో కాబోలు 'ప్రా' స్పష్టముగ నుచ్చరించినది 'ణే' కూడ కొంతవఱకు వచ్చినట్లేయున్నది. నేను "కాఁబోలు" చెప్పుటకు కారణ మేమన నాకు అన్యత మాఁడు అభ్యాసములేదు. తర్వాత నే నామెవంక ఒకవిధముగ జూచితిని. ఆమెయు నతనిపై నా టక్కులు సాగవని గ్రహించి నది. తర్వాత మాట్లాడుట కామె సాహసింపలేదు.

అబ్దు—తర్వాత నేమయ్యెను?

హుసేన్—తర్వాత రాణా భయముచే సేనాపతిని వదలివేసిరి.

హిందా—లేకున్న నేనును తమాషాచూపించువాఁడనే.—

అబ్దు—హిందాయత్ అలీసాహెబ్! నిజముగ మీరు చాల గొప్ప వీరులు.

హిందా—లేదు జనాబ్! నేనంత గొప్పవీరుఁడనుగాను. అయితే నేను యుద్ధవిద్యను చాలద్రవ్యము వెచ్చించి నేర్చుకొంటిని.

అబ్దు—ఓహో! రాత్రిపూట ఈ పర్వతము లెంతనల్లగాఁ గనుపించు చున్నవి. ఈ దేశమందంతటను కొండలు ఎక్కువగా నున్నట్టు లున్నది.

హిందా—కొండలేకాదు. రెండుమూడు నదులుకూడ నున్నవి.

అబ్దు—రేపుప్రొద్దున బాగుగ చూచెదము.

[కొంచెము దూరమున తుపాకి మ్రోఁతవినఁబడును.]

అబ్దు—(భయపడి) ఇదియేమి!

హిందా—హుసేన్!—

హుసేన్—జనాబ్! ఈమారు రాజపుత్రులు మనముట్టడి చూడక వారే మనపైకి దండెత్తివచ్చినట్టులున్నారు.

అబ్దు—హుసేన్! సైన్యమును సిద్ధము కమ్మని చెప్పుము.

చతుర్థదృశ్యము.

స్థానము - చిగురుకోట

సమయము - రాత్రి.

[అరుణసింహుఁ డొకమంచముపై నిద్రించుచుండును. రెండవమంచము ఖాళీగానుండును. సగరసింహుఁడు పచారుచేయుచుండును.]

సగ—మొగలులు నన్నొకవిధముగ నీచితౌరుదుర్గమున ఖైదుచేసి యుంచినారు. ఈపురాతనశిలలును, ఈమాంధాతకాలమునాటి

వృక్షములును నాకు పెనుభూతములుగఁ గనుపించుచున్నవి. రాత్రి గాలివీచునపుడు భయముగా నుండును. ఘుం ఘుమ్మని మారుతము వీచునపుడు దయ్యముననుభావము తప్పక కలుగును. చీఁకటి పడునపుడు నల్లగ తారుపూసినట్లుండును. చుక్కలు కనబడనే కనుబడవు. ఏమైనఁగానిమ్ము. ఇక్కడ వచ్చినందుకు పెద్ద యుపకారము ఒకమారు రామాయణపారాయణము జరిగినది. చాల మంచిపుస్తకము. రెండవలాభము చారణుల వలన మాపూర్వ పురుషుల గాథలువినుట. వారు గొప్పవీరులగుటలో నేమియు సందియములేదు. నేఁడు నాకీ భయముగానుండుట కేమి హేతువో తెలియుటలేదు. అంతేయిది నిర్జనమార్గము. అంతలో నీపెనుగాలి. ఇంక భయమెందుకుండదు? పహారేదార్! పహారేదార్!

[పహారేదారు వచ్చును.]

సగ—ఇదిగో చాలజాగ్రత్తగా నుండుముసుమా! ఎవ్వరిని రానియ్యకుము. బాబో! ఇది యేమి?

పహా—ఎక్కడ మహారాజా!

సగ—ఇదిగో! ఎదుట! బాబో!

పహా—ఏమిలేదు. గాలి.

సగ—మీదేశములో గాలి బాగుగనుండునట్లున్నది.

పహా—అవును మహారాజా!

సగ—మహారాజుపని బాగేయున్నది నిద్రలే చావుగా చావుగా నున్నది ఏమోయి. మీదేశమున చీఁకటికూడ ఎక్కువగ నుండునా?

పహా—చిత్తము, మహారాజా!

సగ—ఇంత చీఁకటిలేకున్న వచ్చిననష్టమేమి? నీవు మేలుకొనియుండుము. బయట కొంచెము దీపము పెట్టుము. చీకటి కొంచెము తగ్గును. ఇంతచీఁకటిలో నాకు నిద్రపట్టదు. కత్తి చేతఁబట్టుకొని నలుప్రక్కలు తిరుగుచుండుము. ఎవ్వరేనివచ్చిన ఒక వేటువేయుము. పొరపాటున నా మెడమీద గాలిత్రము వేయకుము. పొమ్ము. (పహారేదారు వెళ్లును.) అరుణుఁడుండి నిద్రించుచున్నాఁడు. వీనిని ఏమిపిచ్చి! కొంచెము దగ్గర ఊఁ అఁ అనుచున్నను మేల్కొన్నాఁడుగదా యనుకొందును. నాకు నేఁడు నిద్రపట్టుటలేదు. మాపూర్వులీదుర్గమునందే యుండెడివారు. దీనినిఁబట్టిచూడ వారు బాలసాహసులుగాఁ గనిపించుచున్నారు. పహారేదార్!

[పహారేదారు వచ్చును.]

సగ—మెలకువగ నుంటివిగద. నిద్రపోకుము సుమీ. మేలుకొనుటకు గుర్తుగా మధ్యమధ్య కొంచెము పలుకరించుచుండుము. పొమ్ము. (పహారేదారు వెళ్లును.)

అరుణా! అరుణా!

అరు—ఆఁ తాతా!

సగ—మంచిది. నిద్రపో. నేఁడు చాలజాగ్రత్తగా నిద్రించుము. నాకు భయము వేయుచున్నది.

అరు—భయమెందుకు? నీవు నిద్రపొమ్ము. (ప్రక్కకు ఒత్తిగిలును.)

సగ—ఓరీ! ఓరీ! భయమెందుకని నిద్రపోతివి. అరే ఇదియేమి? పహారేదార్! పహారేదార్! అరే నిద్రపోతివా? అరే పహారేదార్! అరుణ! అరుణ!

అరు—ఏమి తాతా! ఈవేళ నన్ను నిద్రపోనిచ్చునట్లు లేవు.

సగ—వింటున్నావా. ఎవరో మాట్లాడుచున్నారు.

అరు—ఎవరులేరు. ఓరుగాలి (ప్రక్కకు ఒత్తిగిలును.)

సగ—అరే ఎక్కడ ఓరుగాలి! ఓరుగాలి ఎక్కడనేని మాట్లాడునా? అదిగో! మాట్లాడుచున్నాడు. బాబో!

అరు—ఏమి తాతా?

సగ—భూతము!

అరు—ఎక్కడభూతము.

సగ—అదిగో! చూడు (వ్రేలుతో చూపించును)

అరు—ఎక్కడ. నాకెక్కడ నేమియుఁ గనుపట్టుటలేదు. నీవు మేలుకొనియే కలగనుచున్నట్టు లున్నావు.

సగ—(దూరమున లక్ష్యముంచి) నేనసలు రావలయుననుకొననేలేదు. ఆయన నన్ను బలవంతముగా పంపినాఁడు. బాబూ! ఈరాణాతనము నాకక్కఱలేదు. రాణా అమరసింహుఁడే, నాప్రాణము తీయుచున్నాఁడు. నన్ను పిలుచుచున్నాఁడు.

అరు—తాతా!

సగ—సరే! ఈయన ఎవరు? చిత్తోరురాణా, భీమసింహా! జయమల్ ప్రతాప్! లేదుబాబూ! రేపే నేనిచ్చటనుండి వెళ్ళిపోవుదును? నావంక నింతకోపముతో చూడకుఁడు. ఇతఁడెవఁడు? వీరెవరు! చంపకుఁడు. చంపకుఁడు. (సగరసింహుఁడు అచి నేలపైఁబడును. అరుణుఁడు పట్టుకొనును. పహారేదారుకూడ వచ్చును.)

అరు—పహారేదార్! నీళ్ళుతెమ్ము. తాతకు స్పృహలేదు.

## పంచమదృశ్యము.

స్థానము—ఉదయపురము-రాజాంతఃపురము.

సమయము—మధ్యాహ్నము.

[మానసియు కల్యాణియు మాట్లాడుచుందురు]

మాన—కల్యాణీ! నే నిచట కుష్ఠాశ్రమ మొకటి స్థాపించితిని. కుష్ఠు రోగులు పెక్కుమంది వచ్చి నివసించుచున్నారు. పాప మెంతకష్ట పడుచున్నారు.

కల్యా—మీజీవితము ధన్యము.

మాన—కల్యాణీ! నీవు నన్ను ప్రశంసింపుము. నా కార్యము నామోదించుము. నాకు ఉత్సాహమొసంగుము. నా హృదయమునకు బల మీయుము.

కల్యా—మీ యీ పనికి నెవ్వరు నాటంకము కలిగింపలేదా?

మాన—నాయనగా రేమియు ననరు. అయితే యితరులు రాజకుమారి కట్టి పనులు శోభాకరము గావందురు. రాజకుమారి సుఖపడఁ గూడదని వారితలంపు కాఁబోలు.

కల్యా—ఇందులో అంత గొప్ప సుఖముండునా?

మాన—కల్యాణీ! సుఖము తప్పక కలుగును. ఇతరులను సుఖపెట్టుటయే నిజమగు సుఖము. తన్ను తాను సుఖపెట్ట యత్నించుట వ్యర్థము. క్రూరజంతువులవలె నట్టి యత్నము తన సంతానమునే భక్షించును.

కల్యా—అన్నయ్యకూడ నిట్లే చెప్పుచుండెడి వాఁడు. అతఁడు మీ శిష్యుఁడుకదా? అతఁడు తప్పక మీపేరు స్మరించుచుండును.

మాన—నిజముగ నా పేరు స్మరించునా?

కల్యా—అంతియేకాదు. మిమ్ములను పూజించుచుండుమనియే చెప్పవచ్చెను. అతఁడే "నీవు అప్పుడప్పుడు నాయాత్మను హరిద్వారమునకుఁ గొంపోయి తీర్థస్నానము చేయించి గొనితెమ్ము" అనెను.

మాన—తానెందుకిచటకు రాడు? అతనితో రమ్మనిచెప్పుము. అతనిని చూడవలయునని నాకు చాల కోరికగా నున్నది.

[ఒకదాసి ప్రవేశించును]

దాసి—రాజకుమారీ! ఒకపటములమ్మునది వచ్చినది.

మాన—అది పటములమ్మునా?

దాసి—చిత్తము.

మాన—మంచిది. దాని నిటకుఁ దోతెమ్ము.

[దాసి వెళ్ళును]

మాన—మీయన్నయ్య ఎప్పుడు నేమిచేయుచుండును?

కల్యా—నే నతనిని ఇంటియం దరుదుగాఁ గాంచుచుందును. ఇంటికి వచ్చినప్పు డడిగినయెడల,

గీ॥ చనితి నల్ల రోగికిఁ బరిచర్య సేయ
వెడలియుంటిని నొక్క నిర్విణ్ణుఁడైన
దీనునకు ధైర్యముం జెప్ప నేనటంచు
నిట్టిపనులనె యెపుడు వర్తించు నతఁడు.

[పటములమ్మునది వచ్చును]

మాన—నీవు పటములమ్ముచుంటివా?

పట—చిత్తము.

మాన—నీవద్ద నేయేపటము లున్నవి?

(పటములమ్మునది మాటవిప్పుచుండగనే మానసి యడుగును)

మాన—మీదేయూరు?

పట—ఆగ్రా.

మాన—ఇంతిదూరము నీవు బొమ్మలమ్ముటకే వచ్చితివా?

పట—అవును. మేమీపనికై పట్టణములన్నియు తిరుగుచుందుము.

మాన—ఈపటమెవరిది?

పట—అక్బరుబాదుషాది.

కల్యా—అక్బరుబాదుషాదా? తెమ్ము చూతము. (చేతఁబుచ్చుకొని) ఔరా! ఏమి యాతీవ్రదృష్టి!

మాన—అయితే ఇందుకొంచెము ప్రేమయు దయయుఁగూడఁ గలవు, ఇది యెవరిపటము?

పట—మానసింహమహారాజుది.

కల్యా—ఈయన మొగమున ఇంచుక విచారము, నిరాశయుఁ గనుపట్టుచున్నవి.

మాన—అవును. కొంచెము విచారముగఁ గనుపట్టుచున్నాడు. అయితే చూచితివా అందు ఆత్మగౌరవము కూడ కలిసియున్నది. ఇది యెవరిది?

పట—జహాంగీరు బాదుషాది.

కల్యా—ఏమీ మొగమున ఆ దాంభికత్వము!

మాన—దానితోపాటు దృఢప్రజ్ఞయుఁ గలదు. ఇదియెవరిపటము?

పట—మొగలసేనానాయకుఁడగు ఖానఖానా పేరుగాంచిన అలీఖానుది. మొగమెంతచక్కనిదో చూడుఁడు.

[మానసి ఇంచుక నతనిమొగముచూచి పక్కున నవ్వెను.]

కల్యా—సన్నుతి గేల?

మాన—ఎంతమూర్ఖుడుగా నున్నాడో చూడుము. ఆ మొగము తీరు, ఆ భావభంగి చూడు, దుర్నివారవంపు వెండ్రుకలు, ఆ మువ్వారివలె ఆ పాపడి చూడుము. ఎంతమూర్ఖుడు, అహంకారివలెఁ గనుపట్టుచున్నాడో చూడుము. ఈయన యెవరు?

పట—మహాబత్ఖాను.

మాన—సేనాపతి మహాబత్ఖానా? చూచెద. (కొంచెము సేపు చూచి) ముఖము వీరరసము కురియుచున్నది. ఏమి ఆ యున్నత లలాటము! ఆ తీవ్రదృష్టి! ఈ విధముగ తేజము, దృఢప్రతిజ్ఞ, ఔదార్యము, ఆత్మాభిమానము అన్నియు నొక్కచోఁ గనుపట్టవు ఏమి కల్యాణీ! రెప్పవార్పక చూచుచుంటివి?

కల్యా—ఏమిలేదు. (తలవంచుకొనును.)

మాన—ఈ బొమ్మలెవరివి?

పట—బాదుషాగారి ఉమ్రావులది.

మాన—మంచిది నేనీ అక్బరు, జహాంగీరు, మానసింహుడు, మహాబత్ఖానుల పటములు తీసికొందును. వీని ధర యేమి?

పట—తమరు ఇచ్చినంత.

మాన—(నాలుగు మొహరీలు ఇచ్చి) ఇవిగో!

పట—ఈ మొహరీలపైది రాణా అమరసింహుని మూర్తియే కాదు?

మాన—అవును.

పట—ఇచ్చట మీ చిత్రపటమేమియుఁ గనుపట్టుటలేదు.

మాన—లేదు. నాకు చిత్రపటము లేదు.

పట—మీరు సెలవిచ్చినచో మీ పటము తయ్యారుచేసెదను.

మాన—నా పటమా? ఎందుకు?

పట—ఇట్టి కరుణాపూర్ణమగు ముఖము నెచ్చటను గాంచలేదు. అంత చక్కగా వ్రాయుట చేతకాకున్నను మీ పటము వ్రాసెదను.

మాన—వద్దు. అవుసరములేదు.

పట—ఇంకు బాధ యేమున్నది?

మాన—బాధయున్నది లెమ్ము. నీవుపొమ్ము.

పట—మంచిది నేను పోదును.

మాన—పొమ్ము.

[పటములమ్మునది పోవును.]

మాన—కల్యాణీ! ఇంతధ్యానముతో నెవ్వరి మొగము చూచుచుంటివి?

కల్యా—ఎవ్వరిదియులేదు. (పటములు కలిపివేయును.)

మాన—దీనివలన నగున దేమి? నే నా పటముతీసెదను (పటము కల్యాణి కిచ్చి) ఇదియేనా? తీసికొనుము. కల్యాణీ! నీకింతసిగ్గెందుకు? ఈయనయేకదా నీభర్త?

కల్యా—(తలవంచుకొని) అయితే మతాంతరుండు కదా?

మాన—అదియొకకథ? మతమా? మనుష్యులెల్లరు నొకయీశ్వరుని సంతతివారగునటులనే మతములన్నియు నొకమతమునుండి పుట్టినవే. అయినను వారిలో పరస్పరము నింత భ్రాతృద్వేష మేలొకో తెలియదు. ప్రపంచములో మతమును పేర జరిగినంత రక్తపాతము మరిదేనివలనను జరుగలేదు.

కల్యా—వారిని ప్రేమించుట పాపముకాదా?

మాన—ప్రేమించుట పాపమా? మానవుండెంతమతభ్రష్టుడైన వాని ప్రేమించుట యది పుణ్యము. మానవుండెంత ఘృణితుండో

అంత దయాపాత్రుఁడు. ఈ బ్రహ్మాండమంతటను ఆ దయనాది సౌందర్యకిరణ మొక్కటియే వెలుఁగుచున్నది. ఆ కిరణరేఖ యేమాత్రమేని ప్రసరింపని హృదయ మెందునులేదు. అందును,

గీ॥ అరయ సలమహాబక్షాను ♦ నాస్తికుండు
కాఁడు; మ్లేచ్ఛమాత్రుండగుఁ ♦ గాక యతఁడు
బ్రహ్మమనకయ యీశు "న ♦ ల్లా" యటన్న
భాషభేదమ్ము చేతనే ♦ పాపియగునె?

కల్యా—నేటినుండి మీరు నాకు గురువులు.

మాన—ప్రేమరాజ్యమున సురూప కురూపభేదమును మంచి చెడ్డల వివక్షయు నుండదు. అందుజాతిభేదముండదు. ప్రేమారాజ్యము భౌతికముగాదు. ప్రాభౌతిక నిర్మలాకాశమున దాని నివాసము. ప్రేమ ఎట్టి బంధనమును ఆతంకమును లెక్క చేయదు. అది స్వచ్ఛమును స్వయంవికసితము నగు నొక సౌందర్యము. మృత్యువు జయించు ఆత్మవలె ప్రళయకాలమున మహాకాలుని వలె అసంగీతము అనశ్వరము. కల్యాణీ! ఏమి చూచుచుంటివి?

[ఇంతదనుక మౌనము, ఆశ్చర్యము గలిగి మానసివంకఁజూచు కల్యాణి హఠాత్తుగ మానసిప్రశ్న విని స్వప్నమునుండి మేలుకొని నట్లగును]

కల్యా—రాజకుమారీ! మీహృదయము కూడనొక సంగీతము—(కొంచెమాగి) దయచేసి నాకు సెలవిండు. రేపు మగల వచ్చెదను.

మాన—మంచిది. పొమ్ము కల్యాణీ! రేపు తప్పక రమ్ము. అజయునితోఁ గూడ రమ్మనిచెప్పుము.

[కల్యాణిపోవును. మానసిపాడును.]

గీతము

ప్రేమమహిమ మత్యద్భుతము,
ప్రేమకులోంగనిదెవరు జగంబున
ప్రేమసర్వసమ్మతము॥

ప్రేమగ్రహించిన చేటులవాటిలదు
ప్రేమయొసంగినఁ దరుఁగదిఁకర ॥
ప్రేమనె రవి శశు లుదయింతురు మఱి
వికసించునఁ బుష్పమ్ముల్
ప్రేమనె నిరతము గాలివీచుటలు
విహగమ్ములు ప్రేమనె పాడున్॥
ఆకస మంబుధి నంబుధి యాకస
మంటును ప్రేమవశమునన్
నాకము భువిదిగు భూమియు నెక్కును
నాకము ప్రేమబలమునన్॥
ప్రేమను శిలయును దాదవియించును
ప్రేమ కసాధ్యము లేదు భువిన్
ప్రేమకిరణ మెల్లెడ వ్యాపించెను
ప్రేమమె విష్టపసారము గుణ ॥

[రాణి ప్రవేశించును.]

రాణి—మానసీ!

మాన—ఎందుకమ్మా?

రాణి—మీనాయనగారు నిన్ను పిలుచుచున్నారు.

మాన—ఎందుకు? ఏమిపని?

రాణి—నీవివాహముహూర్తము నిశ్చయింపవలసి యున్నది. కాన నిన్నేదియో అడుగఁ గోరిరి. నామాట వారు విననే లేదు.

మాన—నావివాహమా?

రాణి—అవును. యోధపురరాజ కుమారుఁడగు యశోవంతసింహు నకు నిన్నిచ్చుట ధృవపడినది. ముహూర్తనిర్ణయమునకై యోధపురమహారాజువద్దకు మనుష్యునిఁ బంపుచున్నారు.

[మానసి ఏడ్చును.]

రాణి—ఎందుకు? ఏడ్చెద వెందుకు?

మాన—లేదు, ఏడ్చుటలేదు. నేను పెండ్లిచేసికొనను.

రాణి—పెండ్లిచేసికొనవా? ఇదియేమి?

మాన—నేను నాజీవితమును వివాహబంధనమున కట్టియుంచను. నా ప్రేమ పరిధి అంతకంటె పెద్దది.

రాణి—ఇదియెచ్చటనేని కలదా అమ్మాయీ? కన్యగానుండి ఎచ్చట నేని జీవితము గడుపఁ జాలుదురా?

మాన—ఎందుకుఁగడపఁజాలరు? బాలవిధవలు బ్రహ్మచర్యమును పాలించుచుండఁగ బాలకన్యలు పాలింపఁజాలరా? నేను బ్రహ్మచారిణిగ నుందును. నాయనగారితో చెప్పివచ్చెదను. (వెళ్ళును)

రాణి—ఇదియేమి? పిల్లకేమియు పిచ్చియెక్కలేదుగదా! పిచ్చిగాకున్న మఱియేమి? వారేమియు కలుగఁజేసికొనరు. మొదటనుండియు నే భయపడుచునే యుంటిని. అదిగో! వారు వచ్చుచున్నారు. నేఁడు అనవలసిన నాలుగుమాటలు అనితీరుదును.

[రాణాప్రవేశించును]

రాణా—మానసి యెక్కడనున్నది?

రాణి—అది మీవద్దకురాలేదా? దానికి పిచ్చియెక్కినట్లుగా నున్నది.

రాణా—పిచ్చియెక్కినదా?

రాణి—పిచ్చికాకున్న మఱియేమి? పెండ్లిచేసికొననియు బ్రహ్మచారిణిగ నుందుననియు ననుచున్నది.

రాణా—మంచిది తెలిసినది.

రాణి—పిల్లనుకొంచెము అదుపుఆజ్ఞలో నుంచవలసినదని నేను మొదటనుండియు చెప్పుచువచ్చితిని. మీరు పెడచెవిని పెట్టినందుకు ఫలితమిది.

రాజా—నీకేమియు తెలియుచున్నటులు లేదు.

రాణి—నాకు బాగుగ తెలియును. దానికి పిచ్చియెత్తినది.

రాజా—ఇట్టి పిచ్చి నీకున్నచో నిన్ను బంగారుసింహాసనమునఁ గూర్చుండఁ బెట్టి పూజించువాఁడను.

రాణి—అదిగో! తండ్రికూతుళ్ళది ఒకటే దశ.

రాజా—రాణీ! నేనును దానిని బాగుగ గుర్తించితిననుట కాదు. కాని అది ఒక స్వర్గీయపదార్థమని యెఱుఁగుదును.

రాణి—అయితే అది—

రాజా—వద్దు దానివిషయమై నీవేమియు చెప్పవద్దు. నీవు మెదలక చూచుచుండుము. (నిష్క్రమించును.)

రాణి—తెలిసినది. మానసికి పిచ్చితనము పిత్రార్జితపు సొత్తు. ఇంక నాథ విపత్తు మంచిదిగా కనుపట్టుట లేదు. (నిష్క్రమించును.)

---

షష్ఠదృశ్యము.

స్థానము—గోవిందసింహుని యిల్లు.

సమయము—మధ్యాహ్నము.

[గోడకొక పటము కొట్టియుండును. సమీపమున పుష్పములు చేతఁబుచ్చుకొని కల్యాణి యాపటమువంక చూచుచుండును.]

కల్యా—ప్రియా! ప్రాణవల్లభా! మదీయయౌవన నికుంజపికమా! మదీయ సుషుప్తి సుఖజాగరణమా! మదీయజాగ్రత్ సుషుప్తి స్వప్నమా! నీవు నాజగత్తునకు క్రొత్తరంగ దిద్దితివి. నాసామాన్య జీవితమున రహస్యమయము జేసితివి. నీవు నా హృదయాంధకార గహ్వరమునఁ జొచ్చిన ప్రభాతసూర్యుఁడవు. నీవు నాహృదయ సింహాసన మధిష్ఠించిన నాహృదయాధిపతివి. నీవు నాజీవిత

నిరాశకు తలయెత్తుటనేర్పినఆశవు. నీవు సర్వదా మధురుఁడవు. సర్వదా నవీనుఁడవు. నీవు నాస్వామివి, నాదేవతవు, నాయావజ్జీవిత తపస్సువు (తనచేతిలోని పూలు పటముపైఁ జల్లును. ఇంతలో గోవిందసింహుఁడువచ్చి ఆపూజనుచూచును.)

గోవిం—(గంభీరముగ) కల్యాణీ!

కల్యా—(వెనుకకుతిరిగి) నాయనగారూ!

గోవిం—ఈపట మెవరిది?

కల్యా—(తలవంచుకొని) నాభర్తది.

గోవిం—నీభర్తయెవరు? మహాబత్ఖానా?

కల్యా—అవును.

గోవిం—ఈపట మిచట కెట్లువచ్చినది?

కల్యా—పూజించుటకై నేను తెచ్చి దీని నిచట నుంచితిని.

గోవిం—పూజించుటకా?

కల్యా—అవును. నాయనగారూ! పూజించుటకు. మీరు కోపించకుఁడు. ఇది యేమేని యపరాధమా? (గోవిందసింహునికాళ్లపై బడును)

గోవిం—మహాబత్ఖాను నీకెవఁడు?

కల్యా—(లేచి) ఆయన నాకుభర్త.

గోవిం—కాని నీకుభర్తలేడని పలుమారులు చెప్పియుంటిని.

కల్యా—మొదట నే నట్లేయనుకొంటిని. కాని యిప్పుడు నాకు భర్త కలఁడని తెలిసికొంటిని.

గోవిం—భర్తయా! మతాంతరుఁడగు మహాబత్ఖాను నీకుభర్తయా?

కల్యా—నాయనగారూ! మతము, ఆచారము నేనేమియు నెఱుఁగను. ఈయనతో నావివాహము జరిగినదనియే నే నెఱుఁగుదును. ఆ వివాహబంధనముచే దైవసాక్షిగ మేము నాఁ డేకమైతిమి. ఇప్పు డాబంధనము నెవఁడు తెంపఁగలఁడు?

గోవిం—మహాబత్ఖాను మహమ్మదీయుఁడై స్వయముగ నా బంధనము తెంపుకొనలేదా?

కల్యా—లేదు. ఆయన మహమ్మదియుఁడయ్యును నన్ను పరిగ్రహింపఁగోరెను.

గోవిం—నిన్ను పరిగ్రహింపఁగోరెనా? మ్లేచ్ఛుఁడైనపిమ్మట గోవిందసింహునికన్యను గ్రహించుటయు మానుటయు మహాబత్ఖానసియిష్టమా? కల్యాణీ! ఏనాఁడు మహాబత్ఖాను హిందూధర్మమునువిడిచి ముసల్మానయ్యెనో నాఁడే అతఁడు నిన్ను పరిత్యజించెను.

కల్యా—లేదు. ఆయన నన్ను పరిత్యజింపలేదు.

గోవిం—ఏమందువు? అతఁడునిన్ను పరిత్యజింపలేదా? కావలసిన పరాభవము నీకింకను పూర్తికాలేదా! మంచిది వినుము. నీవు మహాబత్ఖానున కేమని జాబువ్రాసితివా?

కల్యా—అవును. వ్రాసితిని.

(అజయసింహుఁడు ప్రవేశించును.)

గోవిం—హా దైవమా! (నెత్తి కొట్టుకొని) మహాబత్ఖాను దానిపై "కల్యాణీ! నేను నిన్ను పరిగ్రహింపఁజాలను" అని వ్రాసి త్రిప్పివేసెను. ఇదగో! జాబు.

(గోవిందసింహుఁడు ఉత్తరము విసరి పారవేయును. కల్యాణి దానిని తీసికొని ఆదరముతో చూచును.)

గోవిం—ఏమి అజయా! ఈసమాచారము నిజమేనా?

అజ—అవును నాయనగారూ! మొగలులు మేవాడుపైకి దండెత్తి వచ్చిరి.

గోవిం—ఈమారు సేనాపతియెవరు?

అజ—షాహజాదాపర్వేజు.

గోవిం—సేన యెంత?

అజ—సుమారు ఒకలక్షు.

గోవిం—ఈమారు సర్వము నష్టమగును. ఏమియు మిగలదు. ఇంత వఱకు మేవాడులో మిగిలియున్న కొలదిప్రాణములుకూడ పోవును. ఏమికల్యాణీ! తలవంచుకొంటివేమి?

కల్యా—ఏమిచెప్పుదును నాయనగారూ?

గోవిం—ఇప్పటికిని మహాబత్ఖాను నీభర్తయేనా?

కల్యా—అవశ్యము.

చ॥ తనుఁ గడు నాదరించుపతి ♦ దప్పక యెల్లరు పూజసేతు రే
వనితలు దన్నుఁదన్నుఁబతి ♦ పాదములర్చనసేతు, రేరు తి
ట్టిన నిలు వెళ్ళఁగొట్టినఁ గ♦డింది నవజ్ఞయొనర్చినన్ నిజా
త్మను బతిభక్తిబాయరో యు♦దారపుసాధ్వులు వారలే భువిన్.

మఱియు నెవతె పతిభక్తి భర్త తన్నెన్ని యిక్కట్టులు పెట్టుచున్నను అంధకారమున చంద్రునివలె శాంతమై తుఫానులో పర్వతమువలె దృఢమై, భ్రమణములో ధ్రువనక్షత్రమువలె స్థిరమైయుండునో ఎవతె పతిభక్తి విశ్వాసమువలె స్వచ్ఛమై కరుణవలె అయాచితమై, మాతృప్రేమవలె నిష్కామమై యుండునో ఆమెయే నిజమగు పతివ్రత. ఆయన నాకు ప్రభువు, నాకు పతి, నాకు దైవము, ఆయననన్ను తనపాదసన్నిధిని ఉంచినను ఉంచకున్నను నాకు రెండును సమానములే.

గోవిం—రెండును సమానములా? కల్యాణీ! నీవు నాకన్యవేనా?

కల్యా—అవును నాయనగారూ! నేను మీకన్యను. నేను మీగౌరవము నెన్నడును నష్టముచేయను. నాయనగారూ!

చ॥ అరయఁగ నిట్టిదట్టిదని ♦ యాడఁగఁ జెల్లకయుండు దివ్యపుం
గరిమ నినూత్నమై చెలఁగెఁ ♦ గాంచగ నేఁడు మహాబతాఖ్యపై
వరునకు నాథ్వసంచు తెలుఁ♦పంగ సుయోగము నశ్మ్య మీార లే
తెరగున మీారు జీవితము ♦ దేశముపొంటె త్యజించినార లా
తెరఁగున నేను త్యాగపుగ ♦ తీగ జరియింతును దత్సుఖాప్తికై.

ఇప్పుడు నన్నెవ్వరడ్డగింతురు? (ఆవేశముచే స్వరము గద్గదమగును.)

గోవిం—త్యాగమా! నీవు నీ యాకులఁగావృత్తిన త్యాగమనుచుంటివా?

అజ—నాయనగారూ! మీారు చెప్పునది బాగుగ యోచించి చెప్పుడు. క్రోధావేశముచే మీారేమి చెప్పునదియు మీారెఱుఁగరు. లేనిచో ఏభావమత్యున్నతము, అతిసుందరమును, అతిపవిత్రమునో దానిని మీారింతకుత్సితముగ నేలతలంచెదరు?

కల్యా—(గర్వముతో) సోదరా! నీవు నాకు నిజముగు సోదరుఁడవు.

గోవిం—అజయా! నే నిక్కడకు నూరుమారులు చెప్పితిని. కల్యాణికి భర్తలేఁడు. అది విధవయైనది.

కల్యా—నేనును నూరుమారులు చెప్పుటకు సిద్ధముగా నున్నాను. బ్రతికినను చచ్చినను సర్వదా నాకు ఆయనయే భర్త.

గోవిం—మహాబత్ఖాను నీకుభర్తయా?—ఇంతఘృణితుఁడు, నీచుఁడు, అధమాధముఁడు—

కల్యా—నాయనగారూ! మీాకు ఘృణితుఁడయ్యును ఆయన నాకు పూజ్యుఁడే.

గోవిం—పూజ్యుఁడా? ఆ జాతిద్రోహి, మతాంతరుఁడు. మహాబత్ఖాను గోవిందసింహుని కన్యకు పూజ్యుఁడా?—హా దుర్భాగ్యమా!

కల్యా—(దృఢత్వముతో) నాయనగారూ! నేను తండ్రి నెఱుఁగను, జాతి నెఱుఁగను, మతము నెఱుఁగను, ధర్మము నెఱుఁగను. నకు

ధర్మము భర్త. శాస్త్రకారులు స్త్రీకి ఇంతకంటెగొప్పధర్మమును వ్రాయలేదు. నాయనగారూ! స్త్రీ యొకమారు ఉరికిపడినచో అది అమృతసాగరమగుగాక, విషసాగరమగుగాక జీవనము గాని, మరణముగాని ఆమెకు అక్కడనే యగును. అదియే ఆమెకు ఇహకాలము. అదియే పరకాలము. ఆయన హిందువో మహమ్మదీయుడో, ఆస్తికుడో, నాస్తికుడో కాని యిపుడు మేమిద్దఱము ఒకేపథమున బోవు పథికులమే. ఇందుకుగాను నేను ఆయనవెంట నరకమునకు పోవలసివచ్చినను పోవుటకు సిద్ధముగా నున్నాను.

గోవిం—మంచిది. ఇంక నీవు వెళ్ళవచ్చును నీ యిచ్చవచ్చిన చోటికి పొమ్ము నేటినుండి నిన్ను పరిత్యజించితిని.

అజ—ఇదియేమినాయనగారూ! మీరేమిచేయుచుంటిరి? కల్యాణి మీకూతురు—

గోవిం—కాదు. అదినాకేమియు కాదు. పొమ్ము కల్యాణీ! నీభర్త వద్దకుబొమ్ము.

కల్యా—నాయనగారూ! మీయాజ్ఞను శిరసావహించితిని. ఇంక నాకు సెలవిండు. (నమస్కరించును)

అజ—నాయనగారూ! ఇంచుక ఆలోచింపుడు. ఇటుల అన్యాయము చేయకుడు. కల్యాణి అడుది. అది తప్పు చేసినచో క్షమింపుడు.

గోవిం—కుమారా! కల్యాణి నరకమునకు పోగోరుచున్నది. పోనిమ్ము. దానిని నేనడ్డగింపగోరుటలేదు.

అజ—నాయనా! ఆమె కది నరకముకాదు.

గీ॥ మహితమును పవిత్రమైన ప్రే ♦ మపవిత్రకాశ
మొందు వసియించు స్వర్గంబు ♦ నందెయుండు

తగవిచారింప కెట్టి రక్షమ్ము చేతు
లారఁ బోఁగొట్టుకొనుట న్యాయశాస్త్రగాదు.

నాయనగారూ! క్రోధావేశమున మీరేమి సేయుచుంటిరో మీకు తెలియుట లేదు.

గోవిం—అజయా! బాగుగ తెలియుచున్నది. కల్యాణీ!

గీ॥ హృదయమున దేశ విద్రోహ మెవఁడు పూను
నట్టివానికి నాయింటఁ బట్టులేదు
నీకు సతియె ధర్మంబగు నేని యిక
దేశమే నాకు ధర్మమై తేజరిల్లు.

పొమ్ము. (వెనుకకుతిరుగును.)

కల్యా—చిత్తము. (వెళ్ళఁబోవును.)

అజ—ఆగుము కల్యాణీ! నాయనగారూ! ఇంకనాకును వెళ్ళుటకు సెలవిండు.

గోవిం—(ఎదురుగ తిరిగి) ఇదియేమి అజయా?

అజ—ఈ అబలయగు బాలికను నేనొంటరిగాఁ బోనీయను. నేనును వెంటబోదును.

గోవిం—అజయా! నిన్నింటినుండి వెళ్ళుమని చెప్పలేదు.

అజ—నాయనగారూ! నేను దాని నపేక్షించుట లేదు. కల్యాణి యాఁడుది. ఆమెపుణ్యమునకు ప్రతిఫలముగ మీరామెను ఇల్లు వెడలఁగొట్టుచున్నారు. ఘాతుక మానవాకీర్ణమగు ప్రపంచమున నొంటరిగా విడుచుచున్నారు. ఇప్పుడుదాని భర్తయున్నచో దానిని కాపాడువాఁడు. ఇప్పుడుదాని భర్త యిక్కడ లేదు. కాని సోదరుఁ డున్నాఁడు. అతఁడే ఆమెను రక్షించును. రమ్ము కల్యాణీ! నేఁడు మానసోదరి సోదరుల మిద్దఱము మహానావను

విక్షుబ్ధ విశ్వసాగరమున విడుచుచున్నాము. దరిచేరుదుమో లేదో చూతము. తండ్రీ! నమస్కారము.

(అజయుఁడు కల్యాణియు నిష్క్రమింతురు. గోవిందసింహుఁడు పాషాణమూర్తివలె నిలఁబడి యుండును.)

---

## సప్తమదృశ్యము.

స్థానము—చిత్తూరు పరిసరారణ్యము.

సమయము—సాయంకాలము.

(నగరసింహుఁడు నరుణసింహుఁడు నొకచెట్టు క్రింద నిలఁబడి యుందురు. సూర్యుఁ డస్తమించుచుండును.)

నగ—ఈరాజ్యమున నుండుటకు నాకేమాత్రమును ఇష్టము లేదు. చిత్తూరుకోట ఒకవిధమగు జైలుఖానా. ప్రాఁతపడి అంధకార గ్రస్తమై భయావహముగ నున్నది. నలుప్రక్కల కొండలు, చెట్లు. ఎక్కడను మనుష్యుని జాడ లేదు. ఇంతపురాతనపు వృక్షముల నేనెక్కడను జూడలేదు. అరుణా! నేనింక ఆగ్రాకుపోదును.

అరు—తాతా! నాకీస్థానము చాల బాగుగనున్నది. ఇచ్చటిప్రతిపర్వతమును మన పూర్వపురుషుల స్మృతికి నెలవైయున్నది. ప్రాచీనగౌరవగాథలు నీకు బాగుగ నుండలేదా?

నగ—అదిగో! మరల ప్రాచీన గౌరవ రోదనము మొదలు పెట్టితివి. పోయినదేమో పోయినది. దానికై తలపగులఁ గొట్టుకొనకుము.

అరు—తాతా! నాకు వర్తమానముకంటె భూతమే బాగుగ నుండును. వర్తమానము చాలతీవ్రముగను స్పష్టముగను ఉండును. భూత

మూచ్ఛిన్నము నస్పష్టము నైయుండును. భూతము నీలిమవలెను, ఆఖ్యాయికవలెను స్వప్నమువలెను ఉండును.

సగ—అదిగో! నేను దేనికి వెరచుచుంటినో అదియే అయినది. పెద్దవాండవైనకొలంది తల్లి పద్ధతియే నేర్చుకొనుచుంటివి. అదియు నిట్లే మాట్లాడుచుండెడిది. అదియునిట్లే మాట్లాడుచు మాట్లాడుచు ఇంటినుండి లేచిపోయినది. ఎక్కడకు పోయినదో ఎవ్వరికిని తెలియదు.

అరు—మాయమ్మ యిట్లే మాట్లాడుచుండెడిదా?

సగ—అవును. ఈమాటలే దాని పాలిట మృత్యుతుల్యములైనవి. 'మేవాడ, మేవాడ' యని అఱచుచు పిచ్చెక్కి ఇంటినుండి వెళ్లిపోయినది.

అరు—నే నామెను వెదకి తీసికొనివచ్చెద.

సగ—ఈ యడవిలోనా? ఈయడవిలో మునిగిన సూర్యునేనియు వెదకి పట్టుకొనుట కష్టము. ఇంక మీ అమ్మ అమ్మయే.

అరు—కాదు తాతా! ఇప్పుడు నేను ఆగ్రాకు రాను. నీవు వెళ్ళిన వెళ్లుము. నా కీస్థానము చాలా బాగుగనున్నది. మాఅమ్మ ఈ దేశములో నున్నపుడు ఇదియే నాయిల్లు. ఇంతకాలము ఆగ్రాలో నుండుట నాకు ప్రవాస శిక్షయే.

సగ—మొదటినుండియు నాకిదియే భయము. నీవు ఆగ్రాలో బాదుషాగారి పాలరాళ్ళమేడ చూచినట్లులేదు. రమ్ము. ఈమారు చూపించెదను.

అరు—వద్దు. నేనేమియు చూడఁగోరుటలేదు. నాకీ నిర్జనవనమే అంతకంటె నెక్కువమంచిదిగాఁ గనుపట్టుచున్నది.

సగ—ఆగ్రాలో డెబ్బదెనిమిది మసీదులున్నవి. ఒకదానికంటె నొకటి మించిన యందము గలవి.

అరు—తాతా! నాకు ఎత్తైన నూరుబంగారు మసీదులకంటె నా దేశములోని ఒకశిధిల దేవాలయము మంచిది. మొగలులు కాళ్ళకడఁ గూర్చుండి రాజభోగము లనుభవించుటకంటె దీనురాలగు నాతల్లి యొడిలోఁ గూర్చుండి గంజిసీళ్ళు త్రాగుట మంచిది. తాతా! నీ పేభిక్షాన్నము గుడుచుటకేనా నీదేశము విడచి నీసోదరునివిడిచి పుణ్యకథాభరితమగు నీగృహమును విడిచి యొరులపంచకు చేరితివి? వారు రోజు నీకు గుప్పెడు బంగారము ముష్టివెట్టినను దానితో వారి పాదధూళి కలసియుండును. వారు నీవంక చూచి నవ్వునపుడు ఆనవ్వులో నేవగింపుకూడ నాకు గోచరించుచుండును. తాతా! పరుఁడొసఁగిన బంగారు బొక్కసముకంటె తనసోదరుని వట్టిపరిహాసము ఉత్తమమని నాతెలంపు.

[సత్యవతి ప్రవేశించును.]

సత్య—చిరంజీవివి కమ్ము కుమారా!

సగ—ఎవరు? సత్యవతియా? నేను కలగనుచుంటినా? లేదు. ఇది సత్యవతియే. సత్యవతీ! నీవిచటి కెట్లువచ్చితివమ్మా?

సత్య—కుమారా! ఏనాఁడు స్వదేశమునకై సన్యాసము స్వీకరించి నేను ఇలువెడలఁబోతినో నాఁడు నీ యీ చిన్నిచేతులు బంధనము విడిపించుకొనిపోవుట నాకు అన్నిటికంటెఁ జాల కఠినమైనది. మేవాడుమహిమను గానముచేయుచు నీకొండలలో తిరుగునపుడు నీచిఱునవ్వు మఱచుట అన్నిటికంటె నాకు కష్టమయ్యెను. నీవు ఇచటకువచ్చితివని వినినపుడు ఇంక నామనసు నిలువలేదు. వెంటనే పరుగెత్తుకొని నిన్నుచూచుటకు వచ్చితిని. ఇంతసేపునుండి చాటుననుండి నీయమృతవాక్కుల వినుచుంటిని. ఇట్టి స్వర్గీయవాక్కులును పృథ్విపై నుండునా యని ఆలోచించుచుంటిని. తుదకు నే నుండలేకపోతిని. న బిడ్డా! నాసర్వస్వమా!

[సత్యవతి చేయిసాచును.]

సగ—అమ్మా సత్యవతీ! నీవు నావంక నొకమారును చూడలేదు. నే నేమని యపరాధముచేసితినా?

సత్య—అపరాధమా? నీయపరాధము నీవెఱుఁగవా? అదియెఱుఁగఁగల శక్తియు నీకులేదు కాఁబోలు. నీవు నీయాదీనయు, హీనయు దుఃఖితయు, జననియునగు జన్మభూమినివిడిచి యావనప్రసాదభోగి వయితివి. ఏమొగలులు మన దేవళములను బగులఁగొట్టి మన తీర్థస్థానముల నపవిత్రముచేసిరో, ఏమొగలులు ఇచ్చటి స్త్రీజాతి నవమానపఱచి యిచ్చటిపురుషులను మనుష్యతాహీనులుగఁ జేసిరో వారికే నీవు దాసుడవైతివి. మఱియు నేమొగలులు గర్వోన్మత్తులై రాజపుత్రస్థానములో హతావశేషమగు స్వతంత్రరాజ్యము మేవాడుపైకి మాటిమాటికి దాడి వెడలుచున్నారో, ఏమొగలులు దాని సస్యశ్యామల ధరిత్రిపై తత్పుత్రుల రక్తనదులఁ బాఱించుచుండిరో ఆమొగలులనే నీవు శరణుజొచ్చితివి. నీ వామొగలుల కృపచే నీసోదరుడగు రాణాప్రతాపసింహుని పుత్రుని సింహాసనచ్యుతునిఁ జేయుటకు సిద్ధపడితివి. పైఁగా నాయపరాధ మేమియని అడుగుచుంటివి. నాయనా! నీవొకత్రోవఁబోవుట కిష్టపడితివి. మేమొక త్రోవను బోవుచుంటిమి. పొమ్ము రమ్ము కుమారా! ఈ అంధకారమున ఈ దుర్దినమున నీవే నాకు తోడిబాటసారివి. నేడు నాహృదయమునకు రెట్టింపు బలము వచ్చినది. రమ్ము, కుమారా! పోదము.

(అరుణుని తీసికొని వెళ్ళఁబోవును.)

సగ—వద్దు, వద్దు. సత్యవతీ! ఆగుము. అరుణా! నీవును వెళ్ళవద్దు. పోనిండు, నేనును మీవెంట వచ్చెదను. నేఁడు నేను కనులు తెరచితిని. నేఁడు నేను నామాతృభూమిని గుర్తించితిని. నేఁడు

నేను నాహృదయమునుండి పరుల కృపపైని ఆశను పారదోలితిని. నేటినుండి నేను నాదేశమునకై దారిద్ర్యమును, దుఃఖమును ఉపవాసమును స్వీకరించితిని. రమ్ము కుమారీ! నిన్ను కౌగిలించుకొందును.

సత్య—ఇదియేమి నాయనా! నేడు నాకింతటి భాగ్యమా? ఏకకాలమున తండ్రిని పుత్రిని పొందగలిగితినా? నీవుచెప్పునది సత్యమేనా? ముమ్మాటికి సత్యమేనా?

పగ—అవును సత్యవతీ! ఇదిసత్యము. ముమ్మాటికి సత్యము. మొదట నా కీసంగతులు తెలియలేదు. నన్ను క్షమింపుము. క్షమింపుము.

సత్య—నాయనా! నాయనా! (మోకరిలంబడి తండ్రిపాదములపై తలయుంచును.)

---

# మేవాడు పతనము.

## తృతీయాంకము.

### ప్రథమదృశ్యము

స్థానము—ఉదయపుర రాజసభ

సమయము—ప్రభాతము.

[సామంతరాజులు నిలచి మాటాడుచుందురు.]

జయ—ఈకామనేరుయుద్ధము ఇతిహాసములో సువర్ణాక్షరములతో వ్రాయఁదగినది.

గోకులసింహుఁడు—పర్వేజుకు ఆహార సామగ్రులు రాకుండ దారికట్టుట చాల తెలివిగలపని.

భూపతి—వారీ యడవిత్రోవ మెఱుఁగనట్టులున్నది.

గోకు—అయితే పాఱిపోవుత్రోవ బాగుగ నెఱుగుదురు.

జయ—నేటిప్రభాతము మేవాడుకు గౌరవమయమైనది. మేవాడు పర్వత మెట్టి నవీనప్రకాశముచే మెఱయుచున్నదో చూడుము.

భూప—ఈసుందర సమీరము ఈవిజయసమాచారమును భారతవర్షమంతటను వ్యాపింపఁజేయును.

[రాణా అమరసింహుని ప్రవేశము]

అంద—జై, రాణా అమరసింహునకు జై.

[రాణా సింహాసనమునఁ గూర్చుండును. రాజకవియగు కిశోరదాసు వచ్చి యీపద్యము చదువును.]

గీ॥ జయము జయము మహారాజ ♦ జయము నీకు
ఇన ప్రతాపత నీవిల ♦ నేలుచుండ
నీదు శత్రులు నిలువను ♦ నీడలేక
దాఁగుచుండిరి గిరి గుహాం ♦ తరములందు.

రాణా—కిశోరదాసూ! నీపద్యమున మఱియొక పాదము గూర్చుము.

కిశో—చిత్తము మహారాజా!

రాణా—"నీదు కతన సర్వస్వమ్ము ♦ నిర్గమించె"

కిశో—ఇదియెందుకు మహారాజా?

రాణా—(ఇంచుకనవ్వి) ఎందుకా? అడుగుటయేల? చూడుము.

(సత్యవతి ప్రవేశము)

సత్య—మేవాడురాణాకు జై.

రాణా—ఎవరు? సత్యవతియా! (సింహాసనము దిగి ఆమెను ఎదుర్కొని) రమ్ము సోదరీ!

సత్య—మహారాజా! ఇంతదనుక నేను బయటనిలఁబడి మేవాడువిజయగీతమును వినుచుంటిని. వినఁగా వినఁగా కనులవెంట నానందాశ్రువులు వెడలినవి. మంత్రముగ్ధనువలె మెదలక నిలఁబడి విన సాగితిని. లంకా విజయానంతరము మహారాణా పూర్వపురుషుఁడగు శ్రీరామచంద్రుని అయోధ్యానగర ప్రవేశ వృత్తాంతము స్మృతికి వచ్చినది. తర్వాత గీతమాగినది. ఒకదేవివచ్చి తన తేజమున నావరించి యాగీతమును తనస్వర్గరాజ్యమునకుఁ గొనిపోయినట్టు లయ్యెను. అప్పుడు నేను కలనుండి మేల్కొని నట్టులైతిని.

రాణా—సత్యవతీ! గీతమిట్లే యాగిపోవును. గీతములన్నియు తొలుత ఒకవిధమగు నానందకోలాహలము వలె ప్రారంభమై ఒక దీర్ఘ నిశ్వాసమున లీనమగును.

సత్య—ఇదియేమి మహారాజా! ఆనందదినమున మీరిటుల నిరానందముగను విచారముగను ఉంటిరేమి? మహారాజా! మీరుమీ హృదయమునుండి నిరాశను బారఁద్రోలుడు. నేటిదినము మేవాడుకు చాలగౌరవమయమైనది.

రాణా—గౌరవదినమే యనవచ్చును. సత్యవతీ! ఒకక్రొత్తసంగతి విందువా? కామనేరుయుద్ధమున మనము గెలువలేదు.

సత్య—ఇంక నెవరుగెలిచిరి? మొగలులుగెలిచిరా?

రాణా—లేదు. రాజపుత్రులుగెలిచిరి. కాని ఇచ్చట విజయోత్సవము చేయుమనము గెలువలేదు. యుద్ధమున గెలిచినవారు యుద్ధక్షేత్రమున పడియున్నారు. సత్యవతీ! నిజమునకు యుద్ధక్షేత్రము నుండి ఢంకాపటహాదులు వాయించికొనుచు జయజయధ్వానములు సేసికొనుచు వెడలువారలు గెలుపొందినవారు గారు. యుద్ధక్షేత్రమున ప్రాణమర్పించినవారే జయమందినవారు.

సత్య—మహారాజా! ఇదియథార్థము. ఈశ్వరుఁడు వారికక్షయకీర్తి నొసగుగాక! మహారాజా! నేను మీకొక శుభవర్తమానము వినిపించెద.

రాణా—సత్యవతీ యేమివర్తమానమది?

సత్య—మహారాజా! మాతండ్రియగు రాణాసగరసింహుఁడు మీకై చిత్తోరుకోట విడిచినాఁడు. మీరు నిరాతంకముగ కోటను వశపఱచుకొనవచ్చును.

రాణా—చిత్తోరుకోట మనకై విడిచెనా? సత్యవతీ! ఏమిఅట్లనుచుంటివి? ఇది యథార్థమా? ఇది సంభవమా?

సత్య—మహారాజా? ఇది కేవలము సత్యము.

రాణా—వారు హఠాత్తుగ మనకై కోటనేలవిడిచిరి? బాదుషా ఇట్టి హుకుమునిచ్చెనా?

సత్య—లేదు. మహారాజా! బాదుషా ఆయనకు కోటనిచ్చెను. ఉంచుకొనుటకుగాని యిచ్చుటకుగాని ఆయన కధికారముగలదు కాన మనఃపూర్వకముగ చిత్తూరుకోట మీకిచ్చి ఆయన ఆగ్రా వెళ్ళెను.

రాణా—సామంతులారా! జయధ్వనిసేయుఁడు. స్వర్గస్థులగు నాయన గారి. జీవితస్వప్నము నేఁడు సఫలమయ్యెను. అయితే ఆయన పుత్రుని బాహుబలముచేఁ గాదు. ఆయన సోదరుని దానముచే వెళ్ళి కోటవశపఱచుకొనుఁడు. క్రొత్తసైన్యము నాయత్తపఱచుఁడు. నడువుఁడు ముట్టడింపుడు. అంతపర్యంతము యుద్ధము సలుపుడు.

సత్య— జై-రాణా అమరసింహునకు జై!

సామంతులు—జై! రాణా అమరసింహునకు జై!

---

## ద్వితీయదృశ్యము

స్థానము—ఊరిబయట తోవలో భగ్నకుటీరము.

సమయము—సాయంకాలము.

(కల్యాణితో అజయుఁడు ఆతోవనే వచ్చుచుండును.)

కల్యా—అన్నా! నే నింక నడువఁజాలను.

అజ—నేఁడు మన మీయూరిలోనే యుందము. ఈ కుటీరమూరి బయటిదే! ఏదియో మకాణముగా నున్నది. తలుపు వేసిలేదు. లోపలచీఁకటిగా నున్నది.

కల్యా—కొంచెము కేక వేసి చూడుము.

అజ—ఎవరైన నున్నారా? లోపల నెవరు? ఎవ్వరును మాట్లాడుటలేదు. ఎవ్వరు నున్నట్లులేదు.

కల్యా—నేఁడు మనమిక్కడనే యుందము. ఇంక నడువఁజాలను.

అజ—మంచిది. నీవు కొంచెమును పిచ్చటనే యుండుము. నేనుపోయి ఊరినుండి దీపము తెచ్చెదను.

కల్యా—పొమ్ము. నేనొకయడుగేని నడువఁజాలను. అన్నా! నాకు చాల ఆఁకలిగా నున్నది.

అజ—నేనుకొంచె మాహారపదార్థము కూడ తెచ్చెదను. నీవిచ్చటనే యుండుము.

కల్యా—అన్నా! త్వరగా రమ్ము. ఒంటరిగా నుండుటకు నాకు భయము వేయుచున్నది.

అజ—నేను చాలత్వరగా వచ్చెదను. ఇచ్చట భయపడవలసిన పని లేదు. ఇక్కడ ఎవ్వరును లేరు. (వెళ్ళును.)

కల్యా—నేటిదనుక నే నెన్నఁడును నడచియెఱుఁగను. కనుక నే—

చ॥ పదముల శోణితంపునది ♦ పాఱుచునున్నది మైనసాదు స
మ్మదిఁ గడు సమ్మదంబొదవె ♦ మానుగ స్వేచ్ఛ మెయిన్ వరించుటన్
హృదయము నీదరిద్రితకు ♦ నీయగచాట్లకు డస్సిపోక తా
విదిత మహాభిమానమున ♦ వెల్గుచునుండె మహోన్నతంబునై.

గీ॥ రంగదుత్తుంగ భంగముల్ ♦ నింగిముట్ట
నుదధి ననివార్యమై చేరు ♦ నదివిధంబు
నాదు సర్వస్వమైన నా♦నాథుకడకుఁ
బోవుచుంటిని యధిక స♦మ్మోదమలర.

అయితే వారు తనపాదములకడ నాకు దాసీస్థానము నేనియు నిత్తురో లేదో తెలియదు. ఎవరు?

[ఫకీరువేషమున సగరసింహుఁడు ప్రవేశించును]

సగ—అమ్మా! నేనొక రాజపుత్రుఁడను. నీకేమియు భయము లేదు? నీవు రాజపుత్రస్త్రీవలెఁ గనుపట్టుచున్నావు. ఒంటరిగ నుంటివేల.

కల్యా—నాసోదరుఁడు దీపమును ఆహారసామగ్రిని దెచ్చుటకు ఊరి లోనికి వెళ్ళినాఁడు.

సగ—మంచిది. ఆతఁడు తిరిగివచ్చునంతవరకు నేనిచ్చటనే యుందును. ఇచ్చట మసల్మాను సిపాయీలు ఉత్పాతము సేయుచునుందురు. వారిలోని నలుగురైదుగురను ఇప్పుడే నే నీసమీపమునఁ జూచితిని. నీయన్నవచ్చువఱకు నేను నిన్ను కాపాడుదును.

కల్యా—మీరిచ్చటనేయుండి నన్ను కాపాడుఁడు. నాకు భయము వేయుచున్నది.

(తెరలో)—ఈ పాడుగుడిసెలోనేనా?

(తెరలో)—అవును. ఇక్కడనే. (ఒకడు తలుపుతట్టును.)

కల్యా—ఎవరు? ఎవరు? అన్నా! అన్నా!

[ముగ్గురుదొంగలు లోపలఁజొరఁబడుదురు.]

౧ దొంగ—ఇదియే. ఇదియే.

౨ దొంగ—పట్టుకొనుము.

(౧ దొంగ కల్యాణిని పట్టబోవును. ఆమె తప్పించుకొని యఱచును)

కల్యా—నన్నురక్షింపుఁడు, రక్షింపుఁడు.

సగ—(ముందుకుఁబోయి) జాగ్రత్త.

౧ దొంగ—వీఁడెవఁడు?

౨ దొంగ—ఎవఁడో, ముందు వీనినేకొట్టుము.

[సగరసింహుఁడు దొంగలతోఁబోరాడి క్రిందబడును.]

కల్యా—అన్నా! అన్నా!

[అజయసింహుఁడు ప్రవేశించును.]

అజ—కల్యాణీ! భయపడకుము. నేనువచ్చితిని, (అజయుఁడు కత్తి

చూసి దొంగలను క్రిందబడగొట్టును.) వీరిందరను తుద ముట్టించితిని. ఈయాన యెవరు?

కల్యా—నన్ను రక్షించుటకు వచ్చిరి. పాపము వీరికి దెబ్బతగిలినది.

సగ—నీ వెవరవు?

అజ—నేను సేనాపతి గోవిందసింహుని పుత్రుడను. అజయసింహుఁడను. ఈమె నాచెల్లెలు కల్యాణి.

సగ—ఎవరు? మహాబత్ఖానునిభార్య కల్యాణియా?

అజ—అవును. వీరాగ్రణీ! మీరెవరు?

సగ—నే నా మహాబత్ఖానుని తండ్రిని, సగరసింహుఁడను.

## తృతీయదృశ్యము

స్థానము - యోధపురమహారాజగు గజసింహుని దర్బారు.

సమయము - ప్రభాతము.

[గజసింహుఁడు, అతనిపుత్రుఁడు అమరసింహుఁడు, సభ్యుఁడగు హరిదాసు, దూతవేషమున అరుణసింహుడు.]

గజ—దూతా! మేవాడుమహారాణాతో మే మీసంబంధము నొప్పుకొనలేదని చెప్పుము. బాదుషాకు విద్రోహులగు వారితో మే మెట్టిపొత్తును పెట్టుకొనఁగోరుటలేదు. ఏమి హరిదాసూ?

హరి—అవును మహారాజా! చాల బాగుగనున్నది.

అరు—మహారాజా! మా మహారాణా విద్రోహ మెట్లు? మేవాడు యింతవఱకును మొగలులకు స్వాధీనము కాలేదుగదా. ఇన్ని దినములనుండియున్న తన స్వాతంత్ర్యమును గాపాడుకొనఁ బూనుట విద్రోహము కాఁజాలదు.

గజ—కాదు. ఇదియే విద్రోహము. రాజపుత్రస్థానములందు మొగలుల యధికారమునకు లొంగియుండక యొక మేవాడు మాత్రమే తలయెత్తుకొని యేల ఉండవలయును?

అరు—తెలిసినది. మహారాజుగారి మనమున నీర్ష్య నెలకొనినది. అన్ని పర్వతముల శిఖరములనుండియు గౌరవకిరణములు దిగిపోయినవి. ఒక మేవాడుపర్వతముననే ఆకిరణములావరించి యున్నవి. దీనిని మహారాజు సహింపఁజాలకున్నారు. రాజపుత్రరాజుల తలలన్నియు నగ్నములు. ఒక మేవాడు మహారాణా శిరమే కిరీటశోభితము. ఈదృశ్యము మహారాజు నేత్రములకు కంటకముగ నుండనోపును. కాని మహారాజా! మామహారాణాగారు మిమ్ము గౌరవముచే వంచితులఁజేయలేదు. మీరే మిమ్ముల నిట్టిగౌరవముచే వంచితులఁ జేసికొనిరి. ఇందు రాణాగారి దోషమేమియు లేదు.

గజ—దూతా! నీవు అతిసాహసివిని ధృష్టుఁడవుగను ఉన్నావు. గజసింహ మహారాజు ఎదుట నిట్లెవ్వరును బలుకఁ జాలరు. ఇరువదివేల రాజపుత్రసైనికులతో భారతరాజేశ్వరుని నెదుర్కొనన నెంచినచో ఇట్టియున్నతత మీరాణాకే చెల్లును.

అరు—మహారాజుగారు చెప్పినదినిజము. ఇట్టిఉన్నతత వారికే చెల్లును. ఇట్టు లున్నతుఁడగుశక్తి మీకు లేదు. మీరు చెప్పినది నిజము.

గజ—దూతా! నీ వవధ్యుఁడవు. లేకున్న—

అరు—మంచిది. ఇంతమనుష్యత్వము మీయందున్నది. మహారాజా! దూత యవధ్యుఁడని మీ రెక్కడనేర్చుకొంటిరి? ఇంతగొప్ప నీతి, ఇంతగొప్పమాట మీ నోటినుండి యెట్లు వెలువడినది?

గజ—దూతా! మాతృమకును మేరయున్నది. పొమ్ము. రాణాతోమే మీ వివాహ మొప్పుకొనలేదని చెప్పుము. పొమ్ము —

అరు—మహారాజా! నేను వెళ్ళుచున్నాను. కాని ఒకమాటచెప్పి పోవు చున్నాను. మీరు దక్షిణదేశమున బాదుషా పక్షమున చాల యుద్ధములు చేసిరఁట. మీరు గుజరాతుకూడ జయించితిరఁట. ఈమారు మీరు మేవాడుకు కూడ వచ్చెద రనుకొనియెద. ఇందుకై నేను మిమ్ము నాహ్వానించుచున్నాను. (వెళ్ళఁబోవును)

గజ—మంచిది, అట్లేకానిమ్ము. అయితే దూతా! ఆగుము. నీవు మా వెంటనే వెళ్ళుదువుగాక!

అరు—నన్ను ఖైదుచేసెదరా?

గజ—అవును. అమరా! వీనిని బంధింపుము.

అమ—ఎందుకు నాయనగారూ? ఇతఁడు దూత. దూతపై ద్రోహము సేయుట క్షత్రియ ధర్మముకాదు.

గజ—అమరసింహా! నేను నీయొద్ద ధర్మాధర్మములు నేర్చుకొనఁ గోరుటలేదు. నీవు నాయాజ్ఞను పాలింపుము.

అమ—నాయనగారూ! నేనీ యన్యాయపుటాజ్ఞను పాలింపఁ జాలను.

గజ—(కోపముతో) నీవు నాయాజ్ఞను బాలింపఁజాలవా? పొగరుపోతా! వినుము. నీవు నాకు జ్యేష్ఠ పుత్రుఁడవు. కాని నామాటవినకున్న మునుముందు నీ కీరాజ్యము లభింపదు. సింహాసనము నాచిన్న కొడుకగు యశోవంతసింహునిదే యగును.

అమ—మీరు మీరాజ్య ముంచుకొనుఁడు. మొగలుల పదాఘాత ములచేతను వారి యనుగ్రహముచేతను మీ యీ సింహాస నము నిర్మింపబడినది. దానిపైఁ గూర్చుండుటకు నా కేమియు నిష్టములేదు. మొగలుల పాదరక్షలు నెత్తిపై నిడుకొనుటకు నా కేమియు పట్టుదలలేదు.

గజ—మంచిది. దీనికి శిక్షగా నిప్పుడే నా రాజ్యమునుండి వెడలుట కాజ్ఞాపించుచున్నాను. పొమ్ము.

అమ—ఇప్పుడే పోవుచున్నాను. (నిష్క్రమించును.)

గజ—(కొంచెమాగి) పొమ్ము దూతా! నిన్నువిడిచిపెట్టుచున్నాను.

---

## చతుర్థ దృశ్యము.

స్థానము—మహాబత్ఖాను ఇంటివెలుపల.

సమయము—రాత్రి

(మహాబత్ఖాను ఒంటరిగ కూర్చుండియుండును.)

మహా—

ఉ॥ భోగవిలాససంపదలఁ ♦ బొల్పుగఁ దేల్చెడి సుందరీమణిన్
త్యాగముచేసి వైచితిని ♦ యాసతిప్రేమ విభాసితాననం
బేగతిఁ బర్వరాదు, మరి ♦ దృష్టిపథంబున నాట్యమాడునే
వేగగనయ్యె రత్నమును ♦ వీడితినంచు సతంబు నెమ్మదిన్.

అక్కటా! నే నామెనేమి నేలత్రిప్పిపంపితిని? ఇట్టి విశుద్ధసత్య ప్రేమను నిరాకరించుట నాకు చాలఅనుచితము. నాఁడు ఆపెతండ్రిపైని క్రోధావేశమునకు గురినై ఆపెప్రేమను తిరస్కరించుట నాది గొప్పతప్పు. నాకు అవకాశము కలిగినచో రెండు చేతులు జోడించి ఆమెను క్షమాపణ గోరెదను.

పహారేదారు—(వచ్చి) ఖుదావంద్! గజసింహమహారాజు తమదర్శనమునకు వచ్చినారు.

మహా—గజసింహుఁడా? యోధపురరాజా?

పహా—చిత్తము.

మహా—పొమ్ము. వారినిటకుఁ దోడ్తెమ్ము.

[పహారేదారు వెళ్ళును.]

మహా—గజసింహునకు మనతోనేమి పని? వట్టి పిరికిపంద, అధముఁడు, మొగలుల బానిస. అదిగో! వచ్చినాఁడు.

గజ—(వచ్చి) ఆదాబ్!

మహా—నమస్కారము. నేఁడు మహారాజుగారు బీద కుటీరము నేల యలంకరించిరి? ఏమిసమాచారము?

గజ—బాదుషాగారు తమ్ముఁ బిల్వనంపిరి.

మహా—వారి యనుగ్రహము. మేవాడు యుద్ధమునకు వెళ్ళుటకుఁ గాఁబోలు.

గజ—చిత్తముజనాబ్!

మహా—ఈవిషయమై పలుమారులు బాదుషాకు విన్నవించి యుంటిని. ఏలొకో మరల మాటిమాటికి నిట్టు లాజ్ఞాపించుటలు.

గజ—మేవాడురాణాచే పలుమారు మొగల్సైన్యము ఓడింపఁబడినది. ఇందుకు బాదుషా చాలవిచారముగ నున్నారు. ఈమారు మిమ్ము నాజ్ఞాపింపక తప్పినదికాదు. ఈ అవమానమునుండి వారిని రక్షింపగల వీరులు మీరొక్కరే. మీరువారికి చాల విశ్వాసపాత్రులు.

మహా—తామేమి యట్లు సెలవిచ్చెదరు?

గజ—ఇది లోకమంతయు నెఱుఁగును.

మహా—ఊఁ. (పచారు చేయును.)

గజ—ఖాన్‌సాహబ్! ఈమాఱు మీరు మేవాడుయుద్ధమున తప్పక శస్త్రగ్రహణము సేయుఁడు. మేవాడు మీజన్మభూమియనియు రాణా అమరసింహుఁడు మీసోదరుఁడనియు నేనెఱుఁగుదును. అయితే చాలకాలమునుండి మీరు దానిబొత్తుగా విడిచివేసితిరి. మీరు మీమతమునుగూడ విడిచిపెట్టితిరి. ముసల్మానులై మీరు మేవాడుతోడిసంబంధమును త్రెంచివేసికొంటిరి. ఇంక వ్యర్థముగా సంశయించెదరేల?

మహా—మేవాడు నాజన్మభూమియే కాకున్న!

గజ—జన్మభూమి మిమ్ము బలాత్కారముగ చంక నెత్తుకొనునా? మీ రొకమారు మేవాడుకు పోయిన మంచిది. యుద్ధమునకుఁ గాకున్నమాని, చుట్టము చూపుగనైన పొండు. మేవాడువాసులు "ప్రతాపసింహుని యన్నకొడుకు మతభ్రష్టుఁడై మ్లేచ్ఛులలోఁ

గలశా"నని మిమ్ము నాక్షేపించెదరు. వృద్ధులు మిమ్ముఁ జూచి అసహ్యముతో మొగము త్రిప్పెదరు. యువకులు మిమ్ము క్రోధారుణ దృష్టులతోఁ జూచెదరు. వనితలు గవాక్షముల నుండి తిట్టుదురు. ఖాన్‌సాహబ్! రాజపుత్రులు మిమ్ము సోదరునిగ భావించి కౌఁగలించుకొందురని మీరెన్నఁడు ననుకొనవద్దు.

మహా—హుఁ! (మహాబత్‌ఖాను ఆలోచించుచును.)

గజ—జీవితాంతము వఱకు మీరు మొగలులతోడి సంబంధమే యుంచుకొనవలసి యుందురు. వారి యున్నతితోపాటు మీ యున్నతి, వారియవనతితోపాటు మీ యవనతి. ఖాన్‌సాహబ్ మీరు నామాటలు బాగుగ యోజించుకొనుఁడు.

[సన్యాసి వేషమున సగరసింహుని ప్రవేశము]

సగ—మహాబత్!

మహా—ఎవరు? నాయనగారూ! మీరిచట నీవేషములో నుంటిరేమి?

సగ—నేనిపుడు సన్యాసము పుచ్చుకొంటిని.

మహా—అదియేమి నాయనగారూ?

సగ—మహాబత్‌ఖాన్! నీకు వింతగనున్నదికాఁబోలు. నిజముగ నిదివింత సంగతియే. ఎవఁడు దేశమునకు, జాతికి, మతమునకు తిలోదకములిచ్చి జీవితము నష్టముచేసికొనెనో, ఎవఁడు అధికసమయము విజాతీయుల కృపాభిక్షను యాచించుటయందే గడపెనో వాఁడే యిపుడు తనజీవిత సంధ్యాకాలమున మరల తనమార్గమును మార్చుకొనెను. అయితే నేనీరూపమేల గ్రహించితినో నీవెఱుఁగుదువా?

మహా—లేదు.

సగ—ఇన్నినాళ్ళకు నేను ప్రేమమయియగు మాతృభూమియొక్క పిలుపువింటిని. ఆతల్లియాహ్వాన మెంతగంభీర మెంతకరుణమము

ఎంతగద్దదమునై యున్నది!—సుహోబత్! నీవుదాని యూహా కూడ చేయఁజాలవు. ఇపుడు నేను నాపాపములకు ప్రాయశ్చిత్తము చేసికొనుచున్నాను. నీతో నీవిషయము చెప్పుటకే వచ్చితిని. నీవును నీపాపములకు ప్రాయశ్చిత్తము చేసికొనుము.

మహా—నాపాపములకా?

సగ—అవును నీపాపములకే. నేను స్వజనమును విడనాడి మొగలులకు దాసుఁడనైతిని. నీవు నన్నుమించితివి. నీవు మతమును గూడ విడిచితివి. కాన నీపాపములకు మేరలేదు.

మహా—నాయనగారూ! నాకెట్టి పాపమునున్నట్లు గనుపట్టుటలేదు. ఇంక ఇస్లాముమతము సత్యమని నాకు విశ్వాసమున్నచో—

సగ—కుమారా! నీ కీవిశ్వాస మెట్లుకలిగినది? నీవు కురాను చదివిన మాట వాస్తవము. నిజముగ నది మంచిగ్రంథమే. హిందూ మతము దానిని నిందించుటలేదు. దానితో దీనికెట్టి వివాదమును లేదు. అయితే నీవు నీతాతముత్తాతల యొక్క వ్యాస కపిల శంకరాచార్యుల యొక్క మతము విడుచుటకుముందు వారిగ్రంథములను చదివితివా? నీవంటి మూర్ఖునకు, నిరక్షరకుక్షికి, ధర్మాధర్మ విచార మెట్లుకలుగును? ప్రవృత్తి దమనమును (ఇంద్రియ నిగ్రహము) ఆత్మజయమును ఏమతమునకు మూలమంత్రములో, సర్వభూతములపై దయవహించుటయే ఏమతము యొక్క అంత్యపరిణామమో ఆదయయు నొకమనుష్యజాతి యందే పరిమితముగాక చీమను జంపుటకూడ ఏమతము నిషేధించుచున్నదో అట్టిమతమును అవిచారితముగ విడిచి నీవెంత పాపముచేసితివో యెఱుఁగవు.

మహా—నాయనగారూ! నాకిది చాల విస్మయము గొలుపుచున్నది. నేఁడు మీరు—

సగ—అవును. నేఁడు నేను ధర్మోపదేశము సేయుచున్నాను. నేనిటుల నెట్లు మారితినాయని నాకే చాల విస్మయముగ నున్నది. ఎవఁడు ప్రపంచములో ధనముకంటె నితర మెఱుఁగఁడో వాఁడు ధర్మమునకై సన్న్యసియయ్యెను! ఎంతవింత! కాని ఉచ్చప్రవృత్తిని ఉచ్చస్వరముతో మ్రోగించు నొక తంత్రియేని లేని హృదయ మేదియు నుండదు. ఒకనాఁడు దైవవశమున ఆతంత్రి పరిస్థితి యను అంగుళ్యాఘాతముచే మ్రోగినపుడు ఒకక్షణములో హృదయమంతయు పరివర్తనము చెందును. ఆత్మ ఆసమయమున క్షుద్రస్వార్థకంచుక నిర్ముక్తమై అనంతాకాశమువైపునకు నడుచును. ఈవిషయము కల్యాణి నాఁడు నాకు చెప్పినది.

మహా—కల్యాణియా?

సగ—అవును. నాఁడు అదియే నా కీవిషయము చెప్పినది. ఇప్పటికిని దానిమాట సంగీతస్మృతివలె నా చెవులయందు మ్రోగుచున్నది. మహాబత్ఖాన్! కల్యాణిని దానితండ్రి ఇంటినుండి వెళ్ళగొట్టిన సంగతి నీవెఱుఁగుదువా?

మహా—ఇంటినుండి వెళ్ళఁగొట్టెనా? ఎందుకు? ఏ అపరాధముచేత?

సగ—కల్యాణి ఇప్పటికిని మతాంతరుఁడవగు నిన్ను పూజించుచున్నదని.

మహా—మీ రుభయులు నెక్కడకలసికొంటిరి?

సగ—ఒకగ్రామమువద్ద భగ్నకుటీరమందు.

మహా—నాయనగారూ! ఇదియేనా మీ ఉదారమగు అత్యుదారమగు హిందూధర్మము? హిందువులు ముసల్మానులయెడ నింత ద్వేషభావము వహించుచున్నారు. కల్యాణియొక్క పతిభక్తికి ప్రతిఫలము ఆమెకు గృహబహిష్కారశిక్ష! నాయనగారూ! నన్ను ప్రాయశ్చిత్తము చేసికొనుమనుచున్నారా? తప్పక చేసికొందును. అయితే నేను ముసల్మానునైతినని కాదు. ఒకప్పుడు నేను హిందువుగ నుండిన పాపమునకు ప్రాయశ్చిత్తము చేసికొందును.

నగ—మహాబత్‌ఖాన్!

మహా—నాయనగారు! ఇంతవరకు నాహృదయమున మిగిలియున్న సహానుభూతినికూడ నేను పారదోలుచున్నాను. నేడు నేను పూర్తిగా ముసల్మానునైతిని.

నగ—మహాబత్‌ఖాన్—

మహా—నాయనగారు! మీరు రెచ్చిగియే యున్నారు. నేను చాలమితిముగా మాట్లాడుచుండును. ఒకసారి ఏదేని ప్రతిజ్ఞ చేసిన నింక దానినివిడువను.

నగ—మహాబత్‌ఖాన్—

మహా—నాయనగారు! మీరు నాస్వభావ మెఱుంగుదురు. మీ ఉపదేశములు, మీయాదేశములు, మీయుక్తులు అన్నియు వ్యర్థములు. (అచ్చటనుండి వెళ్ళబోవును.)

నగ—మహాబత్‌ఖాన్! నీవింత యధోగతిపాలైనచో పొమ్ము. చావుము. ఈఅంధకూపములో దుమ్ముకొని చావుము. మ్లేచ్ఛా! ధర్మభ్రష్టా! కులాంగారా!

[నగరసింహుఁడు వెళ్ళిపోవును. తర్వాత మహాబత్‌ఖాను ఉద్రేకముతో ఇటు నటు పచారుచేయును.]

మహా—(కొంచెము సేపాగి) ఇంతవిద్వేషమా! ఇంతయాక్రోశమా! ఇట్టిజాతి మాటిమాటికి మ్లేచ్ఛుల కాలితాపులఁ దిన్నదన్నచో నాశ్చర్యమేమి? ముసల్మానులు దీనికి బదులుగ వడ్డీతో నహా ఎక్కువ ద్వేషించుచుండురన వింతయేమి? ఇదియేనా వీరి యుదారము—అత్యుదారమునగు సనాతన హిందూధర్మము! ముసల్మాను ధర్మమందు ఏలోపము లేని యుండుఁగాక! ఈ మాత్రి మౌదార్యమా తప్పక యున్నది. అది అన్యమతస్థులను ఆనందముతో తనలో కలుపుకొనును. ఇంక హిందూధర్మమా? ఒక

మతాంతరుఁడు నూరేండ్లు తపస్సుచేసినను తనలో కలుపు కొనఁజాలదు. ఇంతగర్వమా! ఇంతిఅహంకారమా! ఇంత స్వర్థయా! నే నీయహంకారమును చూర్ణముచేసిన నెంతబా గుండును! (గజసింహునితో) మహారాజా! నేను మేవాడుపైకి దాడివెడలుదును. పొండు. బాదుషాగారితో నా యీవిన్నపము మనవిసేయుఁడు.

[గజసింహుఁడు చకితుఁడై చూచును]

మహా—మహారాజా! మీ రాశ్చర్యపడెద రేల! నేను మేవాడుపై కెం దుకు దండివెడలుచున్నానో మీ రెఱుఁగుదురా?

గజ—మీరు బాదుషాకు ఆజ్ఞాపాలకులును, విశ్వాసపాత్రులు నగుటచే.

మహా—కాదు. ఇందుకుఁగాదు. నేను హిందూధర్మమును సమూల ముగ పెరికివేయుటకును మీజాతినంతను విధ్వంసము చేయు టకును పోవుచుంటిని. నేనుదాని నామరూపము లుండనీయను. తెలిసినదా? మీ రిపుడు బాదుషాగారితో వెళ్ళి విన్నవించుఁడు. [గజసింహుఁడు సలాముచేసి ఒకవైపుగను మహాబత్ఖాను మఱి యొకవైపుగను పోవుదురు.]

---

పంచమదృశ్యము.

స్థానము—జహాంగీరు దర్బారు.

సమయము—ప్రభాతము.

(జహాంగీరు, సభాసదులు, హిదాయుత్ అలీఖాను.)

జహాం—ఈఅవమానము ఎన్నటికిని మఱువఁబడదు. తుదకు పర్వేజున కేమి వచ్చినది.? వాని కీమాత్రమును శక్తిలేదా? వాఁడెందుకు ఓడినాఁడు?

హిందా—జహాంపనాహ్! నేను ప్రమాణపూర్తిగ చెప్పఁగలను. శాహ జాదాకు ఓడవలయునను కోరిక ఇంచుకయులేదు.

జహాం—మీరు పట్టి దండుగ చేటు. ఎందుకును కొఱగారు.

హిందా—నిశ్చయము. దేవరవారు సెలవిచ్చినది యథార్థము.

జహాం—హిందాయత్! నీవుయుద్ధములో కైదుకూడ అయితివి. తుదకు రాణా దయతలఁచి నిన్నువదలి పెట్టెను. అబ్దుల్లా యుద్ధము చేసి చనిపోయినాఁడు. ఇంక చచ్చుట కూడ నీవలన కాలేదు.

హిందా—నిశ్చయము జహాంపనాహ్! నేను యుద్ధములో చావవలయునని యే యనుకొంటిని. కాని తమతో నేమి మనవిసేయుదును. నాపెండ్లాము ఇష్టపడలేదు.

జహాం—చాలు, మెదలకుము.

[సగరసింహుఁడు ప్రవేశించును]

జహాం—అదిగో! సగరసింహుఁడు. ఏమి రాజుగారు!

సగ—జహాంపనాహ్!

జహాం—మిమ్ము మేవాడురాణాగా చేసి చిత్తూరు పంపితిమి. అయితే మీరు చిత్తూరుకోట రాణా అమరసింహునకప్పగించితిరని వింటిని.

సగ—చిత్తము.

జహాం—ఎవరి హుకుముచే!

సగ—దాని కెవ్వరి హుకుమును ఆవశ్యకమని యెంచలేను.

జహాం—ఎందుకు?

సగ—న్యాయదృష్టిచే రాణాఅమరసింహుఁడే దానికి ప్రభువని యెంచితిని.

జహాం—మీరెంచితిరా?

సగ—నిశ్చయముగ. అక్బరుబాదుషా న్యాయముగ పోరాడి చిత్తూరు కోట వశపఱచుకొనలేదఁట. అతఁడు మోసము చేసి జయమల్లుని చంపెనఁట.

జహాం—రాజా! మీ రీన్యాయాన్యాయవిచారణ కెప్పటినుండి తొడఁగిరి?

సగ—ఏనాఁడు నేనొక నూతన ప్రకాశమును గనుగొంటినో నాటి నుండియు.

జహాం—నూతనప్రకాశము కనుగొంటిరా?

సగ—చిత్తము. నేనొక నూత్నప్రకాశము చూచితిని. నాకనుల యెదుటనుండి యొక మాయాపటలము విచ్చిపోయినది. రామచంద్రభగవానుఁడు మొదలుకొని నేఁటివఱకుఁగల మేవాడు అతీతకాలమంతయు నాకనుల యెదుట పొడగట్టినది. బాప్పారావు విజయగాథలు, చూడాజీ సమరసింహులు దేశమునకై ప్రాణత్యాగము సేయుట, కుంభుని శౌర్యము మున్నగుగొప్ప వింతలను గాంచితిని. వెంటనే పొగమంచు క్రమ్మినట్లయ్యెను. అందులోనే ప్రతాపసింహుని—నాసోదరుఁడు ప్రతాపసింహుని కరవాలము మెరయుచుఁ గనుపట్టినది. నన్ను నేను ధిక్కరించుకొంటిని.

జహాం—తర్వాత నేమయ్యెను?

సగ—అప్పుడు నాహృదయమున నీయూహ పొడఁగట్టినది. నేనును వారి వంశమువాఁడనే అయినను శత్రుపక్షమునఁ జేరి నేనెంత యనుచితము చేసితిని? అని. అప్పటికిని నానైచ్యమును సమర్థించుకొనుటకై చాల ప్రయత్నించి చూచితిని. తర్వాత నొక నాఁడు మఱియొక యద్భుతదృశ్యమును జూచితిని. (గర్వముచే కనుల వెంట నీరువచ్చును.)

జహాం—ఆఁ ఆఁ. చెప్పుఁడు. ఏమి చూచితిరి?

సగ—అది పూర్వకాలపు విషయముకాదు. ఐతిహాసిక వృత్తాంతము కాదు. పురాణ గాథ కాదు. నాకొలూరిత—ఈ మొగలబానిస కొలూరిత—స్వదేశ భక్తి జీర్ణవస్త్రములు దాల్చి అరణ్యము లందు గుర్ర్మురుట చూచితిని. ఇక నేనో ఆదేశపు స్వాతంత్ర్యము హరించుటకు మొగలులతోఁ గలిసితిని. అప్పుడు నా కనులవెంట నీరు ప్రవహించెను. కంఠము సగద్గదమయ్యెను. ఒక్కమారుగ లజ్జ, గర్వము, ప్రేమ, భక్తి నాహృదయమునఁ బాదుకొనెను. నేనుండలేకపోతిని. వెంటనే చిత్తోరుకోట నాసోదరపుత్రునకిచ్చివచ్చితిని.

జహాం—రాజా! మీరు చచ్చుటకు సిద్ధమయే వచ్చితిరా?

సగ—పూర్తిగా నేను చచ్చుటకు సిద్ధమయేవచ్చితిని. పూర్వము నాకు చావనిన భయముగ నుండెడిది. కాని నాటినుండి నేనొక క్రొత్తపాఠము నేర్చుకొంటిని.

జహాం—ఏమి పాఠమది?

సగ—త్యాగపాఠము. లోకములో రెండురాజ్యములున్నవి. ఒకదాని పేరు స్వార్థము. రెండవదానిపేరు త్యాగము. ఒకదానికి జన్మస్థానము నరకము. రెండవదానికి స్వర్గము. ఒకదానికి రాజు సైతాను. రెండవదానికి ఈశ్వరుఁడు. నే నింతవఱకు స్వార్థ రాజ్యమున వసించితిని. ఆనాఁడు త్యాగరాజ్యమును జూచితిని. ఆదేశమునకు రాజులు బుద్ధుఁడు, యేసుక్రీస్తు, చైతన్యుఁడు. అచ్చటి రాజ్యనీతి ప్రేమ, దయ, భక్తి. అచ్చటి శాసనము సేవ. శిక్ష దయ. బహుమానము ఆత్మత్యాగము. నేనునాటనుండియు ఆరాజ్యపు ప్రజనైతిని. ఏహస్తమున ఇదివఱకెన్నఁడును కత్తి పట్టలేదో ఆహస్తముననే నాఁడు ఆర్తరక్షణార్థము ఖడ్గము ధరించితిని. నాఁడు దొంగలకత్తిపోటు నాకు పూలచెండువలె నుండెను.

జహాం—తర్వాత నేమయ్యెను?

సగ—తర్వాత మృత్యువుచే నాపూర్వపాపములకు ప్రాయశ్చిత్తము చేసికొనుటకై యిచ్చటకు వచ్చితిని. పూర్వము మరణమన్న నాకు చాల భయముగ నుండెడిది. ఇప్పుడు భయములేదు. ఎవఁడు ప్రేమపూరిత హృదయుఁడో, ఎవఁడు త్యాగమంత్ర దీక్షితుఁడో వానికి మరణమునిన భయమెందుకు!

జహాం—మంచిది. మీరు చచ్చుటకు సిద్ధముగుఁడు. ప్రిహారీ!

[ప్రిహారి (పహారేదారు)వచ్చును.]

సగ—జహాంపనాహ్! ప్రిహారియెందుకు? వధకుఁడు చేయుపని నేనే చేసికొందును. (ఱొమ్మునపై కత్తితో పొడుచుకొని నేలపైఁబడును) ఈరక్తమే నాపాపమునకు ప్రాయశ్చిత్తముగుఁగాక!

# మేవాడు పతనము.

## చతుర్థాంకము

### ప్రథమదృశ్యము.

స్థానము:—ఉదయసాగరతీరము.

సమయము:—వెన్నెలరాత్రి.

[రాణా అమరసింహుఁడొక వేదికపైఁ గూర్చుండును. ఉదయసాగరపు తరంగములధ్వని వినిపించుచుండును. దగ్గరనొకచెట్టుపై కోయిల కూయుచుండును. రాణా కనులుమూసికొని యాకూత వినుచుండును. ఇంచుక దూరమున స్త్రీలు హాయాలిపాట పాడుచుందురు.]

గీతము.

పిల్లఁగ్రోవి నూదెహరి
ఇల్లువాకిళుల నొళ్ళుమఱచి యా
వల్లవాంగనలు వనికి వెంటఁజన॥
౧ మందమారుతము వీచె, ఆనందమున
మత్తవిహగములు గూసె
సుందరకుట్మలములు వికసించెను
సుమకుంజమ్ములు శోభ వహించెను॥
౨ ఇందుకిరణ పరంపరలు, కాళిందీజలమున
నింపుమీఱగ విశ్రమించె

క్రిందుగ వేణువు "రాధరాధ" యని
యందపుఁబలుకుల నమృతము గురిసెను॥

రాణా—వీరందఱు హోలియాటలందును పాటలందును నిమగ్నులై యున్నారు. ఈసమయమున వీరిపాదములక్రింద భూకంపము గలిగినను వీరికి తెలియదు. ప్రపంచమంతటిది! మానవునకిట్టి యాటవస్తువులనిచ్చి పొరపెట్టినది. లేనిచో ఈశూన్యధాత్రిపై నుండుట కెవ్వఁడేని యిచ్ఛగించునా? ప్రపంచము చాల మోస పుది. ఇదిగో! మానసివచ్చినది.

[మానసి వచ్చును]

మాన—నాయనగారూ! ఇంతదనుక మీరిచ్చటనే యుంటిరాఁ? లోనికి రండు. ఇచ్చట చలివేయుచున్నది.

రాణా—కొంచెమాగుము. వెళ్ళెదము. ఈ ఉదయసాగరతీరమునఁ గూర్చున్న మనస్సు శాంతిముగ నుండును. మానసీ!

మాన—ఏమి నాయనగారూ!

రాణా—ప్రపంచము చాల మోసపుదని నీకెప్పుడేని తోఁచెనా?

మాన—మోసపుదా!

రాణ—అవును మోసపుది. మానవుఁడు చింతనాశక్తిచే అమరుఁడు కాకుండుఁగాక యని ప్రపంచము వాని మనస్సును వివిధ చింతలందు ముంచివేయుచున్నది.

మాన—కాదు తండ్రీ! ప్రపంచమంత చెడ్డదని నే ననుకొనను.

రాణా—ఈ వెన్నెలరాత్రిని చూడుము. ఈతరంగనినాదము వినుము. ఈస్నిగ్ధసమీరము ననుభవింపుము. ఈయీ విషయములనుండి వేఱుపఱచుటకై ప్రపంచము మానవుని క్షుద్రజీవిత సుఖ దుఃఖముల వైపునకు బలాత్కారముగఁ గొనిపోవుచున్నది.

అమ్మాయీ! నేనిపుడీ ప్రపంచమును విడిచి వేసెదను. ఇది పట్టిమాయ.

మాన—ఇది మాయయేయనినను చాల మనోహరమగు మాయ. నాయనగారూ! నిజముగా నీ బాహ్యప్రకృతి చాలఅందమైనది. ఇది మనపై చాలదయవహించుచున్నది. మనము భీషణగ్రీష్మతాపసంతప్తులమగునపుడు స్నిగ్ధగంభీరమగు గర్జన సేయుచు వర్షఋతువేతెంచి వర్షముచే మనలను జల్లపఱచును. కఠినశీతముచే మనము గజగజవణకునపుడు వసంతఋతువేతెంచి తన మందసుగంధిత సమీరముచే నాశైత్యావగుంఠమును వెడలించును. దుర్భరదినాతపముచే మనము పీడితులమగునపుడు నిశాదేవి తల్లివలె మెల్లగ నేతెంచి చల్లని తన తొడపై మనవ్యథితమస్తకమును జేర్చుకొనుచున్నది. ఇంతటితో దాని దయ మఁగియలేదు.

రాణా—దాని కంతమెక్కడ?

మాన—మానవుని చింతాజగత్తున. నాయనగారూ! మీరీ సరోవరము చూచుచుంటిరా?

రాణా—అవును కుమారీ! చూచుచున్నాను.

మాన—దీనిపైఁ బ్రసరించు చంద్రకిరణములు కనిపించుచున్నవా?

రాణా—అవును కనుపించుచున్నవి.

మాన—మీరు దీనినిఁ బట్టుకొనఁగలరా?

రాణా—దేనిని?

మాన—ఈవెన్నెలను. ఈతరంగనినాదమును. అంధకారమున ఈజలతలము దాఁగునపుడు ఈసమీరము ఆగిపోవునపుడు ఈసౌందర్యము ఈ సంగీతము ఎచ్చటకుఁ బోవును.

రాణా—కుమారీ! ఎక్కడకుపోవునో నీవేచెప్పుము.

మాన—ఎక్కడకుపోవునో సరిగా చెప్పఁజాలను. కాని ఇది అంతరించ దనుమాట వాస్తవము. అది విరహిస్మృతియందును, కవి స్వప్నమందును, మాతృప్రేమయందును, భక్తుని భక్తియందును మానవుని కరుణయందును వ్యాపించియుండును. మానవుని యందలి సౌందర్యాంశమును, పృథ్వియందలి ఈకిరణములను, ఈ సుగంధమును, ఈ ఝంకారమును, ఈనృత్యమును అన్నిటిని ప్రకృతియే నిర్మించినది. లేనిచో నీసౌందర్యమునకు సార్థక్యమెక్కడిది?

రాణా—అమ్మాయీ! మానవునియందు సౌందర్యమునిచెప్పఁదగిన యంశ మేదేనియున్నదా? మన మొకకళమును నోటఁబెట్టుకొని నంత లోకమంతియు లోభదృష్టితో దానినే కాంచును. తన కాకళము లేకుండఁజేసితిమని యెంచును. ఔరా! ఇంతలోభమా! ఇంత ఈర్ష్యయా! ఇంత ద్వేషమా!

మాన—ఇది మానవుల మానసిక వ్యాధి, ఈ వ్యాధియే లేకున్నచో మానవునిదయకు స్థానమే యుండదు. అప్పుడింక ఎవనిదుఃఖమును నివారించి, ఎవనిని ఉద్ధరించి మానవుఁడు సుఖించును? నాయనగారూ! ప్రపంచ మధమమని చెప్పి దానిని విడువవచ్చునా? కూడదు. మానవుఁడెంతయు దుఃఖితుఁడు. వాని దుఃఖమును తీర్చవలయును. ప్రపంచమెంతయు దీనమైనది. దాని నుద్ధరించవలెను.

రాణా—నీవుచెప్పినది చాల బాగుగ నున్నది. నాతల యిప్పుడుతిరుగుచున్నది. నేనేమియు విచారింపఁజాలను.

(నేపథ్యమున) మానసీ! మానసీ!

మాన—అమ్మా! వచ్చుచున్నాను. నాయనగారూ! మీరును రండు. చీఁకటిగానున్నది. (వెళ్ళును.)

రాణా—ఇదియొక స్వర్గీయకథ. ఒక నీహారిక. విశ్వసౌందర్యసారము. చల్లని గాలి వీచుచున్నది. ఆకసమున ఒక్క మేఘమును లేదు. ప్రపంచము కేవలము శాంతముగ నున్నది. ఉదయసాగరము నుండిమాత్రము సంగీత తరంగములు వచ్చుచున్నవి. ఎన్నియో బాలసౌవర్ణప్రభ లరుదెంచి యీ తరంగములందు స్నానము చేయుచున్నటులున్నవి. వాని మధురహాసములే యీతరంగములు. మ్రాకులయాకులు వెన్నెలలో ఆడుచున్నవి. గాలితో క్రీడించుచున్నవి ఈమర్మరధ్వని వాని కేళీరవంబే. జడపదార్థములును సౌందర్యము ననుభవించుచున్నటులున్నవి.

[రాణి ప్రవేశించును]

రాణి—మహారాజా!

రాణా—కొంచెమూరకుండుము. నేనొక స్వప్నము గాంచుచుంటిని.

రాణి—మేలుకొనియేరా? ఇంక నేను చెప్పునదిలేదు.

రాణా—పోనిమ్ము. మోహభంగమైనది. ఇంక చెప్పుము ఏమైనది?

రాణి—ఇంక చెప్పెడి దేమున్నది? ఈకాలపు పిల్లలు తల్లిదండ్రుల మాటలు వినవే వినరు. ఆనాడు గోవిందసింహుని కొడుకును, కూతురును తండ్రి కొంచెమేదో అన్నాడని ఇల్లువిడిచి వెళ్ళిపోయిరి. నిన్న—

రాణా—మరల ఆప్రపంచపు గోలయే. పాడినదే పాట పాచిపళ్ళదాసరీ మరల సంసారచక్రపుకర్కశస్వరమే.

రాణి—ఈకలికాలపు పిల్లల కేమివచ్చినదో తెలియదు. మాకును బాల్యావస్థ యుండెడిది.

రాణా—అప్పుడు సత్యయుగమై యుండవచ్చును. తల్లులు సత్యయుగమందును, కూతుళ్ళు కలియుగమందును బుట్టుటయే మనము చాలకాలమునుండి చూచుచున్నాము. మంచిది. ఇవియన్నియు నట్లుంచుము. నేనిపుడు చేయవలసిన దేదియో చెప్పుము.

రాణి—మానసికి పెండ్లి చేయఁదలఁచుకొనినచో నిప్పుడే చేయుఁడు. లేకున్న ఇఁకముందు దానికి పెండ్లికాదు.

రాణా—నాకును అట్లే తోఁచుచున్నది. మానసి పెండ్లిచేసికొనుటకు గాను పుట్టలేదనియే నాతలంపు.

రాణి—చాలు. చాలు. తెలిసినది. మీలక్షణములుకూడ ఏమియు బాగుగనుండలేదు. మీరుమేలుకొనియే కలగనుచున్నారు.

రాణా—నేను కలయైనను గనుచున్నాను. నీవటియును లేదు.

రాణి—ఇప్పుడేమియగును?

రాణా—ఎవ్వరికి తెలియును? ఏమగునో చూడుము.

రాణి—ఏమిచూచెదను? జోధపురము వెళ్ళినవాఁడు ఇంకనురాలేదు. సత్యవతి కొడుకును జోధపుర మంపితిరి. వాఁడెక్కడ తిరిగి వచ్చును!

రాణా—అరుణసింహుఁ డచ్చటనుండి వచ్చినాఁడు.

రాణి—వచ్చినాఁడా? వివాహ మెప్పటికి స్థిరమైనది?

రాణా—మహారాజు మనకొమార్తెను తనకొడుకునకు జేసికొనఁడు.

రాణి—ఎందుకు?

రాణా—ఆయనకు మనపైఁగోపమఁట.

రాణి—ఎందుకు?

రాణా—యుద్ధములో మనము గెలిచితిమి. మొగలులోడిరి. ఇదియే కారణము.

రాణి—మానసికి పెండ్లికాదని నేను మొదటనే చెప్పితిని. ఇంక పెండ్లి అయినట్లే. ఇట్టిచిక్కులలో నెచ్చటనైన పెండ్లియగునా?

రాణా—నేను నిదియే యనుకొంటిని. మానసి పెండ్లికై జన్మించలేదు. ఇదియెంతయు భద్రము.

రాణి—భ్రమయెట్లు?

రాణా—జోధపుర రాజపుత్రునకు మానసిసీయువ లెననుకొనుట భ్రమ. ఇంతసైన్యమునుదీసికొని మొగలులపైకి దాడివెడలుట భ్రమ. నీకును నాకును పెండ్లియగుటయు భ్రమయే. మనరాజ్యము. మనజీవితము అంతయు భ్రమయే.

రాణి—మీరు నన్ను వివాహమాడక యుండినచో అదియు నొక భ్రమగనే యయ్యెడిదని తలఁచెద. నవ్వెదరేల?

రాణా—మహారాజు ఆగ్రహ వెళ్ళిరఁట.

రాణి—ఎందుకు?

రాణా—బాదుషాకు కొండెములు సెప్పి మేవాడుపైకి దండెత్తింపఁ జేయును.

రాణి—మరలనా?—మీరునవ్వుచున్నారు. ఇదియు నవ్వఁదగినమాట యేనా?

రాణా—ఇంతకంటె నవ్వఁదగిన విషయమేమున్నది? రాణీ! నీవుకూడ నవ్వుము.

రాణి—మీంతోఁబాటు నేను కూడ పిచ్చిదాననగుదునా?

రాణా—చాల మంచిసంగతి రాణి! ఈమారు సర్వస్వము నష్టమగును.

రాణి—ఏమైన నగుఁగాక. నేనిది యేమియు వినను. ఈవివాహము తప్పక జరుగవలయును.

రాణా—ఎట్లు?

రాణి—మీరు మార్వాడపైకి దాడివెడలుఁడు.

రాణా—రాణీ! ఇన్నినాళ్ళకు నీవు క్షత్రియవగుటకు ప్రమాణము దొరికినది. శక్తికన్న భక్తి యెక్కువదని నీవెఱుఁగుదువు. జోధపుర మహారాజునందుఁగల మొగలభక్తి మనయందులేదు. మనయందు శక్తిమాత్రముండెడిది. అదియును అయిపోయినది.

రాణి—అయితే ఈ అవమానము మెదలక సహించెదరా?

రాణా—లేక చేయునదేమి? మెదలక సహింపలేకున్న ఏర్పడును. మొత్తురోగుము. మాటఅయినదా లేదా? భయపడవలసిన విషయము లేదు. ఈమాఱు సర్వస్వము నష్టమగును. ఇంత క్షుద్రవిత్త్వముగలజాతిని ఈశ్వరుఁడే రక్షింపలేడు. ఇంక మనుష్యుఁడేమి చేయును. పొమ్ము.

రాణి—అయితే ఇందు మీ అపరాధమేమి యున్నది!

రాణా—అపరాధమా? నేనును మహారాజును ఒకజాతియందు పుట్టుటయే నాయపరాధము. పడవలో కూర్చున్నవారిలో నొకని దోషముచే పడవమునిగినచో నిర్దోషులు నిరపరాధులు నగు తోడివారును దానితో మునిగెదరు. పొమ్ము.

[రాణి నిష్క్రమించును.]

రాణా—ఆకాశమెంత నల్లగానున్నది?

[రాణా వెళ్ళును. మానసి ప్రవేశించును.]

మానసి—అజయసింహుఁడు దేశాంతరము వెళ్ళినాఁడు. వెళ్ళుటకు ముందు నాతో ఒకమాటు కలిసియైన పోలేదు. తుదకు ఒకచీటిముక్కయైనను "నేను దేశాంతరము పోవుచున్నాను. ఇదియే తుదిహేర్కు" అని వ్రాసియైన పంపలేదు. అజయా! అజయా! నీవు చాల నిష్ఠురుఁడవు. నేను నీకై శోకింపను. చంద్రునిజ్యోతి ఇంతక్షీణించినదేమి? ఉదయసాగరము హఠాత్తుగ నింత మలినమేలయ్యెను? ప్రకృతి ముఖమందలి యీ హాసమెచ్చటకు పోయెను?

గీతము.

ఔర! చంద్రవదనము నాకతిమోదము గూర్చున్
ధారుణి వెలయింపఁజేయుఁ దనమధురాకారమునన్

విమలచారు చంద్రికలను వెలయింపఁగఁ జేయుచు
అమిత తమఃప్రళయముఁ జేయు నగపడకయె యున్నన్
చందురుఁడేగినను కుసుమసౌరభం బేగ లేదు
ఎందుకో కోయిలల కూఁత లేగలే వెలుఁగరాదు
ముదముఁగూర్పదగిన వస్తువులు చాలగనున్నన్
అదిలేకుండిన లోకంబంత శూన్యముగఁ దోఁచుఁగా ||

---

ద్వితీయదృశ్యము

స్థానము—మేవాడు ఒద్ద మహాబత్ఖానుని డేరా.

సమయము—ప్రభాతము.

(మహాబత్ఖాను, శాముసాకోడుకగు పర్వేజు, గజసింహుఁడును నిలిచి మాటాడు చుందురు.)

మహా—శాహాజాదా సాహెబ్! ఇంక మీరు ఆలస్యము చేయకుడు. ఈలక్షసైన్యమును దీసికొని చిత్తోరు కోట ముట్టడింపుఁడు.

పర్వే—చాలమంచిది. (వెళ్ళును.)

మహా—మహారాజా! మీరు మేవాడుగ్రామముల నొకవైపునుండి తగులఁబెట్టుఁడు. ఎవ్వరేని మిమ్మెదిరించుచో నఱికివేయుఁడు. మీ రీపనిలో చాల సమర్థులును జాగరూకులునని నేనెఱుఁగుదును. కాని స్త్రీలయెడల మాత్రము నెట్టిద్రోహమును జరుగనీయకుడు.

గజ—మంచిది. మేవాడులో నొక్క రాజపుత్రునికూడ మిగిలించను.

మహా—అవును మహారాజా! ఈవిషయము నేను నెఱుగుదును. రాజపుత్రులపై సాక్షాత్తు తమసోదరుల కున్నంత ద్వేషము మహమ్మదీయులకుఁగూడ లేదు. నేనుపూర్వచరిత్రములు బాగుగ చదివి తెలిసికొంటిని. హిందువులకు తమసోదరులమొడల ద్రో

హానము చేయుటకును వారిని హింసపెట్టుటకును ఉన్నంతయు త్రాహాను మఱియేపనియుందును లేదు. రాజపుత్రులరూపు మీరు మాపుసకుల మరియెవ్వరును మాపఁజాలరని నేను బాగుగ నెఱుఁగుదును. కనుకనే మీ కీపని అప్పగించితిని. ఇంక మీరు వెళ్ళి వీరావని ప్రారంభింపుఁడు.

గజ—చాలమంచిది. (వెళ్ళును)

మహా—హిందువులారా! రాజపుత్రులారా! మేవాడురాజ్యమా! జాగ్రత్త! ఇదిమొకజాతి వేఱొకజాతిని కొనుటగాదు. ఇది ఒకమతము వేఱొకమతమును కొనుట. ఏదిగెలుచునో చూతము. (వెళ్ళును.)

---

## తృతీయదృశ్యము

స్థానము—ఉదయపుర రాజప్రాసాదము.

సమయము—రాత్రి.

[రాణా అమరసింహుఁడు. సత్యవతి.]

రాణా—ఈమాఱు మహోబత్ఖాను యుద్ధమునకు వచ్చెనా?

సత్య—అవును మహారాజా! అతనివెంట లక్షకెక్కువగ సైన్యమున్నది.

రాణా—(దీర్ఘనిశ్వాసము విడిచి) సత్యవతీ! నేను మొదటనే చెప్పితినిగదా!

సత్య—ఏమి?

రాణా—ఈమాఱు సర్వస్వము నష్టమగునని రాజపుత్రా అంతయు పోయినది. ఇంక నొక మేవాడు తలయెత్తుకొని యుండగలదా? విధాతయిది యోర్చునా? ఈమాఱు మేవాడును పోవును. సత్యవతీ! నీవు తలయేల వంచుకొంటివి? ఇదిచాల ఆనందింపఁదగిన విషయము.

సత్య—మహారాజా! ఇది ఆనందింపఁదగిన విషయమా?

రాణా—ఎందుకు కాదు? మంచాన పడి మేవాడు ఇంక నెంత కాలము మృత్యువేదన సహించును? ఈమాఱు దాని వేదన శాంతమగును.

సత్య—అయితే మహారాణాపుడు యుద్ధము చేయరా?

రాణా—ఎందుకు చేయరు? యుద్ధము చేయక ఇంక చేయున దేమి? ఈమాఱు నిజమైన యుద్ధము జరుగును. ఇంతవఱకు జరిగినది బాలుర యాటవంటిది. ఈమాఱు మహానందమగును. మహా విప్లవమగును. ఈమాఱు అన్నదమ్ములకు యుద్ధము. భారతవర్షమంతయు నా తమాషా చూచును.

సత్య—మహబ్బత్ఖాను వెంట జోధపురము మహారాజా గజసింహుఁడును వచ్చెనఁట.

రాణా—అట్లనా! మంచిది. అయితే ఆయన మన యాహ్వానము నంగీకరించెనా? మహారాజా మన యాహ్వానము నంగీకరింపని యంతకోపము వహించునాయని నేను మొదటనే అనుకొంటిని.

సత్య—ఆ రాజపుత్రకులాంగారము.—

రాణా—ఏమంటివి? ఇంక నెప్పుడు నట్లనవలదు. అతఁడు పరమభక్తుఁడు. పరమవైష్ణవుఁడు. "ఢిల్లీశ్వరో వా జగదీశ్వరో వా" యని ఇంతవఱకు నాయకేశ్వరుని నమ్మని మనమే మేవాడు వంశజులకు కులాంగారులము—గజసింహుఁడు! ఎంత చక్కని పేరు. ఒక దానియందే గజము, సింహము! తొండమును ఆడించును, జూలును విసురును. మంచిది.

సత్య—రాజపుత్రుఁడై రాజపుత్రులతోఁ బోరుటకు వచ్చినాఁడు.

రాణా—ఇతఁడు లేకున్న యజ్ఞధ్వంసమెట్లు పూర్తియగును? శివుని వెంట నందీశ్వరుఁడు, భృంగీశ్వరుఁడు లేకున్న పని యెట్లు జరుగును? శాస్త్రములెన్నడు నబద్ధములు కావు.

సత్య—ఔరా! దురదృష్టవంతమగు మేవాడురాజ్యమా!

(కన్నీరు తుడుచుకొనును)

రాణా—సత్యవతీ! విధాత భారతవర్షమును సృజించిననాఁడే ఆత్మీయులంతఃకలహములచేతనే దానిసర్వస్వము నాశమునొందఁగలదని దాని నొసటను వ్రాసిపెట్టినాఁడు. తక్షశిలను స్మరింపుము. జయచంద్రునిమాట జ్ఞప్తికి దెచ్చుకొనుము. మానసింహ శక్తసింహుల సంగతి యూహింపుము. వారి తర్వాత మహబత్ఖానును గజసింహునిఁజూడుము. సాదృశ్యము బాగుగనున్నదిగదా? అక్షరము అక్షరము పూర్తిగ పోలుచున్నవిగదా? దైవలిఖిత మెన్నటికిని తప్పదు. పొమ్ము సత్యవతీ! నేనంత సైన్యమాయత్తపఱచెదను.

[సత్యవతి వెళ్ళును.]

రాణా—జాతియేదేని నాశమగుచో తనదోషముచేతనే నాశమగును. ఇస్త్రీనాశమగును. జాతి నిర్జీవమగునపుడు వ్యాధిముదురును. ఇంటింటను ఇట్టివిభీషణులు పుట్టుదురు.

[గోవిందసింహుఁడు ప్రవేశించును]

రాణా—గోవిందసింహా! ఏమిసమాచారము?

గోవిం—మహారాజా! మహబత్ఖాను నిరపరాధులగు గ్రామవాసుల కొంపలు తగులఁబెట్టుచున్నాఁడు.

రాణా—తగులఁబెట్టుచున్నాఁడా? ఉచితమే చేయుచున్నాఁడు.

గోవిం—ఉచితమా! మనమిందుకు బదులు తీర్చుకొందము.

రాణా—అవశ్యము. లేకున్న మేవాడుధ్వంసము పూర్తియెట్లగును?

గోవిం—మహారాజా! యుద్ధము చేయుదముగదా?

రాణా—యుద్ధము చేయకున్న మఱియేమి చేయుదము. గోవిందసింహా! రాజపుత్రసైన్యమెంతయుండును? అయిదు వేలు యుండును

గదా? అదియే చాలు. చచ్చుటకింతకన్న నెక్కుడు సైన్యమక్కఱలేదు. మహాబత్ఖానుని సైన్యము సుమారు ఒకలక్షయుండును గదా! ఉండనిమ్ము. దానిచే నయ్యెడిదేమి?

గోవిం—రాణాగారు!—(తలవంచుకొనును)

రాణా—ఏమి గోవిందసింహాజీ! మీరును తలవంచుకొంటిరి? లెండు. మేలుకొనుడు. నేడు చాల ఆనందమైనరోజు. ఇంటింటను మంగళవాద్యములు మోయనిండు. సర్వత్రి ఎఱ్ఱజెండాలు ఎగరనిండు. ఉదయపురిపు కోటపై మేవాడు రక్తధ్వజ మొక్కమాఱు బాగుగ నెగురనిండు. కనులారఁజూడుఁడు. మఱల రెండునాళ్లకు దానిఁజూడఁజాలరు.

గోవిం—మహారాజా! మేము యుద్ధము చేసెదము, చచ్చెదము. కాని అప్పటికిని మాతృభూమిని రక్షింపఁజాలమనియే దుఃఖము.

రాణా—దానికి దుఃఖమేమునకు? ఎవ్వరితల్లియుని చావక యుండునా? మనతల్లియుఁ బోవును. ఆమె వెంట మనమును పోదము.

గోవిం—మహారాజా! అట్లయగుఁగాక.

రాణా—అవును. అట్లయగును. గోవిందసింహాజీ! ఇటురండు. చచ్చుటకు ముందు ఒకమారు కవుఁగలించుకొందము. (కవుఁగలించుకొందురు.) మంచిది. ఇంక పొండు. మరణమునకు సన్నద్ధులగుడు.

(గోవిందసింహుఁడు పోవును. రాణిప్రవేశించును.)

రాణా—రాణీ! బాగుగ ఉత్సవముచేయుము. ఆనందించుము.

రాణి—మానసికి పెండ్లి నిశ్చితమయ్యెనా?

రాణా—మానసికిఁగాదు. మేవాడకు.

రాణి—మేవాడకు పెండ్లియా! ఎట్లు?

రాణా—ఈమారు విధ్వంసముతో మేవాడకు పెండ్లియగును.

రాణి—దీనియర్థము?

రాణా—చాలమంచి యర్థముగలదు. "ఈమారు అన్నదమ్ములకు యుద్ధము. బాగుగ ఉత్సవముచేయుము. ఈమారు పెండ్లియగును!—వినాశముతో—విధ్వంసముతో"! (వెళ్ళును)

రాణి—ఇప్పుడు వీరికిపిచ్చి పూర్తిగాఎక్కినది. నేను మొదటనే యనుకొంటిని. ఇంకనేమున్నది! ఇంటికిల్లిపాతికిపిచ్చి! ఇంక నేనేమి చేయుదును!

మానసి—(ప్రవేశించి,) అమ్మా! నాయనకేమువచ్చినది? వారు పిచ్చి వారువలె ఇటునటు తిరుగుచున్నారు. వారికేమి?

రాణి—ఇంక వచ్చుటకేమున్నది? వారికి పిచ్చియెక్కినది. వెళ్ళిచూచెదను. (వెళ్ళును)

మాన—ఈమహాబత్రాను రాజపుత్రుడు! ఈగజసింహుడును రాజపుత్రుడు! ఇంత ఈర్ష్య! ఇంత ద్వేషము! ఓసీ అధమజాతి! నీవే పతితవుగానున్న నింక నెవ్వరయ్యెదరు? అన్నదమ్ములందే ఇట్టివైరమున్నపు డింక నెవరుతీర్చగలరు?

---

## చతుర్థదృశ్యము.

స్థానము—మేవాడలో నొకగ్రామమార్గము.

సమయము—సాయంకాలము.

[సత్యవతియు, అరుణుడును నడచుచుందురు]

సత్య—అరుణా!

అరు—ఎందుకమ్మా?

సత్య—నడచుట కష్టముగా నున్నదా?

అరు—లేదమ్మా!

సత్య—నేఁడు మనమీయూరిలో నాఁగుదము.

అరు—ఇక్కడ నేమిపని?

సత్య—వీరితో రమ్మని చెప్పవలయును.

అరు—ఎచ్చటికి?

సత్య—యుద్ధమునకు. మేవాడువీరు లెల్లరు నశించిరి. ఇప్పుడు క్రొత్త వీరులు సృజింపఁబడవలెను. ప్రజకు క్రొత్తయేర్పాటు చేయవలయును. రమ్ము పోదము. సంధ్యాకాలమగుచున్నది.

(ఇద్దరు వెళ్లెదరు.)

[కొందఱు గ్రామస్థులు ప్రవేశించెదరు]

౧ వ వాఁడు—ఇంతమంచిదేశము. ఈయూరు అంతయు నశించిన దనుకొంటిమి.

౨ వ—ఈమాఱు సామ్రాజ్య మహాబత్ఖానే వచ్చినాఁడు. ఇంక మనకు భీతియులేదు.

౩ వ—మహాబత్ఖాను యుద్ధము బాగుగ నెఱుఁగునా!

౨ వ—ఇంక నడుగవలయునా?

౪ వ—ఏమి! అతఁడు యుద్ధమెప్పుడు నేర్చుకొనినాఁడు? నిన్న కాక మొన్న అతఁడు నాకంటె ముందు పుట్టినాఁడు.

౨ వ—ఇట్లు ప్రతివారును ఎవరి కంటెముందో పుట్టుచునే యుందురు. అందుచే వారు యుద్ధమెఱుఁగని వారా?

౪ వ—అబ్బాయీ! నీవు పెద్ద తర్కశాస్త్రవేత్తవు.

౧ వ—అదిగో చూడుము. ఆయూరు తగలఁబడుచున్నట్టు లున్నది.

అందఱు—ఎక్కడ?

౧ వ—అదిగో చూడుడు. పొగవచ్చుచున్నది.

౨ వ—అదిగియా? అది మబ్బు.

౩ వ—మబ్బు నేలమీదనుండి పైకెగిరిపోవునా? మబ్బు గిరగిర తిరుగునా? అది యెట్లు తిరుగుచున్నదో చూడుము.

౨ వ—అయితే దుమ్ము అయియుండును.

౩ వ—అవును. దుమ్మురంగు నల్లగానుండును కాబోలు.

౨ వ—బాబూ! నీవు పెద్ద తార్కికుడవుగా నున్నావు.

౧ వ—అదిగో ఆగ్రామస్థుల రోదన ధ్వని వినిపించుచున్నదా?

అందఱు—అవును. అవును.

౨ వ—అరే జనులు పాడుచున్నారేమోరా. లేక గాడిద అఱచుచున్నదేమో.

౩ వ—అవును రెండు ధ్వనులు నొకవిధముగనే యుండును కాబోలు.

౧ వ—అదిగో చాలమంది గ్రామస్థులు ఏడ్చుచు నిటువచ్చుచున్నారు.

౪ వ—వారిని సిపాయీలు తుపాకులు వేయుచు తఱుముకొని వచ్చుచున్నారు.

(తెఱలో—దండాలు బాబో దండాలు, చంపకుడు.)

౧ వ—అయ్యో పాపము వీరు—

(కల్యాణియు అజయసింహుడును ప్రవేశించెదరు.)

అజయ—అయ్యో! మీరు నిలబడి ఏమి చూచెదరు? కొంచెము వీరిని రక్షింపుడు.

అందఱు—మేమేమి చేయుదుము?

అజయ—ఊరక నిలబడి ఈ యన్యాయము చూచెదరా?

౨ వ—అయితే మమ్మును వారికై ప్రాణము తీయమందురా? చాలు అబ్బాయీ! పాఱిపోదము రండు వారు ఇటే వచ్చుచున్నారు.

కల్యా—పాఱిపోయిన రక్షింపఁబడుదురా? లేదు. మీవంతునువచ్చును. మీయిండ్లను తగులబెట్టఁబడును. మీలోనొక్కరును బ్రదుకరు.

౧ వ—తగులఁబెట్టినప్పటిమాట చూచెదములెండు. ఆయున్నుండఁగా నెవ్వరేని చచ్చెదరా? అదిగో వారు వచ్చినారు. పాఱిపొండు పాఱిపొండు.

[అజయుఁడు కల్యాణియుఁదక్క నందఱు పాఱిపోవుదురు.]

అజ—ఈ యాక్రందనము మఱియు సమీపించుచున్నది. ఇదిగో తుపాకులమోఁత! కల్యాణీ! నీవొకప్రక్కకు తొలఁగియుండుము. నేను వీరిని రక్షించెదను.

కల్యా—అన్నా! వీలగునంతవరకు వీరిని రక్షింపుము.

[కల్యాణి కొంచెముదూరము పోవును.]

అజ—కల్యాణీ! నేను వీరిని రక్షింపగలనో లేనో చెప్పఁజాలను, కాని వీరికై ప్రాణమునీయఁగల్గుదును. మానసియొద్ద నేనునేర్చుకొనిన మహామంత్రమును నేఁడు ప్రయోగించెదను. అదిగోవారు వచ్చుచున్నారు. (ఒఱనుండి కత్తిదూయును.)

[రోజుచు నిద్దఱు గ్రామస్థులువచ్చెదరు. వారివెనుక ఖడ్గపాణులై ఇద్దరు మొగలుభటులు వచ్చెదరు.]

గ్రామస్థులు—మహారాజా! మమ్ము రక్షింపుఁడు. రక్షింపుఁడు. (అజయుని కాళ్ళపైఁ బడుదురు.)

అజ—(భటులతో) జాగ్రత్త!

౧వ భటుఁడు—మొదలకుము. (కత్తియెత్తును.)

(అజయుఁడు వానినికత్తితోఁగొట్టి క్రిందఁబడవేయును. తక్కినవారు అజయునితోఁ బోరాడుదురు. మొగలుభటులు క్రమముగ క్రిందఁబడుదురు. మఱల కొందఱుభటులు వచ్చెదరు.)

అజయ—కల్యాణీ! ఇంక రక్షింపఁజాలను. పాఱిపొమ్ము.

కల్యా—అన్నా! నీవిట ప్రాణమిచ్చువాఁడవగుచు, నేను పాఱిపోవు దానననా?

(కల్యాణి ముందుకుఁ బోవును, అప్పుడే మొగలభటుని తుపాకిదెబ్బచే అజయుఁడు పడిపోవును.)

కల్యా—(పరుగెత్తుకొని వచ్చి) అన్నా! అన్నా!

౨వ భ—ఈమె యెవరు? ఈమెను పట్టుకొనుఁడు.

౩వ భ—వద్దు, స్త్రీలపై నెట్టిదురన్యాయమును చేయఁగూడదని సేనాపతిగారి హుకుము.

అజ—కల్యాణీ! నేను చనిపోవుచున్నాను. ఈశ్వరుఁడు నిన్ను రక్షించుగాక! (గిలగిల కొట్టుకొని చనిపోవును)

కల్యా—(ఏడ్చుచు) అన్నా! అన్నా! ఎక్కడకుపోతివి?

(అజయునిశవముపైఁబడును.)

౧వభ—ఇంక నెక్కడకుపోవును? అందఱును సర్గమునకుఁ బోవ వలసినదే.

కల్యా—(శాంతించి) లేదు. నేనుశోకింపను. క్షత్రియవీరా! నీవు నీకర్తవ్యమును నెఱవేర్చితివి. నీవు దీనరక్షణార్థము ప్రాణములు విడిచితివి. ఇంక వీరో! వీరు రక్తలోలుపులగు హింసప్రియపశువులు. వీరు నిష్ప్రయోజకముగ ఇతరుల ఇండ్లు తగులఁబెట్టుచున్నారు. గోవులను గ్రామవాసులను వధించుచున్నారు. ఈశ్వరా! వీరికి నరకమందును స్థానములేకుండుఁగాక!

౧వభ—ఇందు మాదోషమేమున్నది? మాసేనాపతియాజ్ఞ ప్రకారము మేము జనులయిండ్లు తగులఁబెట్టుచున్నాము. జనులను వధించుచున్నాము.

కల్యా—మీ సేనాపతి యెవరు?

౨ వభ—నీకు తెలియదా? మహాబలాను.

౩ వభ—పద. పోనిమ్ము.

కల్యా—వారియాజ్ఞయా? కాదు. పట్టిది.

౪ వభ—పద. పద.

కల్యా—ఆగుఁడు నేనును వచ్చెదను.

౧వ భ—నీ సేవకుఁడవు వచ్చెదవు!

కల్యా—మీ సేనాపతి యొద్దకు.

౧వ భ—నిన్ను అక్కడకు తీసికొనిపోయి నేమింక—

౩వ భ—చెవాట్లు తినమా?

౧వ భ—అవును స్వామియానుగా రాకపోయినచో మన దేమున్నది! తీసికొని రండు.

౧వ భ—మంచిది. రమ్ము.

కల్యాణి—నడువుఁడు.

---

## పంచమ దృశ్యము.

స్థానము - ఉదయపురము రాజసభ

సమయము - ప్రభాతము.

[రాణా, గోవిందసింహుఁడు, సామంతులు]

రఘువరుఁ—మహారాజా! చేతనయినంతవఱకు మనము యుద్ధము చేసితిమి, ఇఁక మనవలన కాదు.

రాణా—కాదు రఘువరా! మనము యుద్ధము చేసితీఱవలయును. దీనికి తిరుగులేదు. సేన సిద్ధముగ నున్నదా?

కేశవ—మహారాజా! సేన యెక్కడనున్నది? మేవాడలంతయు పోగు చేసినను అయిదువేలైనను అవునో కాదో. ఈమాత్రపు సైన్యము దీసికొని మనము ఒకలక్ష సైన్యముతో పోరాడఁగలమా?

రాణా—అందుసంశయము మేమియులేదు. మన అయిదువేల సైన్యము అయిదులక్షలకు సమానము.

కేశవ—మహారాజా? మనమిపుడు మొగలులతో సంధి చేసికొను టయే మంచిది.

రాణా—కాదు. అది ఎన్నటికిని కాఁజాలదు. నేను సంధిచేయవలె నన్నపుడు నామాట యెవ్వరును వినలేదు. అప్పుడు మొగలులు వారంతట వారే సంధికిచ్చగించిరి. ఇప్పుడా సమయము పోయి నది. ఇప్పుడుమనము సంధకై మొగలులఁ బ్రార్థింపఁజాలము.

కేశవ—కాని—

రాణా—ఇప్పుడీ విషయము మెవ్వరు నేమియు చెప్పవద్దు. ఇప్పుడేమియు నుపాయము లేదు. ఇప్పుడు యుద్ధము చేయవలెను, చావ వలెను. రెండేపనులు. ఏమి గోవిందసింహాజీ?

గోవిం—అవును మహారాజా! మనము ప్రాణమిచ్చెదముగాని మాన మీయము.

రాణా—మీరుచెప్పునది బాగుగనున్నది గోవిందసింహాజీ! మనము ప్రాణమిచ్చెదము గాని మానమీయము.

రఘు—మహారాజా—

రాణా—ఇప్పుడు నేనేమియు వినను. యుద్ధమేచేయఁగోరెద—యుద్ధ ము. సైన్యము సిద్ధముచేయుడు. మేవాడ రక్తధ్వజమెత్తుఁడు, రణభేరి మ్రోగింపుఁడు, పొండు సిద్ధముకండు.

[రాణాతప్ప తక్కినవారు వెళ్ళెదరు]

రాణా—మేవాడ్! సుందరమేవాడ్! నేఁడు నీవెంతయందముగఁ గను పట్టుచున్నావు. ఈయందమును మే మిదివఱకెన్నఁడును చూడ లేదు. నీవస్త్రములన్నియు చినిగిపోయినవి. శరీరమంతయు దుమ్ముకప్పినది. వెండ్రుకలు విరఁబోసియున్నవి. నిన్నీవేషము ననే వారు వధ్యస్థానమునకుఁ గొంపోవుచున్నారు. అమ్మా! యేమి నీ యీ సౌందర్యము! నేఁడు ఇన్నినాళ్లకు నిన్ను గుర్తించితిమి. ఇంతవఱకు నీసౌభాగ్య సూర్యకిరణములు నిన్ను కప్పి యుంచెను. ఇప్పుడాసూర్యుఁ డస్తమించినాఁడు. కనుక నేఁడు నీ యీ యాకాశమందు నెట్టియద్భుతప్రకాశమును గాంచఁ గలుగుచున్నాము! ఏమి యీజ్యోతి! ఏమి యీనీలిమ! ఏమి యీప్రశాంతమహిమ!

---

షష్ఠదృశ్యము

స్థానము—మహాబత్ఖానుని శిబిరము

సమయము—ప్రభాతము

[మహాబత్ఖాను, గజసింహుఁడు నిలిచియుందురు.]

గజ—రాణా స్వసైన్యముగ యుద్ధమునకు వచ్చినాఁడా?

మహా—అవును మహారాజా! కాని ఆయన ఒక్కఁడే మరలతిరిగి వెళ్ళి నాఁడు. ఆయన అయిదు వేల సైనికులలో నాల్గువేలు యుద్ధమున జచ్చిరి.

గజ—అయిదు వేలసైన్యమును మాత్రము దీసికొని లక్షసైన్యముతో యుద్ధము చేయవచ్చెనా? వింతసాహసము!

మహా—అవును సాహసమే. మహారాజా! నేను నేఁడొక విషయము నకై చాల గర్వపడుచున్నాను.

గజ—అవును ఖాన్‌సాహెబ్! గర్వపడవలసిన విషయము.

మహా—కాని నేనెందుకు గర్వపడుచున్నానో మీరు ఊహింపనేని చాలరు. మీరు దానికి కారణమెఱుఁగుదురా?

గజ—చెప్పుడు.

మహా—నేను ముసల్మాను నయినను రాజపుత్రజాతికి చెందినవాఁడ నగుటకును, అమరసింహునికి సోదరుఁడ నగుటకును గర్వపడు చున్నాను. అయిదువేలసైన్యముతో మన లక్షసైన్యముపైకి యుద్ధమునకు వచ్చెనన్న అతఁడు ప్రాణమర్పించుటకే వచ్చినాఁడన్నమాట. తనదేశమునకై ఇట్టిప్రాణత్యాగము,ఇట్టినిర్భయత, ఇట్టి సాహసకృత్యము రాజపుత్రుఁడే చేయఁగలఁడు. నేనును ఆరాజపుత్రజాతివాఁడనే.

గజ—నిశ్చయము, నిశ్చయము.

మహా—మీరును ఆరాజపుత్రులే. మీరును గర్వపడవచ్చును. కాని మీరుపతితులయినారు. కాన సిగ్గుచే తలయువంచుకొనుఁడు. మీరు ఎట్టివారో ఏమిఅయితిరో ఊహించుకొనుఁడు. నామాట అట్లుంచుడు. నేను ఇపుడు రాజపుత్రుడను కానని సరిపుచ్చుకొనుట కవకాశమున్నది. నేను పూర్వమెపుడో రాజపుత్రుఁడను. కాని మీరిపుడును రాజపుత్రులే.

గజ—రాణా యుద్ధమున చంపనుబడలేదు. కైదునుచేయఁబడలేదు.

మహా—లేదు. వారిని చంపవద్దనియు కైదుచేయవద్దనియు నే నాజ్ఞాపించితిని. ఇట్టిశత్రువు ప్రపంచమున గౌరవింపదగినవాఁడు. నే నాగౌరవమునకు భంగము చేయఁగోర లేదు.

గజ—మంచిది. ఇంక నాకు సెలవిండు.

మహా—ఆఁ. తామును దయచేయవచ్చును.

[గజసింహుఁడు వెళ్ళును.]

మహా—అదిగో!ఎదురుగ మండుచున్న గ్రామములు గనఁబట్టుచున్నవి. గ్రామవాసుల యాక్రందనధ్వనులు వినవచ్చుచున్నవి. హిందు

వులారా! నేఁడు మీరు మీమతగౌరవముతో చావుఁడు. నేఁడు నేను మీపొగరంతయు నణఁచితిని. మీయాడంబరము మీగర్వమువంతయు చూర్ణముచేసితిని. మీ—

[నలుగురు భటులతో కల్యాణివచ్చును.]

మహా—ఈమెయెవరు?

౧వభ—ఖుదావంద్! మే మీమెను ఎఱుఁగము. దారిలో కనఁబడి మా వెంట నిచటకువచ్చినది.

మహా—(కల్యాణితో) నీవెవతెవు?

కల్యా—నన్ను తెలిసికొనుటచే మీకేమియు ప్రయోజనములేదు.

మహా—నీకేమికావలయును?

కల్యా—నేను మీయొద్దకు ఒకవిషయమై న్యాయము కనుగొనుటకు వచ్చితిని.

మహా—ఏవిషయము?

కల్యా—మీయీభటులు నిరపరాధుఁడగు నాసోదరునిజంపిరి.

మహా—నీసోదరుని జంపిరా? ఎట్లు? భటులారా!

౧వభ—ఖుదావంద్! మేము గ్రామవాసులను వధించుచుంటిమి. ఈమెసోదరుఁడు వారిపక్షమున యుద్ధముచేసి అందు హతుఁడయ్యెను.

మహా—(కల్యాణితో) ఇదినిజమేనా?

కల్యా—అవును. మీసైనికులు దీనులగు గ్రామస్థులను వధించుచుండ నాసోదరుఁడు వారిని రక్షింపబోయెను. అంతవీరు అతనినిఁ గూడ చంపిరి.

మహా—అగుచో ఆయన యుద్ధముందే హతుఁడయ్యెను.

కల్యా—అట్లుకానిండు. వీరు అతనిని యుద్ధమందుచంపిరి.

మహా—దేవీ! ఇంకనిందు వీరియపరాధము లేదు. నేను వీరికి అట్టిఆజ్ఞ నిచ్చితిని. సైనికులారా! మీరు వెలుపలికిపొండు.

(సైనికులు వెళ్ళిపోవుదురు)

కల్యా—మీరు నిరపరాధులగు గ్రామవాసులను జంపుటకు ఆజ్ఞా పించితిరా?

మహా—అవును.

కల్యా—గ్రామములను తగులఁబెట్టుటకుకూడ ఆజ్ఞాపించితిరా?

మహా—అవును.

కల్యా—మీరింత నిష్ఠురులగుదురని నాకు నమ్మకములేదు.

మహా—నాసైనిట్ల సదభిప్రాయమునకుఁ గారణమేమి?

కల్యా—నానాథుఁడింత నిష్ఠురుఁడుకాఁడు.

మహా—నీనాథుఁడా!

కల్యా—అవును. ప్రభూ! ప్రాణేశ్వరా! నన్నుగుర్తింపగలరో లేరో బాగుగచూడుఁడు. నేను మీపరిత్యక్తహిందూస్త్రీని, కల్యాణిని.

మహా—కల్యాణీ! కల్యాణీ! అయితే వీరునీయన్నను అజయసింహుని వధించిరా?

కల్యా—అవును. ఏనాఁడు మిమ్ముహృదయమునసిలిపి మీప్రేమను నాజీవితమునకు ధ్రువనక్షత్రముగఁ జేసికొని నాజీవితనౌకను ఈయనంత సంసారసముద్రమున విడిచితినో నాఁడు నాసోదరుఁడు ఆనందపూర్వకముగ నిచ్చటకు తాను నన్నురక్షించుటకై ఈదుఃఖకాలమున నాకు సహచరుఁడయ్యెను. త్రోవలో దుష్టులగు మీసైనికులనుండి నన్నురక్షించునపుడు అతనికి చాలపెద్ద గాయములుతగిలెను. అప్పుడు,

ఆ॥ వె॥ పలుదినంబులేను ♦ పటకుటీరమునందు
నుండిసేవసలిపి ♦ దండనుండు

పల్లియులకుఁబోయి ♦ భైక్షుకమునఁగల్గు
భోజనంబొసఁగుచుఁ ♦ బ్రోచితయ్య.

క౦॥ అట్టిమదీయసహోదరు
నిట్టువధించితిరి మీర ♦ లేమననేలా
కట్టడిదైవకృతమునకుఁ
జట్టన నీదీనురాలిఁ ♦ జంపుమునాథా.

మహా—కాదు. కాదు. నన్ను క్షమింపుము.

కల్యా—ఇందఱు గ్రామవాసులహత్య మీయాజ్ఞచేతనే జరిగినదా?

మహా—అవును. నాయాజ్ఞచేతనే జరిగినది. నేను నాసైనికులకు రాజపుత్రజాతిని రూపుమాపుట కాజ్ఞాపించితిని.

కల్యా—హా ఈశ్వరా! ఏమిచేసితివి? యీయనయే నాకు పూజ్యదేవత. ఈఘాతకుని హృదయమున నిడుకొనియే నేనుసన్యాసినినైతిని. నాకు మృత్యువునులేదా? ఈశ్వరా! నేనొక్కనాఁడే ఒక్కమారు పతిని, భ్రాతనుగూడ పోఁగొట్టుకొంటిని. నేఁడు నావంటి అభాగ్యురాలెవరు, అకటా! (నోరుమూసికొనును.)

మహా—నీ వెఱుఁగుదువా నేనెందుకు—

కల్యా—వద్దుప్రభూ! నేనిది యెఱుఁగఁగోరుటయులేదు. నా మోహము విడిపోయినది. నేను ఇన్నినాళ్లనుండి మిమ్ము పూజించుచుంటిని. కాని నేటినుండి మిమ్ము పరమశత్రునిగా తలఁచుచుంటిని. నేను మిమ్ము తలఁచునంతగా మొగలులను గూడ శత్రులుగా తలఁచుటలేదు. మొగలులు మనకేమియుఁగారు. వారి మతము వారికి కాఫరులను వధించుట కుపదేశించుచున్నది. మీరో ఈదేశమునకు బిడ్డలు. మీనాళములందు విశుద్ధరాజపుత్ర రక్తముఉన్నది. మీరును తుచ్ఛధనమునకాసించి మీజాతిని నశింపఁబూనితిరి నాథా! ఇంక నేనేమి చెప్పుదును! మీరు మొగలులనుగూడ మించితిరి. వారు మేవాడును జయించుటయేకోరిరి.

కాని దీనులగు గ్రామవాసులయిండ్లు కాల్పఁగోరలేదు. మీరు వారికొఱతనుతీర్చితిరి. మీరు వారి యుచ్ఛిష్టమును భుజించుచు ఈఘాతకసైనికులను మాంసలోలుపులగు ఈనీచనరశ్వానములను దీనగ్రామవాసులపైకి వదలితిరి. మీరు మేవాడును శ్మశానవాటిక నొనర్చితిరి. నిరపరాధులగు మానవుల హాహారవంబుచే ఆకాశమంతయు ఘూర్ణిల్లుచున్నది. మొగలుల కిట్టియుద్దేశ మెన్నడునులేదు. హా ఈశ్వరా! ఇట్టి దేశద్రోహులకు నీయొద్ద తగినశిక్షలేదా? అకటా! ఇంకను వీరినెత్తిపై వజ్రమేలపడదు!

మహా—కల్యాణీ! కేవలము నీకొఱకే నే నీయుద్ధమున ప్రవేశించితిని.

కల్యా—నాకొఱకా? అసత్యము.

మహా—అసత్యముకాదు. నిజము. ఏనాఁడు నీతండ్రి మొగలులపైని ద్వేషముచే నిన్ను ఇల్లువెడలఁగొట్టెనో నాఁడే నేను మేవాడుపైకి కత్తిగట్టితిని.

కల్యా—ఈసంగతి యొప్పుకొన్నచో మీరేమతసిద్ధాంతము ప్రకారము ఒకని యపరాధమున జాతినంతయు నిర్మూలించుటకు సమకట్టితిరి?

మహా—ఇదినీకు వింతగా నున్నదా? ఒకరావణుని పాపముచే లంక యంతయు ధ్వంసముకాలేదా? మఱియు ముసల్మానులపై ఈవిద్వేషము యొకనీతండ్రికేకాదు. హిందువులెల్లఱకు ముసల్మానులందఱపై ఇట్టిద్వేషమున్నటుల నీతండ్రి వెల్లడించెను. హిందువుల యీజాతిగతద్వేషమునకు ప్రతీకారము సేయుటకై నేను వచ్చితిని.

కల్యా—మొగలసేనాపతీ! దీనికి ప్రతీకారము సేయవలసియున్నచో జాతిముసల్మానుచేయును. మీరు ముసల్మానుమతమునుస్వీకరిం

చినపుడు హిందువులయందలి ఈముసల్మానుల విద్వేషమును ఎఱిఁగియే స్వీకరించితిరా? నాథా! మీరే మీయీదశను చేసికొంటిరి. మీరు వ్యర్థముగ అన్యాయప్రతీకారము సేయుచుంటిమని ఏలసంతుష్టిచెందెదరు? మీయందలి ముసల్మానత్వము మిమ్మిట్లుపని చేయించుటలేదు. మీయందలి అహంకారము— మహాబత్ఖానుత్వమే మిమ్మిట్లుపని చేయించుచున్నది.

మహా—(స్వగతము) ఆఁ! ఇదినిజమేనా!

కల్యా—మీరావ్యక్తిగతద్వేషముచేతనే మేవాడువిధ్వంసమునకు గడంగితిరి. ఇదియే మీధర్మము! ఇదియే మీశూరత్వము! ఇదియే మీమనుష్యత్వము! హా ఈశ్వరా! ఎంతజేసితివి? నేను ఇన్నినాళ్ళనుండి గాలిలో మేడకట్టుచుంటిని. నీవు దానిని నేఁడు మట్టిలోఁగలిపితివి.

మహా—కల్యాణీ—

కల్యా—చాలుచాలు. ఇపుడు నా మోహము భంగమైనది. మీరునాకు పతియు నేనుమీకు పత్నిని అని అనుకొంటిని. కనుకనే ఒక నాఁడు నేను గొప్పయభిమానముతో "మమ్మెవ్వరు వేఱు చేయఁగల"రని పలికియుంటిని. కాని మీకునునాకును మధ్యఒక మహాసముద్రమున్నటుల నేఁడు గాంచుచుంటిని. మనయిద్దఱ మధ్యను నాసోదరుని కోమలశరీరము పడియున్నది. దానిని మించి మనయిద్దఱమధ్యను నాస్వదేశ రక్తపునది ప్రవహించుచున్నది. నిష్ఠురా! దేశద్రోహీ! రక్తపాయీ! ఘాతుకుఁడా! ఇసీ!—ఓఈశ్వరా! ఓవిధాతా! ఇట్టినీచుని, క్రూరుని, సోదరహంతకుని, ఉచ్ఛిష్టభిక్షుకుని, వికటాట్టహాసము విని తుదకు నీపై గూడ నాకు విశ్వాసము పోదుగదా!

[కల్యాణి వెళ్ళును.]

---

# మేవాడు పతనము

## పంచమాంకము

### ప్రథమదృశ్యము

స్థానము—ఉదయపురము: రాజప్రాసాదము

సమయము—రాత్రి

[మానసి ఒంటరిగా పాడుచుండును.]

గీతము.

వచియింపఁగఁజాల నాప్రాణనాథ! నీప్రేమను
వచియింపఁదొడంగఁ గళము బాష్ప పూరితంబగునే॥
మనసులోనిమాట నామనసుననే యుండిపోయె
కనఁగరా దుపాయమేమి కాంతుఁడ! నేనేమిచేతు॥
పెదవివిప్పకున్న, నాయెద విదీర్ణమైన
ముదమున నాసర్వహృదయమును జూపించెదను నీకు॥

[రాణా ప్రవేశించును.]

మాన—ఏమినాయనగారూ! మీరు యుద్ధక్షేత్రము నుండి తిరిగివచ్చితిరా?

రాణా—అవును మానసి!

మాన—ఏమి! ఏమయినది నాయనగారూ?

రాణా—మాటాడకుము. నేనొక యద్భుతమునుగాంచితిని.

మాన—ఏమిచూచితిరి? యుద్ధము—

రాణా—కాదుమానసీ! ఈమాఱు యుద్ధము జరుగనే లేదు. యుద్ధక్షేత్రమున కేవలము అగ్ని వర్షింపసాగెను. అందు మన సైన్యమంతయు భస్మమాయెను.

మాన—ఎట్లు?

రాణా—మే మేమియు తెలిసికొనలేకపోతిమి. అది యేమియో. అది ఈజగత్తులోనిది కాదు. ఉల్కావర్షమగు చున్నట్టులుండెను. భయంకరమగు అభిశాపప్రవాహము వచ్చుచున్నటులుండెను. నే నొకక్షణము కనులుమూసికొంటిని. నాశరీరమునుండి ఒక హృత్కంపము పోయినట్లయ్యెను. నాతల తిరిగిపోయెను. నే నేమియు తెలిసికొనఁజాలక పోతిని. కన్నుతెఱచి చూచుపరికి నిద్రపోయి లేచినట్టు లయ్యెను. యుద్ధక్షేత్రమున నే నొక్కఁడనే యుంటిని. ఇంక నెవ్వరును గనిపించలేదు. నలుప్రక్కలను తీనుఁగులకుప్పలు తెప్పలై యుండెను. అహా! ఎంతభయంకర దృశ్యము!

మాన—నాయనగారూ! మీరు కొంచె ముద్వేగవశులయినట్టు లున్నారు. కూర్చుండుడు. మీకు పరిచర్య చేసెదను.

రాణా—నే నా శ్మశానమందే ఒంటరిగ తిరుగసాగితిని. కాని నన్నెవ్వరును వధింపలేదు.

మాన—ఈయుద్ధమున మీరు ఓటమి నొప్పుకొంటిరా?

రాణా—నేను ఒప్పుకొనుటవలనను, మానుటవలనను ఏమియుప్రయోజనము లేదు. ఒప్పుకున్న మాత్రమున జయమువచ్చినదనుటకు యుద్ధమేమియు తర్కముగాదు. ఇదిస్థూలము, కఠినమునగు ప్రత్యక్షసత్యము. నన్నువా రెందుకు వధించలేదో తెలియదు. నే నా మహాశ్మశానమున 'మహాబత్ఖాన్! గజసింహా!' అని అఱచుచు తిరిగితిని. కాని యెవ్వఁడును నాయొద్దకురాలేదు. దీనికికారణము చెప్పఁగలవా మానసీ?

మాన — నాయనగారూ! మీరు వ్యాకులపడవద్దు —

రాణా — ఆఁ. మఱియొక మాట నాకు బోధపడలేదు. మహాబత్ఖాను యుద్ధమున విజయము పొందినాఁడుగదా! అతఁడుగర్వముతో ఉదయపుర దుర్గమున నేల ప్రవేశింపలేదో తెలియదు. అతఁ డింక దుర్గమున అధికారము సేయుటయే అవశిష్టము.

మాన — నాయనగారూ! మీరు ఓడిపోతే పోయినారు. మీకు విచారమెందుకు? యుద్ధమున ఏదో ఒకపక్షమునకు పరాజయము తప్పదుగదా!

రాణా — అమ్మాయీ! నీవుచెప్పినది నిజము. యుద్ధమున ఏయొక పక్షమునకో పరాజయముతప్పదు. విచారమెందుకు — మానసీ! నాకును ఈవిషయమై విచారములేదు. కాని నన్నువారు ఎందుకు వధింపలేదు?

[రాణి ప్రవేశించును.]

రాణా — (రాణితో) పెద్దసమస్య వచ్చినది. నీ వేమని చెప్పఁగలవా?

రాణి — ఏమి?

రాణా — నన్ను వారెందుకు వధింపలేదు?

[రాణి మానసివంక చూచును.]

రాణా — — వినుము. ఆగంభీర రాత్రియందు, ఆయుద్ధక్షేత్రమున, ఆపీనుఁగుకుప్పలమధ్య నే నొంటిగా నిలచియుంటిని. అది యెట్టిదృశ్యము! నీవు దానిని ఊహింపనేని చాలవు. పైన ఆకాశమున అనంత నక్షత్రములును, క్రింద నేలపై అసంఖ్య శవములును నిశ్చలముగ నుండెను. ఆరెండిటి మధ్య ఘోరాంధకారము దక్క మఱియేమియు లేదు. నాకు ఈజగత్తుతో నేమియు సంబంధమే లేనట్టు లుండెను. నేనును చచ్చినట్లును లేక సజీవముగు మృత్యువా యనునట్లును నాకు తోచినది. నే నా యుద్ధక్షేత్రమున నాఖడ్గమును విసరితిని. కాని అది

ఆ శీతలనిశావాతమునే చీల్చుకొనిపోయినది. నేను 'మహాబత్' అని కేకవేసితిని. ఆధ్వని వ్యర్థముగ నలుప్రక్కలు వెదకి తిరిగివచ్చెను. తరువాత (భగ్నస్వరముతో) నే నా యుద్ధక్షేత్రముందు నలుప్రక్క-లను దృష్టిపరపితిని. నే నా నక్షత్రప్రకాశమున మన బంగారురాజ్యము ఒక గొప్ప భూకంపముచే ధ్వంసమగుటను గాంచితిని. (మందస్వరముతో) ఆపిమ్మట ఆ మహాశ్మశానవాయువు మృతసైనికుల ఆత్మల బరువుచే కొంచెము నాకు భారముగఁ దోఁచెను. అతికష్టముతో నేనొక నిట్టూర్పువిడిచితిని. ఆనిట్టూర్పును పైకిపోవక బరువుచే నేలఁపై బడెను. ఆసమయమున అచట అంధకారము లేనిచో వెదకిన అదితప్పక దొరకునని నాయభిప్రాయము.

రాణి—కానున్నది అయినది. ఇప్పుడువిచారించిన నేమిలాభము? నేను మొదటనే చెప్పితిని.

రాణా—అవును నీవు నిజముచెప్పితివి. మేవాడు చనిపోయినది. నేను నిలఁబడిచూచితిని. బుజముపై వేసికొని ఇచటకు తీసికొని వచ్చితిని. చూచెదవా? రమ్ము.

---

## ద్వితీయదృశ్యము.

స్థానము-మేవాడు అంతఃపురమందలి మార్గము

సమయము—రాత్రి

[ఇద్దఱుపరిచారికలు మాటాడుచు వచ్చెదరు.]

౧—నేపము వృద్ధగోవిందసింహుని దుఃఖమునకు మేఱలేదు. పాపము ఒకడేకొడుకు.

౨—అయితే చారణి దొరసానిశవమును గోవిందసింహుని ఇంటికడకేల తీసికొనివచ్చినదో తెలియదు.

౧—ఆమె పనులన్నియు నిట్లే వింతగనుండును. ఆమెకు ఇంక నేమియు పనిలేదు కాఁబోలు. అక్కడ చాలమంది పోగయిరా?

౨—ఆఁ. వాఁకిలియంతయు నిండియుండెను. గోవిందసింహుఁ డింటి యొద్దలేఁడు. చారణి దొరసాని కొడుకు అరుణసింహుఁడు ఆయనను పిలుచుటకు వెళ్లెను. అచ్చటనే శవమునకు దగ్గరగ దొరసాని ఒక్కతె నిలఁబడి యుండెను. తక్కినవారు దూరముగ నుండిరి.

౧—ఇదియంతయు చీకటిలోనేనా?

౨—అవును. దూరముగ మేడలో నొకదీపముమాత్రము మినుకు మినుకు మనుచున్నది. ఆమెయెవరు?

౧—ఎక్కడ?

౨—అదిగో! కనఁబడుటలేదా?

౧—ఆమె రాజకుమారి. ఆమెఅవస్థ చూచితివా? గ్రుడ్లుపైకి వచ్చినవి. పైఁటచెఱఁగుజారి నేలదొర్లుచున్నది. రెండుచేతులును గుప్పిళ్ళుపడినవి.

౨—అదిగో! ఆమె యిచటకే వచ్చుచున్నది. పద, వెళ్ళుదము.

[ఇద్దఱును ఒకప్రక్కగా పోవుదురు. రెండవప్రక్కనుండి మానసి ప్రవేశించును.]

మాన—పోయినాఁడు. అజయుఁడుకూడపోయినాఁడు. నన్ను కలియను లేదు. నాతో నేమియు చెప్పనులేదు. వెళ్ళిపోయినాఁడు. ఇది న్యాయ్యమా? అయ్యో! నాతల తిరిగిపోవుచున్నది. నాకనుల యెదుట పచ్చనిబింబములు భూమినుండి యెగసి ఆకసమున లుప్తమగుచున్నవి. శరీరమునుండి జ్వాల వెడలుచున్నది. శిరస్సుపైనుండి ఆకాశము వెడలిపోయినది. కాళ్ళక్రిందనుండి భూమి తొలఁగిపోయినది. నేనెక్కడనున్నాను! జొరా! (కొంచెము సేపు ఊరక యుండి మెల్లగా) నేనుచాల కఠినురాలను. నోటినుండి

మాటయే వచ్చెడిదికాదు. ఆనాఁడు అజయుఁడు నా దయా లేశమునుగోరి దీనదృష్టితో నన్నుఁగాంచుచుండగా, నాకరుణా దృష్టికై కడునాతురుఁడగుచుండగా నే నతనితో మాట్లాడనే లేదు. కనుకనే నా అజయుఁడు కోపగించి వెళ్లిపోయినాఁడు. నా యీ అభిమానమును చూర్ణముచేసి కాలితో రాచి వెళ్లి పోయినాఁడు. అజయా! నేఁడు నీపాదములకడ విశ్రమించుటకు మనసు గలుగుచున్నది. నేఁడు నాహృదయమును జీల్చి నీకు చూపింపవలెననియున్నది. కానిఅయ్యో! ఇప్పుడు సమయము గాదు. (నిష్క్రమించును.)

---

## తృతీయ దృశ్యము.

స్థానము—గోవిందసింహుని గృహాంగణము.

సమయము—రాత్రి

[పెద్దగాలి వీచుచుండును. అజయసింహునిశవముయొద్ద సత్యవతియునలుగురు వాహకులును నిలఁబడి యుందురు. గోవిందసింహుఁడు తెప్పయార్పక శవమును చూచుచుండును.]

గోవిం—ఇదియే నాపుత్రుఁడు అజయసింహుని మృతదేహము. సత్యవతీ! ఇది నీకెచ్చట దొరకెను?

సత్య—బాటకు ప్రక్కగ.

గోవిం—ఇతని మృత్యు వెట్లయ్యెను.

సత్య—దగ్గర నున్నవారివలన తెలిసికొంటిని. మహాబత్ఖానుని భటులు నిరపరాధులగు గ్రామవాసులను వధింపుచుండ అజయుఁడు వారిని రక్షించుటకై పోయి అందు చంపఁబడెనఁట! తర్వాత భటులు కల్యాణిని పట్టుకొని తీసికొనిపోయిరఁట!

గోవిం—కుమారా! అజయా! క్షమాపణ వేడుకొనుటకును అవకాశ మొసఁగితివి కావు. నేను క్రోధాంధుఁడనగుటచే ఇలు వెడలి

పోవు నిన్నేమియు ననఁ జాలకపోతిని. అకటా! నిన్నేల పోని
చ్చితిని! పోతివిపోని! న్నేల పిలిపించకపోతిని! అయ్యో! కుమారా!
అజయా! ప్రాణప్రియా! నాకు క్షమాపణ వేడుకొనుటకును
అవకాశ మొసఁగితివికావు. ఇంతఅభిమానమా! ఇంతఅలు
కయా!—నీముసలి తండ్రిని— అజయా! అజయా!—

సత్య—గోవిందసింహాజీ! ఇందుకు దుఃఖమేల? అజయుఁడు దీనరక్షణ
మునకై ప్రాణములొసఁగెను.

గోవిం—అవును సత్యవతీ! నీవుచెప్పునది సత్యము. అజయుఁడు దీనర
క్షకై ప్రాణమర్పించెను—అసహాయులకు సహాయముచేయుచు
ప్రాణము విడిచినాఁడు. ఇంకదుఃఖమెందుకు? పొండు. చక్కఁగా
దహనకర్మము చేయుఁడు.

[గోవిందసింహుఁడు శవముఖమును కప్పివేయును. వాహకులు
శవము నెత్తుఁబోవుదురు.]

గోవిం—ఆగుఁడు. నన్ను మఱియొకమాఱు చూడనిండు. హా! నా సర్వ
స్వమా! వృద్ధునిపాథేయమా! అంధునిహస్తదండమా! నా
ప్రియకుమారా! ఒకమాఱు— లేదులేదు. దుఃఖమెందుకు?
సత్యవతీ! నీవుచెప్పినదినిజము. అజయుఁడు దీనరక్షకై ప్రాణ
ములు విడిచినాఁడు. ఓసీ మేవాడుభూమీ! రాక్షసీ! ఇందఱి
ప్రాణముల మెక్కినను నీపొట్ట నిండలేదు. నీవు పోవుటకు
సిద్ధముగఁ గూర్చున్నావు. కాని అందఱి ప్రాణములను భక్షిం
పక పోవునట్లులేవు. అయ్యో! నాబంగారువంటి సంసారము
పాడైనది. కాదు, కాదు. నాఅజయుఁడు చనిపోయినాఁడని
యెవ్వరందురు. వాఁడు చావలేదు. అదిగో! నావంక చూచు
చున్నాఁడు. ఇంకబ్రదికియే యున్నాఁడు. అజయా! అజయా!
(గోవిందసింహుఁడు శవమువైపునకువచ్చుచుండ సత్యవతి మధ్య
నిలఁబడును.)

సత్య—గోవింద సింహాజీ! శోకముచే నున్మాదము చెందవలదు. మీ పుత్రుఁ డిప్పు డీప్రపంచమున లేడు.

గోవిం—లేడు. పుత్రుఁడులేడు నిజము పుత్రుఁడులేడు! నేను పొరపడుచున్నాను. అజయా! అజయా! నాసర్వస్వమా! అజయా! (ముఖము కప్పివేయును.)

సత్య—గోవింద సింహాజీ! నీవు వీరుఁడవు. పుత్రశోకముచే నింత యధీరుఁ డవగుట నీకు బాగుగ లేదు.

గోవిం—ఏమంటివి సత్యవతీ! కొంచెము బిగ్గరగా చెప్పుము. నాకు వినిపించుటలేదు. నాహృదయమున నొక భయంకరమగు ఝంఝామారుతము వీచుచున్నది. అందుచే నాకేమియు వినిపించుటలేదు. ఓహో హో! (హృదయము పట్టుకొనును.)

కల్యాణి—(ప్రవేశించి) నాయనా! నాయనా!

గోవిం—ఎవరుపిలుచునది? కల్యాణియా? సర్వనాశనీ! చూడుమెంత చేసితివో! రాక్షసీ! నా అజయుని నీవేమ్రింగితివి. ఇప్పుడు నాకు తెచ్చియిమ్ము.

కల్యా—హా సోదరా! హా సోదరా! (శవమును కౌఁగలించుకొనును.)

గోవిం—పో. దూరముగా పో. నాఅజయునిముట్టుకొనవద్దు. పొమ్ము పిశాచనీ! (చేయిపట్టుకొని కల్యాణిని త్రోయును.)

కల్యా—(లేచి) నాయనగారూ! నేను నిజముగ పిశాచినిని. నన్ను చంపి వేయుఁడు. నాపేరు కల్యాణిఅని యెవ్వరుంచిరి? నాయనగారూ! నేను మీగృహమునకు అకల్యాణిని—మేవాడు రాజ్యమునకు ధూమకేతువను. ఈపృథ్వికి సర్వనాశనిని. నన్ను చంపి వేయుఁడు. ఈసర్వనాశనిని ఈప్రపంచమునుండి వెడలఁగొట్టుఁడు. ఇంక మీకేమియు కొదువయుండదు. నన్ను చంపివేయుఁడు. చంపివేయుఁడు!—(గోవిందసింహుని కెదురుగా తలవంచుకొని కూర్చుండును.)

గోవిం—నాహృదయమున నేమియిది? ఈ నరకజ్వాలను ఈపిశాచ నృత్యమును ఇంక సహింపఁజాలను. ఓజగదీశ్వరా! ఇంకసహింపఁజాలను.

సత్య——గోవిందసింహాజీ! మీరు అధీరతచెందవద్దు. మీ వీరపుత్రుని దహనకర్మమును సగౌరవముగ జేయుడు. మీపుత్రుఁడు దీనరక్షకై ప్రాణమర్పించినాడు.

గోవిం—నిజము. నీవుచెప్పినది నిజము. నాపుత్రుఁడు దీనరక్షకై ప్రాణమర్పించినాడు. ఇంక నేను దుఃఖింపను. నన్ను క్షమింపుము కుమారీ! ఇదినాకు గౌరవావహమగు విషయము. కాని— (ఏడ్చుచు) సత్యవతీ! ఇపుడు నేను వృద్ధుఁడనయిపోతిని. చాలవృద్ధుఁడనయిపోయితిని.

కల్యా—నాయనగారూ!

గోవిం—(కంపితస్వరముతో) రమ్మకుమారీ! నా యొడిలోనికి రమ్ము. మద్గృహనిర్వాసితా, పతిపరిత్యక్తా, మాతృహీనా, అభాగ్యోపహతా, కుమారీ! రమ్ము. నేను సాధ్వి నవమానించితిని. కనుక నే ఈశ్వరుఁడు నాకీ శిక్షయొసఁగినాడు. పొండు. మీరీ మృతదేహమునకు దహనసంస్కారము చేయుఁడు.

[జనులు శవము నెత్తఁబోదురు. ఇంతలో హఠాత్తుగ మానసి ప్రవేశించును. ఆమె వెండ్రుకలు విరబోసి యుండును. వస్త్రము చెదరియుండును.]

మాన—ఆగుడు. కొంచెము నన్నును చూడనీయుఁడు.

సత్య—ఎవరు! రాజకుమారీ!

మాన—అజయా! ప్రియతమా! నాజీవన సర్వస్వమా! నాథా!

సత్య—ఇదియేమి రాజకుమారీ! నీనాథుఁడా!

మాన—మంచిది. ఇంక నెల్లరు వినుఁడు. నేటిదనుక నే నీ విషయమెవ్వరికిని చెప్పలేదు. నేడు చెప్పుచున్నాను. అజయసింహునితో

నాకు వివాహమయినది. ఇది యెవ్వరు నెఱుఁగరు. నేనును ఎఱుఁగకుంటిని. ఎవ్వరికిని తెలియకయే మౌనముగ ఆత్మలో ఆత్మలోనే ఈవివాహము జరిగినది.— ప్రియతమా! ఎక్కడకు పోతివి? ఇదిగో! నేను వచ్చితిని. నేఁడు నేను ప్రగల్భనగు నీ గురువురాలను గాను. దయామయినగు రాజకుమారిని గాను. నీప్రేమభిక్షను యాచించు నొక అబలను. నేఁడు నేను భిక్షుకి కంటెను అతిదీనురాలను. అజయా! నేటిదనుక నేను నిన్నెంత ప్రేమించు చుంటినో నీకు తెలుపలేదు. మొదట నే నిది గ్రహింపనే లేక పోతిని. నన్ను క్షమించుము.

సత్య—అయ్యో! రాజకుమారియు శోకముచే నుద్విగ్న యగుచున్నది. మానసీ! శాంతించుము. అజయుఁడు దీనరక్షణకై ప్రాణము విడిచినాఁడు.

మాన—నిజము. ప్రాణములిట్లే విడువవలయును. నా ప్రియశిష్యా! నేడు నీవు నా గురుస్థానము నాక్రమించితివి. నీ గౌరవకిరణము పరలోకము వ్యాపించి యీపృథ్వపై వ్రాలినది. చావనున్నచో ఇట్లే చావవలయును. వృద్ధ గోవిందసింహజీ! మీరు ధన్యులరు. ఇట్టిపుత్రునికి తండ్రియగుటకు మీరు గర్వపడవచ్చును. ఇట్టి వాఁడు పతియగుటచే నేనును ధన్యరాలను. గోవిందసింహజీ! ఇది మనము గర్వపడుటకు సమయముగాని శోకింపుటకుఁ గాదు.

గోవిం—(శుష్కకంఠముతో) రాజకుమారీ! అజయుఁడు దీనరక్షార్థము ప్రాణమువిడిచినాడు. దుఃఖమెందుకు? (స్వరభంగముతో) అజయుఁడు దేశమునకై— (మాటరాదు. గోడకు కుడిచేయిఆనించి దానిపై తలయుంచును. ఏడ్వగా ఏడ్వగా ఎక్కిళ్ళువచ్చును.)

మాన—వ్యర్థము! వ్యర్థము! వ్యర్థము! లోపలనుండి ప్రబలశోకోద్వేగము వెలువడి ఓదార్పులనన్నిటిని కప్పివేయుచున్నది. ఇంక సహింపఁజాలను—అజయా! అజయా!—

కల్యా—ఇదియంతయు నేమో నాకు తెలియుటలేదు. ఇది స్వర్గమా మర్త్యమా! వీరు దేవతలా మనుష్యులా! ఇది జీవనమా లేక మృత్యువా! నే నెవతెను? ఓహో—(మూర్ఛపడును.)

సత్య—కల్యాణీ! కల్యాణీ!

గోవిం—పిల్లచనిపోవుచున్నది. పోనిండు. మేమును వెంటనేపోదుము.—కొడుకు, కూతురు, నేను, మేవాడ—అందఱము ఒక్కసారిగనే పోదుము. కొడుకుపోయినాఁడు, కూతురుపోయినది, ఈమేవాడు- ప్రియమైన నా మేవాడు—అదియు మునిగిపోవుచున్నది. మునిగిపోవుచున్నది - అదిగో! మునిగినది! కానిండు —నేనును పోవుచున్నాను. (పిచ్చివానివలె పరుగెత్తుచుపోవును.)

సత్య—అంతయు పూర్తిఅయినది. ఇంక ప్రళయమే కావలయును.

---

## చతుర్థ దృశ్యము

స్థానము— మేవాడులో ఒక పర్వతప్రాంతమున మహాబత్ఖానుని శిబిరము.

సమయము—సాయంకాలము.

(మహాబత్ఖాను డేరాకు వెలుపల నిలఁబడి పర్వతముపై అస్తమింపఁబోవు సూర్యుని కిరణములు చూచుచుండును.)

మహా—పద. అస్తమయమైనది.

(గజసింహుఁడు ప్రవేశించును.)

గజ—ఖాన్‌సాహబ్!

మహా—రండు మహారాజా!

గజ—తాము విజయముఁ బడసినను తమ సైన్యముతో ఉదయపుర దుర్గమున నింక నేల ప్రవేశింపలేదు.

మహా—మహారాజుగారు ఆవిషయము నన్నిపుడు విచారింపుచుండిరా?

గజ—లేదు. నేను ఊరక అడిగితిని. ఖాన్‌సాహెబ్! ఈమారు మేవాడులో స్త్రీలుకూడ ఖడ్గము ధరించిరంటగదా!

మహా—స్త్రీలు ఖడ్గము ధరించిరా!—స్త్రీలా?

గజ—అవును. స్త్రీలు. వారెట్లు యుద్ధము చేసెదరో చూతము. ఈమారు యుద్ధములో కొంత కోమలత్వము గనుపట్టును. నేనును ఈ యుద్ధమునకు వచ్చెదను.

మహా—మహారాజా! రాజపుత్రులయ్యు మీరు రాజపుత్రస్త్రీలనిట్లు పరిహాసింపు చుంటిరా! మీరు నిజముగ రాజపుత్రులేనా? కాదు.

గజ—ఖాన్‌సాహెబ్!

మహా—పొండు, పొండు. మీయీ పరాక్రమము మీదేశమునకై అట్టిపెట్టుకొనుఁడు. ఎప్పుడేని పనికివచ్చును.

[గజసింహుఁడు పోవును.]

మహా—ఈమహాత్ములే హిందూధర్మపతాకను ధరించెదరు. హిందువులారా! మీరు మీదేశమును పోఁగొట్టుకొనుటయే కాక దానితోపాటు మీమనుష్యత్వమును గూడ పోఁగొట్టుకొంటిరి.

[ఒకభటుఁడు ప్రవేశించును.]

మహా—ఏమి సమాచారము?

భటు—శాహజాదాసాహెబు సైన్యముతో దయచేసిరి?

మహా—వచ్చినారా? మంచిదిపొమ్ము.

[భటుఁడు వెళ్ళును.]

మహా—ఇంక సైన్యము తీసికొనివచ్చుట కవసరము లేదు. మేవాడ విధ్వంసమును నేను పూర్తిచేసితిని. అయితే మొగల సైన్యము దీసికొని ఉదయపురదుర్గమున ప్రవేశించుటకు నే నిష్టపడుటలేదు. ఆపని శాహజాదాసాహబ్ — మొగలులు చేసికొందురుగాక! నాపని యింతటితోనే ముగిసినది.

[గోవిందసింహుఁడు ప్రవేశించును.]

మహా—మీరెవరు?

గోవిం—నేనొక మేవాడుసర్దారును.

మహా—ఇచ్చటికేలవచ్చితిరి?

గోవిం—చెప్పెదను. కొంచె మూపిరి తీసికొననిమ్ము.

మహా—రాణా అమరసింహుఁడు మిమ్ము సంధిచేసికొనుటకై పంపెనా?

గోవిం—అట్లగుటకుముందు నాపై వజ్రపాతమగుగాక!

మహా—ఇంక మీరేమికోరుచున్నారు?

గోవిం—నేను చావఁగోరుచున్నాను. నేను మిక్కిలి వృద్ధుడనై తిని. చావఁగోరుచున్నాను. నేను యుద్ధముచేసి చావఁగోరుచున్నాను. సామాన్య భటునితోఁగాదు. నీతో యుద్ధముచేసి నీచేతిలో చావఁగోరుచున్నాను.

మహా—మీకు పిచ్చి యెక్కలేదుగదా?

గోవిం—లేదు మహాబత్! పిచ్చిలేదు. నీవు ఎఱిఁగియుండవచ్చును. ద్వంద్వయుద్ధమున నిన్ను వధించుటకు వచ్చితిని— ఈశ్వరా! నా యందిపు డంతశక్తియేయున్నచో! లేదు, మహబత్ఖాన్! నేడు ద్వంద్వయుద్ధమున నిన్ను గెలువఁజాలనని యెఱుఁగుదును. కాని చావఁజాలుదును. నేను నీచేతులలో చావఁజాలుదును.

మహా—ఇదిచాల అద్భుతమగు కోరిక.

గోవిం—ఇందులో అద్భుతత్వమేమియులేదు. నేను స్వర్గీయ రాణా ప్రతాప సింహుని యొద్దనుండి దాదాపు పదుబది యుద్ధములు చేసితిని. నా శరీరమందలి శస్త్రచిహ్నములకు లెక్కలేదు. ఇప్పు డంతిమచిహ్నము నీ శస్త్రముచే కావలయును.

మహా—దీనిచే మీకేమి లాభము?

గోవిం—విశేష లాభమేమియు లేదు. కాని మతముచే మునల్మాను వయ్యును జాతిచే హిందువవు. మఱియు రాణాప్రతాప సింహునకు సోదర పుత్రుడవు. కనుక నీచేతిలో చచ్చుటలో కొంచెము గౌరవమున్నది.

మహా—మీరు సాలుంబర ప్రభువులగు గోవిందసింహులా?

గోవిం—హా హా హా! గుర్తించితివా మహాబత్ఖాన్? నేను నీచేతిలో నెందుకు చావఁగోరితినో ఇప్పుడు తెలిసికొంటివా? మహా బత్ఖాన్! నేడు నీవు మేవాడు గెలిచితివి— మేవాడును ధ్వంసముచేసితివి. అయినను నిన్ను ఉదయపుర దుర్గమునఁ బ్రవేశింపనీయను. మేవాడులో ఇప్పుడు సేనలేదు. ఇప్పుడు నీవు యుద్ధముచేయ నక్కఱలేదు. నేను మేవాడుకు అంతిమ వీరుఁడను. నేడు నేనొక్కఁడనే మొగలులను ఉదయపుర దుర్గమునఁ జొరనీయకుండుటకు నిలఁబడితిని. నాప్రాణములుండగ మీ రీ దుర్గమునఁ బ్రవేశింపఁజాలరు. శస్త్రము పట్టుఁడు. [కత్తిదూయును.]

మహా—వీరాగ్రణీ! నే నీదుర్గమున ప్రవేశింపనే కోరుటలేదు.

గోవిం—నీవుకోరినను కోరకున్నను నాకు రెండును ఒకటే. శస్త్రము పట్టుము.

మహా—వినుఁడు—

గోవిం—కాదు కాదు. నేనేమియు వినఁగోరుటలేదు. నాహృదయమున అఖండాగ్ని జ్వలించుచున్నది. నాకొడుకు పోయినాడు. కూతురు పోయినది. ఇంక నేను చావఁగోరుచున్నాను. స్వతంత్రమగు నామేవాడు మ్లేచ్ఛపద దళితమగుటను చూచుటకు మున్న నేను చావఁగోరుచున్నాను. అల్లుఁడయ్యును నాపుత్రుని చంపినవాఁడును, నాదేశమునకు సంతానమయ్యును పరులకు బానిసయు, నాజాతివాఁడయ్యును ముసల్మానును, నారాజునకు సోదరుడయ్యును, ఆయనకు పరమశత్రువును అగువాని చేతిలో చావఁగోరుచున్నాను. మహాబత్! శస్త్రముపట్టుము.

మహా—(ఖడ్గముపట్టుకొని) మీరు శాంతింపుఁడు. నేను మిమ్మెన్నటికిని చంపను.

గోవిం—నే నేమియువినను. కాచికొనుము.

మహా—గోవిందసింహాజీ!—

గోవిం—నన్నువధింపుము. వధింపుము.

మహా—నేనుశస్త్రము క్రిందపెట్టుచున్నాను.

గోవిం—మహాబత్! నేను నిన్నువిడువను. శస్త్రముపట్టుము. నేనునేఁడు చచ్చుటకువచ్చితిని. తప్పక చచ్చెదను. శస్త్రముపట్టుము. నేను విడిచిపెట్టను.

[గోవిందసింహుఁడు కలియఁబడఁబోఁగా గజసింహుఁడు వెనుక వచ్చిఅతనిపైతుపాకిపేల్చును. గోవిందసింహుఁడు పడిపోవును.]

మహా—ఇదియేమి? మహారాజా! ఇటుచేసితిరేమి?

గజ—వీనిని చంపివేసితిని.

మహా—ఈయన యెవ్వరో మీరెఱుఁగుదురా?

గజ—ఎందుకు? ఎవ్వఁడో తస్కరుఁడుకావచ్చును.

గోవిం—దొంగను నేనుకాను. దొంగలుమీరు. ఒకలరాజ్యమును దోఁచుకొనుటకు నేను రాలేదు. మీరువచ్చితిరి. మహాబత్ఖాన్! పొమ్ము. ఉదయపురము పొమ్ము. ఇప్పుడు నిన్నెవ్వరు నడ్డగింపరు. నీతల్లినిపట్టుకొని మొగలులకు దాసినిచేయుము. పుత్రుని కర్తవ్యము నెరవేర్పుము. అజయా!—కల్యాణీ!—(గిలగిల కొట్టుకొని చనిపోవును)

---

## పంచమదృశ్యము.

స్థానము—ఉదయపురదుర్గమున కెదురుగ రాజమార్గము.

సమయము—రాత్రి

[దుర్గరక్షకుఁడగు నొకరాజపుత్రభటునితో కొందఱు పురవాసులు మాట్లాడుచుందురు.]

౧—ఏమయ్యా! మనమహారాజు నేఁడు కోటనుండి బయటికేల వెళ్లిరి?

భటుఁడు—ఎందుకు వెళ్ళిరో తెలియదు. కాని మహాబత్ఖాను మేవాడుతోడి వైరమును ఆపి బాదుషా కొకజాబు వ్రాసి పంపెనని వింటిని. కనుక నే ఈనాఁటు శాహజాదాఖుర్రమ్ యుద్ధమునకు వచ్చినాఁడు. ఒక మొగలదూత శాహజాదా యొద్దనుండి జాబు తెచ్చినాఁడు. ఆజాబులో ఆయన రాణాతోడి మైత్రిని కోరినట్లు వ్రాసెనఁట! మొగలదూత వెళ్ళిన మరునాఁడు—నేఁడు ఉదయమున రాణాగారు గుఱ్ఱమెక్కి శాహజాదాశిబిరమునకు పోయిరి.

౨—తర్వాత ఏమయ్యెను?

భటు—తర్వాత నేమయ్యెనో తెలియదు.

౩—రాణాగారు ఇంక తిరిగి రాలేదా?

భటు—లేదు.

౪—ఆయనతో మఱి యెవ్వరు వెళ్ళిరి?

భటు—ఎవ్వరును లేరు. వారు ఒక్కరే వెళ్ళిరి.

౧—చూడుము. వారెవరు?

౨—రాణాగారు కాదుకద?

౩—కాదు. వీరు రాణాగారుగా లేరు.

౪—వేషము రాజవేషమే. (భటునితో) ఏమయ్యా! ఈయనయెవరో నీ వెఱుఁగుదువా?

భటు—ఈయన జోధపురము మహారాజు, గజసింహుడు.

౧—మహాబత్ఖానుతో మేవాడు పైకి దండెత్తి వచ్చిన ఆయనయే కాము!

భటు—అవును.

౨—ఈయన రాజపుత్రుఁడేనా?

౩—రాజపుత్రుఁడయ్యును రాజపుత్రులకు శత్రువు.

[చాల సైనికులతో గజసింహుఁడు ప్రవేశించును.]

గజ—(భటునితో) కోటదర్వాజా మూసియున్నదా?

భటు—అవును మహారాజా.

గజ—ద్వారము తెరువుము. ఇప్పుడు కోటమాది.

భటు—మహారాజా! మాప్రభువుల ఆజ్ఞలేక నే నీ ద్వారము తెరువఁజాలను.

గజ—ప్రభువుల ఆజ్ఞయా? ఇప్పుడు మీ ప్రభువు అమరసింహుఁడు కాడు. మీప్రభువును నేను.

భటు—తమరా? నాకు తెలియలేదు. అయినను రాణా అమరసింహుని ఆజ్ఞలేక నేను కోటద్వారము తెరువఁజాలను.

గజ—(తన సైనికులతో) వీనియొద్దనుండి తాళముచెవి లాగికొనుఁడు.

భటు—ప్రాణముండఁగ మీరు లాగికొనఁజాలరు. (కత్తిదూయును)

గజ—మంచిది, వీనిని చంపుఁడు.

౧—(అన్యపౌరులతో) చూచెద రేల? చంపుఁడు.

[అందఱును గజసింహునిపై కలియఁబడుదురు.]

గజ—వీరులారా—

[గజసింహుని సైనికులు పౌరులపైఁ గలియఁబడుదురు. ఇంతలో కొందఱు మొగల సైనికులతో అమరసింహుఁడు ప్రవేశించును.]

రాణా—సైనికులారా! శస్త్రములు దింపుఁడు.

[మొగల సైనికులజూచి రాజపుత్ర సైనికులు శస్త్రములు క్రిందనుంచెదరు.]

రాణా—గజసింహ మహారాజా! ఇచ్చట మీకేమిపని?

గజ—మీ మీదుర్గమున బ్రవేశింపఁ గోరుచున్నాము.

రాణా—రాజాతిథీ! రాణా అమరసింహుఁడు నీకుతగిన సత్కారము చేయును. ఓసీ మొగలుఁలకుక్కా! ఇదిగో! నీకుతగిన గౌరవము. (గజసింహుని తన్ని క్రిందపడద్రోయును.)

రాణా—సైనికులారా! దుర్గద్వారము తెఱవుఁడు. (ద్వారము తెఱచిన పిమ్మట మొగల సైనికులతో) ఇంక మీరు వెనుకకు వెళ్ళిపోవచ్చును.

(రాణా కోటలో ప్రవేశించెదరు. ద్వారము మూయఁబడును.)

## షష్ఠదృశ్యము

### స్థానము:— మేవాడు పర్వతమార్గము

### సమయము— సాయంకాలము.

[సత్యవతి, అరుణసింహుఁడు, కొందఱు చారణులు.]

చారణులు పాడుదురు

ఇపుడు మేవాడాద్రిశిఖరం బెట్టిజెండా తలధరింపదు
అపరిహార్యపు దుస్థితినిగన నంధకారము గ్రమ్మకనులకు.

౧ నాసుఖస్వప్నమ్మహో యెను నాదువీణాతంత్రియుం దెగె
గాసిచెందిన మాతృభూమిను గానమేమియొనర్తునీయెడ.

౨ అతులమేవాడాద్రి సోయగమంతయును నంతమ్ము నొందెను
అతికఠోరపు వజ్రపాతం బౌర! దీని హతమ్ముజేసెను.

౩ వననికుంజములందు నీయెడ వినఁబడదు ఖగమధురగీతము
ఘనమరందము గ్రోలు మధుకరగణముచేరదు కుసుమజాతము.

౪ చందురుఁడు శోభావిహీనత నందె మలయానిలము వీవదు
క్రిందుకొన వైకల్య మిరుదరులందు నదియును వడిగఁబాఱదు

౫ కాననములువిషాదయుతములు గ్రామములుజనతారహితములు
మానచింతాన్వితులు పౌరులు మలినములు శూన్యములు
గృహములు.

౬ రాజపుత్రభటాళికరముల రాజిలదు కరవాల మీయెడ
తేజరిలవు మనోజ్ఞ భూషాదికము పడతుల యొడలు లందున.

౭ అంధకారమ్ములమెనెల్లెడ నయ్యెసుఖసర్వస్వనాశముబంధురంపు
యశమ్ము పాడుచు వందులోదార్పగఁ దొడంగిరి

౮ పోవుఁగాక సుఖంబులన్నియు పూర్వయశమును చారణుల్
భావమలరఁగఁ బాడునెడ మేవాడుసేయు ప్రతిధ్వనిన్.

[ముగ్గురు సైనికులతో హిందాయత్ఖాను ప్రవేశించును.]

హిందా— ఎవరుమీరు?

సత్య— నేను చారణిని.

హిందా— నీవు పర్వతమార్గములందీ గీతమునే పాడుచు తిరుగుచుందువా?

సత్య— అవును. గీతముపాడుటయే నాయుద్యోగము.

హిందా— నీవింక నీగానమును పాడఁగూడదు.

అరు— ఏమిసైనికా?

హిందా— నేఁడు ఈదేశము మీదికాదు. ఇది మొగలులది.

సత్య— మొగలులకునై. మేవాడు స్వతంత్రముగా నున్నంతకాలము మేము యుద్ధము చేసితిమి. కాని మేవాడు తలవంచుకొని మొగలుల ప్రభుత్వమును స్వీకరించినపుడు మాకు మొగలులతో నెట్టి వివాదమును లేదు. కాన మేమిపుడు ఏడ్వను గూడ వలనుగాదా? మొగల సిఫాయి! ప్రపంచమున నెల్లరును తమతల్లిని ప్రేమించెదరు. అట్టిచో హతభాగ్యులగు మేవాడు వాసులే ప్రేమింపఁగూడదా?

హిందా— కాదు, మీ రీ గీతమును పాడఁగూడదు.

అరు— మేము పాడుకుము. ఎవ్వరడ్డగింతురో చూతును. పాడుమమ్మా!

హిందా— ఈ గీతము పాడుచో మీరు కైదు చేయఁబడుదురు.

సత్య— కైదుచేయుము సిఫాయి! మమ్ములను కైదు చేయుము. మేము మీచీఁకటి చెఱసాలలోనుండి మా యీదుఃఖగీతమును పాడుకొందుము. పాడుము కుమారా!

హిందా— మంచిది. అగుచో మిమ్ములను కైదు చేసితిని.
(ముందుకు వచ్చును.)

అరు— ఖబర్దార్! (కత్తిదూసి) ప్రాణముపై తీపియున్న మాయమ్మను ముట్టకుము.

హిందా—ఓరీ దుడుకుపిల్లఁడా! కత్తి యెక్కడ పెట్టుము.

అరు—పెట్టించుము.

హిందా—భటులారా! కలియఁబడుము.

[సైనికులు అరుణునిపైఁ బడుదురు. అరుణుఁడు యుద్ధము చేయును.]

సత్య—సెబాసు కుమారా! నీతల్లిని రక్షింపుము.

[ఒకసైనికుఁడు భూమిపైఁబడును.]

సత్య—సెబాసు కుమారా! ప్రాణముండగా శస్త్రము విడువకుము. ఇదియే నేఁగోరునది. ఓహో—ఏమిఆనందము!

[హిందాయత్ఖాను సైనికులును అందఱు నొక్కమాఱుగ అరుణునిపైఁ గలియఁబడుదురు. అరుణుఁడు యుద్ధముచేయుచుండును. సత్యవతిపుత్రుని ఆసన్నమరణునిగా నెంచి క్షణకాలము కనులుమూసికొనును. ఇంతలో మహాబత్ఖాను వెనుకనుండి వచ్చును.]

మహా—హిందాయత్ఖాన్! శాంతించుము.

[అందఱు నిశ్చేష్టులై నిలఁబడుదురు.]

మహా—హిందాయత్! నీకు లజ్జలేదా! ఇందఱు సైనికులు ఒకబాలునిపైఁ గలియఁబడిరి. అంతతో నాగక నీవును కత్తి పట్టితివా? ఛీ!—వత్సా! ప్రాణములను సరకుగొనక తల్లిని రక్షించితివి! నీవు ధన్యుఁడవు. జీవితము సఫలముచేయు మార్గమిదియే. వత్సా! చిరంజీవివి కమ్ము.

[సత్యవతి హృదయమున చేతులుంచుకొని సాభిమానమగు నానందముతో నరుణుని చూచును. తర్వాత మహాబత్ఖాను వైపునకు రెండడుగులు నడిచి వెనుకకు తిరిగి తలవంచుకొనును. మహాబత్ఖాను సత్యవతి వంక చూచుచుండును.]

మహా—అక్కా! నీకేమని చెప్పుదును. నిన్ను "అక్కా" యని పిలుచుటకును నాకధికారములేదు. ఇంక నేమి చెప్పుదును. నన్ను క్షమించుము—అక్కా!

సత్యా—ఈశ్వరా!—ఏమిచేసితివి! నాతమ్ముఁడు నన్ను 'అక్కా' యని పిలుచుచున్నాఁడు. అయినను వానిని కౌఁగిటఁ గుదిచ్చెడు భాగ్యము నాకు లేదుగదా!

అరు—ఈయన యెవరు అమ్మా?

సత్య—ఈయన మొగలసేనాపతియగు మహాబత్ఖాను.

మహా—నేను నీమేనమామను.

సత్యా—రమ్ము వత్సా! మనము పోదము.

మహా—ఎక్కడకు పోదురు? నన్ను క్షమించిపొండు.

సత్యా—నీవేమి పాపముచేసితివో ఎఱుఁగుదువా మహాబత్ఖాన్?

మహా—ఎఱుఁగుదును. నేను నాచేతులతో నాయింటికి నిప్పుపెట్టుకున్నాను. పైశాచికానందముతో పైకెగయుదాని ధూమరాశిని చూచితిని.

సత్య—ఇంతయేనా?

మహా—ఇంక నేమి?—ముసల్మానుఅయితిననియా? అదిపాపకార్యమని నే నొప్పుకొనను. ఎవ్వరికి దేనిపై విశ్వాసముండునో ఆవిధమున నడువ స్వతంత్రుఁడు, గాన—

సత్య—మంచిది. రమ్ము. వత్సా!

మహా—ఆగుఁడు. అక్లేయయ్యును అది మనుష్యహృదయమునందలి కోమల ప్రవృత్తినంతయు నణఁచునంతటి ఘోరపాపమా? అక్కా! నారీహృదయము పవిత్రతకు తపోవనమును, ఆత్మత్యాగమునకు లీలాక్షేత్రమును, ప్రేమకు నందనవనమును అని ఎఱుఁగుదును. కాని ఆచారనియమములు ఇట్టి నారీహృద

యమును పాషాణమయముగాఁ జేయునంతటి కఠోరములా? ఒక్కనిమేషమాత్రము నీవు హిందువనియు, నేను ముసల్మానువనియు, నీవు పీడితవనియు, నేను ఘాతుకుఁడననియు మఱచి పొమ్ము. పరిశుద్ధమనముతో నీవును నేనును ఒకేమనుష్యులము. నీవు అక్కవు నేను తమ్ముఁడను అని ఊహింపుము. నన్ను చంక నెత్తుకొని నాచుబుకమును ముద్దుగొనుచు తిరుగు నాబాల్యకాలమును స్మరింపుము. మనమిద్దఱము తల్లిలేని ఆ సోదరీ సోదరులమే అని తలంపుము—అక్కా!

సత్య—ఈశ్వరా!—

మహా—అక్కా!—

సత్య—ఇంక సహింపఁజాలను. ఏదికావలెనో అదిఅయినది. నీవు నాతమ్ముఁడవే. పొమ్ము. నీతప్పులన్నిటిని క్షమించితిని. పొమ్ము తమ్ముఁడా! నీవు నాయెదుట మొగలసేనాపతియగు మహాబతాన్ఖానువుకావు. నీవు కేవలము నాతమ్ముఁడగు మహీపతివే—పొమ్ము తమ్ముఁడా!

మహా—నేను నల్లేవచ్చితిని అక్కా! (నమస్కరించును)

సత్య—ఆయుష్మంతుఁడవుకమ్ము తమ్ముఁడా!—రమ్ము కుమారా!

హిందా—ఎక్కడకుపోదువు? నేను నిన్ను ఖైదుచేసితిని.

మహా—నాసమక్షమున నాసోదరిని ఖైదుచేయుట కెవ్వనికిని తరముకాదు—పొమ్ము అక్కా!

హిందా—నీవిపుడు సేనాపతివికావు మహాబత్ఖాన్!—నే నిపుడు నీ మాటను వినను. ఇపుడు సేనాపతి శాహజాదాఖుర్రమ్.

[శాహజాదా ప్రవేశించును.]

శాహ—మంచిది. అయితే నేను స్వయముగ ఆజ్ఞాపించుచున్నాను. వెళ్ళుమమ్మా! నిర్భయముగ పొమ్ము.

హిదా—శాహజాదాసాహబ్! ఈమె కొండఘాటీలందు రాజద్రోహకరములగు గీతములఁ బాడుచు తిరుగుచున్నది.

శాహ—నేను దూరమునుండి ఆగీతము వింటిని. అదియొక నిరాశామయమగు గంభీరదుఃఖగానము.

హిదా—దీనిచే రాజ్యమున అశాంతి గలుగును శాహజాదాసాహబ్.

శాహ—ఆ యశాంతిని నివారించు తెరవు మొగలచక్రవర్తి యెఱుఁగును. హిదాయత్ఖాన్!—మేవాడునందే కాదు సమస్తభారతవర్షమందును ఏ సంతానమును తనతల్లిని ఈవిధముగ గానము చేయుట చేతనే ఈ విశాల మొగలసామ్రాజ్యము శీతకాలపు మబ్బువలె పటాపంచలగుచో కానిమ్ము. మొగలసామ్రాజ్య మట్టి యిసుకదిబ్బపై ప్రతిష్ఠింపఁబడినదికాదు హిదాయత్ఖాన్! ఆసామ్రాజ్యము భారతీయుల గాఢప్రేమపై ప్రతిష్ఠింపఁబడినది. మొగలు చక్రవర్తి న్యాయసంగతమును, భక్తిపవిత్రమునగు మాతృపూజ కెన్నఁడును బాధకలిగింపఁడు. దానికై ఈ సామ్రాజ్య మీయవలసి వచ్చినను ఇచ్చివేయును. తెలిసినదా హిదాయత్?

హిదా—చిత్తము శాహజాదా!

శాహ—పాడుమమ్మా! నీ వాగానము పాడినందుకు విచారము లేదు. నేఁడు మేవాడులో అట్టిగానము వినువారెవ్వరును లేరని యే విచారము. పాడుమమ్మా! ఏమియు భయము లేదు. నేను విందును. నేను మీదేశపు పూర్వమహిమను విని కన్నీరుకార్చుట యెఱుఁగుదును.—పాడుమమ్మా! పాడుఁడు బాలకులారా! నేనును మీతోఁ కలిసి పాడుదును. పాడుము హిదాయత్! పాడుఁడు సైనికులారా! [అందఱు పాడుచు పోదురు.]

సప్తమదృశ్యము.

స్థానము - ఉదయసాగర తీరము.

సమయము - సాయంకాలము.

(మానసి ఒంటరిగా ప్రవేశించును.)

మాన—నామీఁదుగా నొకతుపాను పోయినది. మృదుమధురమగు ఆ యనాది సముద్ర సంగీతము మరల వినఁబడుచున్నది. అది పూర్వముకన్న చాల మధురముగ నున్నది. మబ్బులు విడిపోయినవి. ఆకాశమున నక్షత్రోజ్జ్వలమగు ఆనీలిమ మరల కనుపట్టుచున్నది. చాల నిర్మలముగనున్నది. నాకర్తవ్యమార్గము నేఁడు క్షుద్రములగు జీవన సుఖదుఃఖముల పరిధిని విడిచిఁ బహుదూరము వ్యాపించినది.

(కల్యాణి ప్రవేశించును.)

మాన—ఎవరు? కల్యాణియా?

కల్యా—అవును రాజకుమారీ!

మాన—ఇంకను రాజకుమారియేనా? ఇప్పుడు మనకు నూతన బంధుత్వమేర్పడినదికదా! — ఏల ఏడ్చెదవు కల్యాణీ! ఛీ!

కల్యా—ఇంక దుఃఖింపను. కాని సోదరీ!— సహింపఁజాలను. కనుకనే నేఁడు నీయొద్దకు వచ్చితిని. నన్నోదార్పుము.

మాన—నీదుఃఖమునంతయు నాకిమ్ము. నాసుఖము నీవు తీసికొనుము కల్యాణీ!

కల్యా—నీసుఖమా?

మాన—అవును. నాసుఖము. నాకు దుఃఖములేదు వినుము.

సీ॥ నను బట్టిహింసింప ♦ ఘనమైనయాశతో
జెంతకుఁ జేరె దు♦రంతదుఃఖ
మైన నన్బాధింపఁ♦గా నోపదయ్యె నె
ప్పటికిని బాధింపఁ♦ బడనుజుమ్ము

ఘాతుకజంతువు ♦ కరణిదుఃఖమును నా
వశమునసుంచుదు ♦ పనులుగొందు
అతులోపకారంబు ♦ నమరించె దుఃఖము
నాకుఁబూర్వం బిప్పి♦నాళ్ళనుండి
గీ॥ సౌఖ్యరాజ్యంబునందలి ♦ చనువుచేసి
దుఃఖరాజ్యంబునన్ భీతి ♦ దోఁచుచుండె
బళిర దుఃఖరాజ్యమె నేఁడు ని♦వాసమయ్యె
శత్రువుం బ్రాణమిత్రుని ♦ సలిపికొంటి.

ఇంతదనుక అపూర్ణముగనున్న నాజీవితము నేఁడు పూర్ణమైనది.

కల్యా—సోదరీ! నీవుధన్యురాలవు.

మాన—నీవును ధన్యురాలవుకమ్మ కల్యాణీ!

కల్యా—ఎట్లుసోదరీ?

మాన—నా పనులకు సాయము చేయుచుండుము. రమ్మా. మనమిద్దఱము మానవకల్యాణమునకై జీవిత మర్పణము చేయుదము. నీ కల్యాణి నామము సార్థకమగుఁగాక! నాకుసాయము చేయుదువా?

కల్యా—చేయుదును.

మాన—మంచిది. నీకు శాంతిగలిగినదో లేదో చూచుకొనుము. ఈవ్రతము పట్టినవారికి ఇంకదుఃఖమెక్కడిది?

కల్యా—మంచిది. నానిష్ఫలప్రేమ ఇందుసార్థకమగుగాక!

మాన—నీవు మహాభక్తాను ఇప్పటికిని ఏవగింపుతో జూచుచుంటివా?

కల్యా—సోదరీ! నాఁడు అభిమానముతో ఆయనను ధిక్కరించి వచ్చితిని. కాని ఆయనను ఏవగించుటకు నాయందు శక్తి లేనట్లు తెలియుచున్నది. బాల్యమున ఎవ్వని ధ్యేయునిగాఁ జేసికొని పెద్దదాననైతినో, యౌవనమున ఎవ్వనిజీవితమునకు ధ్రువనక్షత్రముగాఁ జేసికొని చరించితినో, ఇప్పుడీ నిరా

శాంధకారమున ఎవ్వనిచింత రావణాసురునిచితివలె హృదయమున నిరంతరము జ్వలించుచున్నదో,—వానిని ఏవగింపఁ జాలను. అది కేవలము మాటమాత్రమే.

మాన—కల్యాణీ! దానియవసరము లేదు. పోనిమ్ము. నీవు నీప్రేమను మానవజాతియందు ప్రసరింపఁ జేయుము. శాంతినొందుదువు. విశ్వప్రేమ ప్రతిఫలమునుగోరదు. యోగ్యతా యోగ్యతలను విచారింపదు. సేవవలననే అది సుఖము వడయును.—

సత్యవతి—(ప్రవేశించి) మానసీ! మీనాయనగారు నిన్ను పిలుచుచున్నారు.

మాన—నాయనగారు తిరిగివచ్చిరా?

సత్య—అవునుఅమ్మా!

మాన—మొగలులతో సంధిజరిగినదా?

సత్య—లేదు. శాహజాదా ఖుర్రమ్ రాణాగారికి మైత్రిని కోరుచు వ్రాసిన యుత్తరము విశ్వసనీయము కాదని రాణాగారు గ్రహించిరి. అదియొక గగనకుసుమము. ఒకమృగమరీచిక.

మాన—ఎందుకుఅమ్మా?

సత్య—(కొంచెము ఆగి) మానసీ! మైత్రి యెపుడును సరిసమానులకే కలుగును. పీవునకును కాలితాపునకును నెయ్యమెన్నఁడును కుదురదు. జయధ్వనికిని ఆర్తనాదమునకును పొత్తు కుదురదు. రాణా కోటనుండిబయటికివచ్చి బాదుషా ఫర్మానాను గైకొనవలయునని శాహజాదా కోరుచున్నాఁడు. మానసీ! రాణా ప్రతాపసింహుని పుత్రునకు ఈ అవమానముకన్న మరణము మేలు.

మాన—నాయనగారేమి చేసిరి?

సత్య—వారు నేఁడు సామంతుల నెల్లర రావించి తమపుత్రు సింహాస
నాధిష్ఠితునిఁ జేసి రాజ్యభారమునుండి విముక్తులైరి. వారింక
రాణిగారితో కూడ రాజ్యమును విడిచి అడవులందు నివసించె
దరు.—నేఁడు మేవాడుపతనమైనది మానసీ!

మాన—కాదు అమ్మా! మేవాడుపతనము నేఁడు ప్రారంభము
కాలేదు. అది ప్రారంభమయి చాలకాలమయినది. నేటిది ఆ
పతనపరంపరలోని ఒక గ్రంథిమాత్రమే.

సత్య—ఈపతన మెప్పటినుండి ప్రారంభమయినది మానసీ?

మాన—ఏనాఁడు మేవాడకనులకు గంతికట్టుకొని గుడ్డియై ఆచారము
నూఁతగాఁగొని నడువఁదొడఁగెనో, ఏనాఁడు అది యోజనాశక్తిని
గోల్పోయెనో నాటనుండియే దానిపతన మారంభమయినది.
ప్రవాహము పాఱుచున్నంతకాలము జలము శుద్ధముగ నుం
డును. ప్రవాహము కట్టుబడిననాఁడు అందు పురుగులు పడును.
కనుకనే ఈజాతియందు నేఁడు ఈనీచ స్వార్థపరత్వము, క్షుద్ర
త్వము, భ్రాతృద్రోహము, విజాతివిద్వేషము నుత్పన్నము
లయినవి. ఆ మహోదారమగు హిందూధర్మము నేడు నిర్జీ
వమ్మై, ఆచారశల్యావశిష్టమై యున్నది. దేని స్వధర్మము నశిం
చెనో దానిపతనము కాకయుండునా? జాతియం దేపాపము
వ్యాపించినదో దానిని విచారింపక 'మేవాడుపోయినది' అని
దుఃఖించిన నేమిలాభమమ్మా?

సత్య—ఈదుఃఖమున కిదియొక యౌదార్యగాదా?

మాన—కాదు. అంతకంటెను గొప్పయౌదార్యగలదు. మేవాడు
పోయినఁ బోనిమ్మా. మాకంతకంటెను గొప్పసంపద గలుగుఁ
గాకయని యాసించుటయే గొప్పయౌదార్యం. నా సోదరులు
నైతికబలసంపన్నులై దుఃఖమందును, నిరాశా ఘోరాంధ
కారమందును, ధర్మమునే జీవయాత్రకు ధ్రువనక్షత్రమునుగాఁ

జేసికొని చరింతురు గాకయని నేను కోరుచుందును. అట్లు కానినాఁడు వారు నాశనమైనను నేను చింతింపను.

సత్య—సోదరులు నశింపుచుండ నిలఁబడి చూచుట యుచితమా!

మాన—లేదు, ప్రాణములిచ్చి వారిని రక్షింపుము. అప్పటికిని సఫలులము గాకున్న చింతింపఁ బనిలేదు. ఈశ్వరుని శుభవిధానము నెరవేరుచుండును. స్వార్థముకన్న జాతీయాత్వమును, జాతీయత్వముకన్న మనుష్యత్వమును గొప్పవి. మనుష్యత్వమునకు విరోధియగు జాతీయాత్వము మనుష్యత్వమహాసముద్రమున మునిగిపోవును. మనుష్యత్వ శూన్యమగు దేశముయొక్క స్వాతంత్ర్యము నశించును.— ఆజాతి మఱల మనుష్యత్వమును బడయును.

సత్య—అది సంభవమా?

మాన—ఎందుకు కాదు. మనము సాధన చేయవలయును. గొప్ప సాధన యెన్నఁడును నిష్ఫలముగాదు. ఈజాతి మఱల మనుష్యత్వమును బడయును.

సత్య—ఎప్పుడు?

మాన—ఇదిగో వినుము.—

సీ॥ మూఢపూర్వాచార ♦ ములకు బానిసగాక
చింతనాశక్తి యో ♦ జించునాఁడు
ఎడతెంపులేకపా ♦ రెడు భావనా స్రోత
ములు వెండి యెడఁద ను ♦ ప్పొంగునాఁడు
ఉచితానుచితముల ♦ నూహించి నిర్భీతి
మించి యుచితమాచ ♦ రించునాఁడు
త్రోసిపుచ్చుచు పర ♦ దూషణ భూషణ
ముల నాత్మ సాక్షిగ ♦ మెలఁగునాఁడు

గీ॥ తరతరములుండి తముఁజేరు నూరు గతాను
గతికతన్ జీర్ణవస్త్రమ్ము కరణివీడి
హృదయహీనను దగ మేళగించునాఁడు
ప్రకటమగుఁజూవె నూత్నధర్మమ్ము ధరణి.

సత్య—మానసీ! ఏది యాధర్మము?

మాన—ఆధర్మము ప్రేమ. తన్ను విడిచి క్రమముగ సోదరుని, జాతిని, మానవుని, మానవజాతిని ప్రేమించుట నేర్చుకొనవలయును. పదపడి మనము చేయునదేమియు లేదు. అజ్ఞేయమగు ఈశ్వర విధానమే భవిష్యత్తును చక్కఁబఱచును. జాతీయోన్నతిపథము నెత్తుటేఱులమధ్య గోచరింపదు. అది కౌఁగిలింతలనడుమ గానవగును. వంగదేశపు చైతన్యస్వామి చూపించిన మార్గమున నడువుమమ్మా!—మనము నిచులము, స్వార్థపరులము, కుటిలులము నగుచో రాణాప్రతాపసింహుని నామమును జపించియును, అతీతగౌరవనిర్వాణప్రదీపమును దగ్గరనుంచుకొనియును, జీవితమెల్ల దుఃఖించియు నేమియు ప్రయోజనము లేదు.

(అందఱు నిష్క్రమించెదరు)

## అష్టమదృశ్యము.

### స్థానము—ఉదయసాగరతీరము.

### కాలము—సాయంకాలము.

[ఆకసమున మేఘములు కమ్మియుండును. రాణాఅమరసింహుడు ఒంటరిగ ప్రవేశించును.]

రాణా—మేవాడగగనతలము క్రోధముతో గర్జించుచున్నది. మేవాడపర్వతము లజ్జచే తలవంచుకొనినది. మేవాడ సరోవరము వ్యాకులతతో నోడ్డుకు కొట్టుకొనుచున్నది. మేవాడు కులదేవతలు రోషముతో పెడమొగము పెట్టిరి. నాచేతులలో నామేవాడు—రాణా ప్రతాపునిమేవాడు నేడు పతనము చెందినది. ఓహెూ! (పచారుచేయుచు) ఇదిగో మహబత్ఖాన్!

(మహబత్ఖాను ప్రవేశించును.)

రాణా—సలాము ఖాన్‌సాహెబ్!

మహ—మేవాడురాణాకు జై!

రాణా—మొగలసేనాపతీ! నీవు ఒక హత్యావిద్యయందే పండితుడవుకావు. పరిహాసము చేయుటయందును చాల సమర్థుడవు. "మేవాడు రాణాకు జై" మంచిది!

మహ—లేదురాణా! నేను పరిహాసము చేయలేదు.

రాణా—చేసినను చేయకున్నను వచ్చునదియు పోవునదియు లేదు—పోనిమ్ము. నే నొకపర్యాయము నిన్ను కలసికొనవలయునని కొంటిని.

మహ—సెలవీయుడు.

రాణా—ఎంతవినయము!—వినుము. నే నొకపనికై నిన్ను పిల్వనంపితిని. ఆపని నీవలననే కానగును.

మహా—ఆజ్ఞాపించుఁడు.

రాణా—మహాబత్ఖాన్! ఒక్కింత నావంక చూచి నాకు నీవేమికావల యునో చెప్పఁగలవా?

మహా—నేను మీసోదరుఁడను.

రాణా—సోదరునికి తగినపని చేసితివి. నీతాతముత్తాతల మేవాడును మొగలుల పాదాక్రాంతము చేసితివి. దాని హృదయరక్తముచే నీరెండుచేతులును రంజితములైనవి.

మహా—రాణాజీ! నేను బాదుషాచే పోషింపఁబడినవాఁడను.

రాణా—అది యెప్పటినుండి మహాబత్ఖాన్? పోనిమ్ము. నీపనినీవు చేసితివి. దానికై నీతో వాగ్వాదము చేయుట వ్యర్థము. స్వధర్మపరిత్యాగికిని, మొగలోచ్ఛిష్టభోగికిని ఈపని అనుచితము గాదు. నియమరహిత జీవితునకును ఉచ్ఛృంఖల స్వేచ్ఛాచార ప్రమత్తునకును ఇట్టిపని అనుచితముఁ కాదు. నీవు మేవాడు ధ్వంసముచేసితివి. అంతతో నీపని ముగియలేదు. దానితో పాటు మేవాడురాణాను కూడ అంతమొందింపుము. ఇదిగో! ఖడ్గము. (ఖడ్గమీయఁబోవును.)

మహా—రాణాజీ—

రాణా—మారుసెప్పకుము. వినుము నన్నువధింపుము. దానిచే నీకళంక మేమియు హెచ్చదు. నీ కప్రియమగు పనిచేయుటకును నేను చెప్పుటలేదు. నీవు నా నెత్తురుత్రావుటకై తత్తరపడుచుంటివని నేనెఱుఁగుదును. నీ యీ దక్షిణహస్తము నాహృత్పిండమును పెకలించుటకై అదరుచున్నది. ఇదిగో! నా హృత్పిండమును దీసికొనుము. నన్నువధింపుము.

మహా—రాణాజీ! మహాబత్ఖాను అంతనీచుఁడుకాఁడు. నేను మేవాడ భూమిని ఖడ్గముచే నరికియు, అగ్నిచే తగులఁబెట్టియు శ్మశా

నముచేసిన మాట వాస్తవము. కాని నేను అన్యాయయుద్ధము చేయలేదు. నేను న్యాయయుద్ధమునే చేసితిని.

రాణా—న్యాయయుద్ధమా! దీనిని న్యాయయుద్ధ మనుచుంటివా? మహాబత్? షష్టిపరిమేయ సేనావిశిష్టమగు నొక క్షుద్రరాజ్యముపై ఒకసామ్రాజ్యపు మహావాహినిపడుట; ఒక మినుగురుపై సముద్రతరంగపతనము; ఒక్క పసిపాపని ఆత్మపై ఘోరనారకీయ దుస్స్వప్నము! న్యాయయుద్ధమా! పోనిమ్ము— జయించితివి. ఇంక నిపని ముగింపుము. ఇదిగో! ఖడ్గము తీసికొనుము. ఈఖడ్గమును రాణాప్రతాపసింహుఁడు చనిపోవునపుడు నాకిచ్చుచు "దీని కవమానము కలిగింపకుమా" అని చెప్పిపోయెను. నేను దానికి అవమానము కలిగించితిని. ఆ యవమానము నారక్తముచే గడగఁబడుగాక!

మహా—రాణాజీ! మహాబత్ఖాను యోధుఁడుగాని వధికుఁడు కాఁడు.

రాణా—అగుచో యుద్ధముచేయుము. ఖడ్గము ధరింపుము.

మహా—రాణాజీ! నేను మేవాడుపైకి కత్తికట్టుట విరమించితిని.

రాణా—అదియెప్పటినుండి మహాబత్? కత్తిపట్టుము— కత్తిపట్టుము. నేఁడు మేవాడు శ్మశానమున మాతృశవమును బుజమున నిడుకొని నిన్ను ద్వంద్వయుద్ధమునకు పిలుచుచున్నాను.

మహా—రాణాజీ! వినుఁడు.

రాణా—నే నేమియువినను.

గీ॥ భీరు! మ్లేచ్ఛ! కులాంగార! ♦ భీరుఁడవయి
పోరునోనరింపు, మేనీవు ♦ భుజబలంబు
గాంచి భారతవర్షమ్ము ♦ కంపమందు
దాని నీయెడ నేఁజూడఁ ♦ దలఁచినాఁడ.

అస్త్రము గ్రహింపుము. నిన్ను విడిచిపెట్టను. అధమా! నరకకీటకమా! పిశాచమా!

ముకు— బందివిగానా! ఉన్మత్తుఁడుగా! (కత్తిదూయును.) జాగ్రత్త రాజా! భ్రాతృప్రేమమున మహాబల్లాళునకెన్నఁడేని ప్రతిద్వంద్వియున్నచో నిదియే—అయినను జాగ్రత్త!

(ఇద్దఱును కత్తులు దూయుదురు.)

రాజా— నేఁడు సోదరులమధ్య యుద్ధము జరుగుచున్నది. ఇట్టిది ప్రపంచమున నెవ్వరును చూచియుండరు. పృథ్వీపై ప్రళయమగుఁగాక!

[ఈసమయమున వెంట్రుకలు విరబోసికొని వస్త్రముజారుచుండ మానసి ప్రవేశించి ఇద్దఱిమధ్య నిలఁబడును.]

మాన— ఇదియేమి నాయనగారూ! ఇదియేమి! (మహాబల్లానువంక తిరిగి) శాంతింపుఁడు.

రాజా— తొలఁగిపొమ్ము మానసీ! ఈయుద్ధమున కాతంకము చేయకుము.

మాన— శాంతింపుఁడు నాయనగారూ! మీవాదమునకు కానున్న సర్వనాశమయినది. ఆసర్వనాశమును భ్రాతృరక్తముచే రంజితము చేయకుఁడు. ఈదుఃఖమునకు ఓదార్పు హత్యగాదు. దీనికి ఓదార్పు మరల మనుష్యుఁడగుట.

రాజా— మనుష్యుఁడగుటయా—అది యెట్లు మానసీ?

మాన— గీ॥ శత్రుమిత్రత్వభేదప్ర ♦ సక్తిమఱచి
నైజదైశికకలంకపం ♦ కమ్ము విశ్వ
ప్రేమజలమునఁ గడిగి ప్ర ♦ విమలమతిని
తిరిగి మానవత్వమ్ముసా ♦ ధింపవలయు.

పాడుఁడు చారణులారా! నేను మీకు నేర్పిన యాగీతముఁ బాడుఁడు—"క్రమ్మఱ మానవులగుడు"

(కాషాయాంబర ధారిణులగు చారణులు పాడుచుందురు. మానసియు వారితోఁ గలసిపాడును.)

## గీతము

౧ గాసివహింపఁగనేల మీరలిటు క్రిమ్మరమానవులగుడు
దేశముపోయిన దుఃఖములేదేదఁ దిరిగియు మానవులగుడు

౨ మీరేశత్రులిటు మీకుకాంగ నిఁక దూరగనేలా యొరులన్
ఆరయదోషము లన్నియుమీవవి యగుఁడీ మనుజులు మరలన్

3 ప్రకృతకాలమిటు లాశా రహితంబయి పోయినఁబోవున్
ఇఁకనేనియు మీరొండురులను బ్రేమింపుఁడు సోదరులంచున్

౪ ఈతఁడు నా వాఁ డీతఁడు పరుఁడని యెంచక భేదంబెదలన్
బ్రీతి జగంబే మాగృహమనుకొని వెండియు మానవులగుఁడు

౫ ఉన్నతహృదయుం బుదారబుద్ధియు నుండిన శత్రునినేసిన్
యున్నవవానికి మీహృదయంబిడి మహితపుఁ బ్రీతిం గనుఁడీ

౬ కపటియు ధూర్తుఁడగు మిత్రుఁడే ఘనమగుశత్రుండు
నిపుణతివానిని తొలఁగింపుడు వెండియు మానవులగుడు

౭ జగముపసేనలు రెండుయుద్ధమును సలుపఁగ నిలఁబడియుండెన్
ప్రగతిని బుణ్యపుసేనఁ జేరుఁడీ పాపపుసేనను విడుఁడీ

౮ నిజధర్మంబు పరిత్యజింపకుఁడు భజియింపుఁడు సర్వేశున్
స్వజనము దేశముపోయినఁ బోవును బరువడి మానవులగుడు॥

రాణా—మహాబత్!

మహా—అమర్!

రాణా—నీ దోషమేమియు లేదు. నాదియే దోషము. క్షమింపు సోదరా!

మహా—క్షమింపు సోదరా! (కౌగలించుకొందురు.)

(తెరవాలును)

---

—సంపూర్ణము—

# శుద్ధ పత్రిక

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 2 | 24 | [illegible] | [illegible] |
| 13 | 2 | [illegible] | [illegible] |
| 16 | 12 | [illegible] | [illegible] |
| 32 | 9 | [illegible] | [illegible] |
| 48 | 5 | [illegible] | [illegible] పుత్రుడు |
| 49 | 18 | [illegible] | [illegible] |
| 57 | 4 | [illegible] | అన |
| 65 | 4 | [illegible] | [illegible] |
| ,, | 5 | [illegible] | [illegible] |
| 68 | 17 | [illegible] | [illegible] |